ఆదివారం
1-6-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 250
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ప్రపంచ సుందరి థాయ్‌లాండ్ భామ సుచాత 8లో

ఎల్‌డీఎఫ్... సమ్మిళిత శక్తి

- కేరళలో మళ్లీ అధికారంలోకి వస్తాం
- పరస్పర విశ్వాసం, గౌరవంతో ముందుకు: డి.రాజా

2లో

ఎల్‌డీఎఫ్ ఐక్యంగా ఉందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా వక్కాణించారు. అభిప్రాయ బేధాలు సహజమని, సరైన మాధ్యమాల్లో చర్చల ద్వారా వాటిని పరిష్కరించుకోవచ్చన్నారు. కేరళలో ఎల్‌డీఎఫ్ తిరిగి అధికారంలోకి వస్తుందని, చరిత్ర లిఖిస్తుందని రాజా ఉద్ఘాటించారు.

యుద్ధ విమానాలు కోల్పోయాం

మొదటిసారి అంగీకరించిన సీడీఎస్

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్‌లో వ్యూహాత్మక తప్పిదం కారణంగా యుద్ధ విమానాలను భారత్ కోల్పోయిందని సీడీఎస్ అనిల్ చౌహాన్ మొదటిసారి అంగీకరించారు. మే 8న పాకిస్థాన్ వైమానిక దళంతో జరిగిన భీకర పోరులో ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు సింగపూర్‌లో బ్లూమ్‌బర్గ్ టీవీతో మాట్లాడిన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) అనిల్ చౌహాన్ వెల్లడించారు. కూలిన యుద్ధ విమానాలు రఫేల్, మిగ్ లేదా సుఖోయ్‌లో ఏ శ్రేణికి చెందినవో మాత్రం ఆయన చెప్పలేదు. యుద్ధ విమానాలు కోల్పోయామా లేదా అన్నది కాదు, వాటిని ఎలా కోల్పోయాం, ఆ

- మిగతా 2 లో

పూర్తిస్థాయి డీజీపీగా గుప్తా బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: పూర్తిస్థాయి డీజీపీగా హరీశ్‌కుమార్ గుప్తా శనివారం బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పోలీస్ బాస్‌గా ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన హరీశ్‌కుమార్ గుప్తా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్ జనరల్ పోస్టులో కొనసాగుతూ నాలుగు నెలలుగా ఇంఛార్జి డీజీపీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. హరీశ్‌కుమార్ గుప్తా పదవీ

- మిగతా 2 లో

'జీఎస్టీ రిజిస్ట్రేషన్‌లో అవినీతి'

న్యూఢిల్లీ: జీఎస్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అవినీతి జరుగుతోందంటూ వచ్చిన సోషల్‌మీడియా పోస్ట్‌పై కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ స్పందించారు. జీఎస్టీ నంబర్ పొందేందుకు తాను 'అవినీతికి' పాల్పడబోతున్నానంటూ ఓ వ్యక్తి చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. దీనిపై ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించాలని క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. అంతకుముందు కేంద్ర పరోక్ష పన్నుల బోర్డు కూడా తన స్పందన తెలియజేసింది. జీఎస్టీ రిజిస్ట్రేషన్ గురించి వినోద్ గుప్తా అనే వ్యక్తి లింక్డిన్‌లో ఓ పోస్ట్ పెట్టారు. తన

- మిగతా 2 లో

డ్రగ్ స్మగ్లర్లపై 'జీపీఎస్' నిఘా

చండీగఢ్: మాదకద్రవ్యాల ముఠాల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు పంజాబ్ పోలీసులు వెల్లడించారు. బెయిల్‌పై బయటకు వచ్చే డ్రగ్ స్మగ్లర్ల కదలికలను గుర్తించేందుకుగాను వారి కాళ్లకు జీపీఎస్ ఆధారిత చైన్‌లు అమర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే జమ్మూ కశ్మీర్ పోలీసులు ఈ తరహా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 'చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం

- మిగతా 2 లో

10న భారత్ బంద్

మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రకటన

విశాలాంధ్ర–చింతూరు: జూన్ 10వ తేదీన భారత్ బంద్‌కు మావోయిస్టులు పిలుపునిచ్చారు. 27 మంది మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌కు నిరసనగా ఈ బంద్ చేపట్టనున్నారు. జూన్ 11వ తేదీ నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు అమరుల స్మారక సభలు నిర్వహిస్తున్నట్లు మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రకటించింది. 2024 నుంచి ఇప్పటి వరకు 540 మంది మావోయిస్టులు మృతి చెందారని వెల్లడించింది. శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ ఎందుకు ఆపడం లేదని మావోయిస్టులు ఆ లేఖలో ప్రశ్నించారు. రెండు నెలలుగా తాము సంయమనం పాటించామని తెలిపారు. కేంద్ర, రాష్ట్రాల ఫాసిస్ట్ వైఖరికి నిరసనగా బంద్ పాటిస్తున్నామని స్పష్టంచేశారు. మావోయిస్టు

- మిగతా 2 లో

అత్యాధునిక సౌకర్యాలతో
గోశాలల శ్రీకారం

- 50 ఎకరాల విస్తీర్ణానికి తగ్గకుండా ప్రణాళిక
- కమిటీ ఏర్పాటుకు సీఎం రేవంత్ ఆదేశం

విశాలాంధ్ర – హైదరాబాద్ : గోశాలల ఏర్పాటుకు కమిటీ ఏర్పాటు చేయాలని, నిర్ణీత గడువులోగా కమిటీ పూర్తిస్థాయి ప్రణాళికతో రావాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో గోశాలల అభివృద్ధి, నిర్వహణ, సంరక్షణపై శనివారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఎం మాట్లాడుతూ గోసంరక్షణ, నిర్వహణ సులువుగా ఉండేందుకు వీలుగా గోశాలల ఏర్పాటు ఉండాలని సూచించారు. మొదటి దశలో రాష్ట్రంలోని వెటర్నరీ యూనివర్సిటీ... కళాశాలలు, అగ్రికల్చర్ యూనివర్సిటీ... కళాశాలలు, దేవాలయాల భూముల్లో గోశాలలు ఏర్పాటు చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించాలని అదేశించారు. కనీసం 50 ఎకరాల విస్తీర్ణానికి తగ్గకుండా గోశాలలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మేత మేసేందుకు, స్వేచ్ఛగా తిరిగేందుకు వీలుగా ఉండాలని అన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో గోశాలలు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. నిర్వహణ, సంరక్షణలో ధార్మిక సంస్థలను

- మిగతా 2 లో

కేసీఆర్‌పై ఈగ వాలినా
ఊరుకోం

కవిత

విశాలాంధ్ర–హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత బంజారాహిల్స్‌లో 'తెలంగాణ జాగృతి' కొత్త కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమంలో ప్రజల గొంతుకగా తెలంగాణ జాగృతి సంస్థ పనిచేసిందని అన్నారు. దీన్ని ప్రారంభించి 18 ఏళ్లయింది, కేసీఆర్... ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితో జాగృతి ఏర్పాటైంది, జయశంకర్ చెప్పిన తర్వాతే తెలంగాణ జాగృతి స్థాపించాం, ప్రొఫెసర్ నాకు దిశానిర్దేశం

- మిగతా 2 లో

సంక్షేమానికే పెద్దపీట

విశాలాంధ్ర బ్యూరో–కొత్తగూడెం: తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకబడిన వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. ఆయా వర్గాలకు రాజకీయ అధికారం కల్పించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో శనివారం నిర్వహించిన ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల సమ్మేళనంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ దేశంలోని అన్ని రకాల వనరులను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇవ్వాలనేది కాంగ్రెస్ లక్ష్యమని చెప్పారు. వెనుకబడిన వర్గాల సంక్షేమానికి భూగరిష్ఠ పరిమితి చట్టం తెచ్చామన్నారు. భూమిలేని ఎస్సీ, ఎస్టీలకు భూముల పంపిణీ, 6.70 లక్షల ఎకరాలను పేదలకు అందజేయడాన్ని గుర్తుచేశారు. గిరిజనుల భూమికి సాగునీటి కోసం 'ఇందిరా సౌర గిరిజల వికాసం' పథకాన్ని ప్రారంభించామని, అందుకోసం రూ.12,500 కోట్లు కేటాయించామని చెప్పారు. 2013లో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని భట్టి విక్రమార్క వక్కాణించారు. సబ్ ప్లాన్ నిధుల కింద రూ 17,169 కోట్లతోపాటు గతంలో మిగిలి ఉన్న 1,296 కోట్లను కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఆత్మగౌరవం, సమ సమాజ నిర్మాణానికి అనుగుణంగా సంక్షేమ

పథకాలు ప్రవేశపెడుతున్నట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్ ప్లాన్ నిధులను గిరిజనుల కోసం ఖర్చు పెట్టలేదని, వాటిని దారి మళ్లించారని విమర్శించారు. తమ ప్రభుత్వంలో ఏ కుటుంబానికి ఏ పథకాలు అందజేస్తున్నాం... ఏ పథకానికి ఎంత ఖర్చు చేస్తున్నాం వంటి అన్ని వివరాలను రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి త్వరలోనే స్పష్టం చేస్తామని భట్టి తెలిపారు. సంక్షేమ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. గిరిజనుల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

- ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌కు రూ.17,169 కోట్లు
- ఉపాధి పథకంలో గిరిజనుల కేటాయింపు ఓ రికార్డు
- ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల సమ్మేళనంలో భట్టి విక్రమార్క

బీఆర్ఎస్ హయాంలో ధరణి పేరిట అసైన్డ్ భూముల హస్తగతానికి దుర్మార్గపు చర్యలు జరిగాయని, ఎన్నికలప్పుడు తామిచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే జవాబుదారీతనంతో భూభారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చామని భట్టి విక్రమార్క తెలిపారు. రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకంలో గిరిజనుల కోసం ప్రత్యేకంగా రూ.1000 కోట్లు కేటాయించడం ఓ రికార్డు అన్నారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం కాపాడేందుకే నల్లమల డిక్లరేషన్ తెచ్చామన్నారు. రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. రూ.10 లక్షల వైద్య పరిమితి కలిగిన ఆరోగ్యశ్రీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జల్, జంగల్, జమీన్ వంటి ఆదివాసీ ఉద్యమ

- మిగతా 2 లో

త్వరలోనే భారత్‌తో వాణిజ్య ఒప్పందం: ట్రంప్ 2లో

అధికారుల చిత్తశుద్ధి ప్రశంసనీయం

- సరస్వతి పుష్కరాల విజయవంతంతో ప్రభుత్వానికి మంచిపేరు
- ప్రధాన అకర్షణగా సరస్వతి నవరత్న మాలా హారతి: మంత్రి దుద్దిళ్ల

అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ప్రభుత్వం అలోచన మాత్రమే చేస్తుంది...దాన్ని అచరణలో పెట్టాల్సింది మీరేనని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. 2లో

తెలంగాణ అభివృద్ధే
మా అభిమతం

ఇంగ్లండ్‌లోని పీడీఎస్ఎల్ నాలెడ్జ్ సెంటర్ ప్రారంభోత్సవంలో కేటీఆర్ 2లో

ఇదీ లోకం!

అవును..!.. అవును!

B.TECH. PROGRAMMES - MAJORS
(Admission based on VITEEE Rank)
- Computer Science and Engineering (CSE)
- CSE (Artificial Intelligence and Machine Learning)
- CSE (Blockchain)
- CSE (Cyber Security)
- CSE (Data Analytics)
- CSE (Software Engineering)
- CSE and Business Systems (in collaboration with TCS)
- Electronics and Communication Engineering (ECE)
- ECE (Embedded Systems)
- ECE (VLSI)
- Mechanical Engineering
- Mechanical Engineering (Automotive Design)
- Mechanical Engineering (Robotics)

17 Minors / Double Major options (within 4 Years)

Eligibility Criteria : Admission based on VITEEE Rank and should have secured a minimum aggregate of 60% in Physics, Chemistry and Mathematics in the qualifying examination (+2/Intermediate)

5-YEAR INTEGRATED PROGRAMMES
- M.Tech. Software Engineering
- M.Tech. CSE (In collaboration with Virtusa)

Eligibility Criteria : Should have secured a minimum aggregate of 65% in Physics, Chemistry and Mathematics in the qualifying examination (+2/Intermediate)

NON ENGINEERING PROGRAMMES
- B.B.A. - 3 Yrs or B.B.A. (Hons.) - 4 Yrs
- B.Com. (Finance) - 3 Yrs or B.Com. (Finance) (Hons.) - 4 Yrs
- B.B.A., LL.B. (Hons.) - 5 Yrs
- B.A., LL.B. (Hons.) - 5 Yrs
- B.Sc. - M.Sc. Data Science (Dual Degree)
- B.A. - M.A. (Dual Degree)

Eligibility Criteria for Non Engg Programmes: Admission based on Personal Interview and 55% in +2/Intermediate

For Law Programme : Admission based on Personal Interview and 45% in +2/Intermediate

PG PROGRAMMES
- M.Tech. (VLSI Design)
- M.Sc. Data Science
- M.Sc. Chemistry
- M.Sc. Physics (Energy Science and Technology)

Eligibility Criteria : Admission based on VITMEE Rank and the Undergraduates should have secured a minimum aggregate of 60% for applying PG programme

Ph.D PROGRAMMES
Engineering | Sciences | Management
Commerce | Law | Humanities | Languages

For more details about Non Engineering programmes, please visit :
https://www.vitap.ac.in/ug-pg-admissions
Limited Seats available
Scan for non engineering programmes info

HIGHLIGHTS
17000+ Students from 27 States 6 UT's 9 Countries
2+2 3+1 Study options in Universities abroad
561+ Patents Published
150+ MoU's with Industry Partners
583 Super Dream* & Dream** Offers Still counting Data for 2025 Graduating Batch *CTC above 10 Lakhs ** CTC above 6 Lakhs

VIT-AP University, Beside AP Secretariat, Amaravati, Andhra Pradesh-522241
admission@vitap.ac.in 08632370444 7901091283 / 7901311658
Scan for more info
www.vitap.ac.in vitap.university vitap.university vit-ap VITAPuniversity VITAP

త్వరలోనే భారత్‌తో వాణిజ్య ఒప్పందం: ట్రంప్

వాషింగ్టన్: భారత్‌తో వాణిజ్య ఒప్పందం త్వరలోనే జరగబోతోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. భారత్‌తో టారిఫ్ చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. వాణిజ్య ఒప్పందం జరిగే సమయం ఆసన్నమైందన్నారు. భారత్- పాక్ ఘర్షణలకు దిగితే వాణిజ్య ఒప్పందం అవకాశం ఉండకపోవచ్చని తెలిపారు. వాణిజ్య చర్చలు జరిపేందుకు పాకిస్థాన్ ప్రతినిధులు కూడా వచ్చేవారం వాషింగ్టన్‌కు రానున్నట్లు ట్రంప్ వెల్లడించారు. భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందానికి సంబంధించి తొలి దశ చర్చలు జరుగుతున్నాయి. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్... అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్‌తో సమావేశమయ్యారు. సెప్టెంబరు-అక్టోబరు నాటికి ఒప్పందాన్ని ఖరారు చేయాలని రెండు దేశాలు భావిస్తున్నాయి. ఈ ఒప్పందం క్రమంలో పరస్పర మార్కెట్ల వినియోగం, స్థానిక నిబంధనల అమలు, సుంకాల మినహాయింపులకు పరిమితులపై అవగాహనకు వచ్చే అవకాశం ఉంది.

అలా చేస్తే ఆంక్షలు తప్పవు

ఇజ్రాయిల్‌కు ఫ్రాన్స్, జర్మనీ హెచ్చరిక

సింగపూర్: గాజాలో మానవతా సంక్షోభాన్ని టెల్ అవీవ్ నివారించకపోతే ఇజ్రాయిల్‌పై ఆంక్షలు విధించే అవకాశాన్ని పరిశీలిస్తామని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్, జర్మనీ విదేశాంగమంత్రి జొహాన్ వేర్వేరుగా హెచ్చరించారు. గాజాలో మానవీయ పరిస్థితులను అధ్యయనం చేసిన తర్వాత ఇజ్రాయిల్‌కు కొత్త ఆయుధాలు సరఫరా చేయాలా లేదా అన్న విషయంలో నిర్ణయం తీసుకుంటామని జొహాన్ వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో గాజాను ఒంటరి చేస్తే, ఇజ్రాయిల్‌కు అపరిమిత స్వేచ్ఛ లభించినట్లే అవుతుందని మాక్రాన్ అన్నారు. గాజాలో ఆకలి సంక్షోభం తీవ్రమవుతున్న వేళ, అంతర్జాతీయ సమాజం స్పందించాలని, పలస్తీనాను దేశంగా గుర్తించాలని, ఇది నైతిక బాధ్యత మాత్రమే కాదు రాజకీయ అవసరమని మాక్రాన్ పిలుపునిచ్చారు. అదే సమయంలో ఉక్రెయిన్ గురించీ ఆందోళన వ్యక్తంచేశారు.

అమెరికా, ఇండో-పసిఫిక్ దేశాలు ఉక్రెయిన్‌ను ఒంటరి చేయరాదని, దానివల్ల చైనాతో పొంచి ఉన్న ముప్పు విషయంలో ఇబ్బందులు వస్తాయని మాక్రాన్ హెచ్చరించారు. యూరప్‌లోని తన దళాలను ఉపసంహరించుకొని వాటిని ఇండో-పసిఫిక్‌లో మోహరించాలని అమెరికా యోచిస్తున్న తరుణంలో మాక్రాన్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది.

ఉక్రెయిన్‌పై 100కుపైగా డ్రోన్లతో రష్యా దాడి

కీవ్: రష్యా, ఉక్రెయిన్ మధ్య ఓ వైపు శాంతి చర్చలు మరోవైపు దాడులు కొనసాగుతున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు కీవ్‌పై దాదాపు వందకు పైగా డ్రోన్లు, ఐదు క్షిపణులను మాస్కో ప్రయోగించింది. ఈ మేరకు ఉక్రెయిన్ వైమానిక దళం పేర్కొంది. 42 డ్రోన్లను ధ్వంసం చేసిందని వెల్లడించింది. జపోరిజ్జియాలోని ఫ్రంట్-లైన్ గ్రామం డోలింకాపై దాడిలో చిన్నారి మృతి చెందగా భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు అక్కడి గవర్నర్ ఇవాన్ ఫెడోరోవ్ తెలిపారు. మాస్కోపై కీవ్ కూడా డ్రోన్లతో ప్రతీకార దాడులు చేసింది. దీంతో రష్యాలో 14మంది గాయపడ్డారు. భవనాలు ధ్వంసమయ్యాయని రష్యా ఆరోగ్య శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది.

రేపు ఇస్తాంబుల్‌లో మళ్లీ చర్చలు

టర్కీ, ఇస్తాంబుల్‌లో రష్యాతో ప్రత్యక్షంగా శాంతి చర్చలను తిరిగి ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఉక్రెయిన్ ప్రభుత్వ సలహాదారు ఆండ్రీ యెర్మాక్ వెల్లడించారు. చర్చలు ప్రారంభించడానికి ముందుగానే యుద్ధం ముగింపుపై వైఖరిని తెలుపుతూ హామీ పత్రాన్ని రష్యా అందజేయాల్సి ఉంటుందని షరతు పెట్టారు.

విదేశీ ఉక్కు దిగుమతులపై 50 శాతం సుంకం

పెన్సిల్వేనియా: విదేశీ ఉక్కు దిగుమతులపై సుంకాలను 25శాతం నుంచి 50శాతానికి పెంచాలని ట్రంప్ ప్రభుత్వం యోచిస్తోంది. అమెరికాలో ఉక్కుపై సుంకాలను 50 శాతానికి పెంచుతున్నాం. తద్వారా దేశీయ ఉక్కు పరిశ్రమను మరింత రక్షణ లభించగలదని పెన్సిల్వేనియా ర్యాలీలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. కష్టాల్లో ఉన్న పరిశ్రమలకు సహాయం చేయడాని ఉక్కు, అల్యూమినియం సుంకాలను 25 శాతం మేర పెంచనున్నట్లు వెల్లడించారు. కెనడా, బ్రెజిల్, మెక్సికో, దక్షిణ కొరియా, అమెరికాలోకి సుంకం లేకుండా వచ్చే లక్షలాది టన్నుల విదేశీ ఉక్కు అల్యూమినియం దిగుమతులకు ఈ సుంకం వర్తిస్తుందన్నారు.

గాజాలో ప్రతి 20 నిమిషాలకు ఓ చిన్నారి మృతి

జెరూసలేం: గాజాలో ప్రతి 20 నిమిషాలకు ఒక చిన్నారి చనిపోతున్నట్లు ఐక్య రాజ్యసమితి బాలల హక్కుల సంస్థ(యునిసెఫ్) వెల్లడించింది. 2023 అక్టోబర్ 7 నుంచి ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడుల్లో 50,000 మందికి పైగా పిల్లలు బాధితులయ్యారని తెలిపింది. గాజాకు మానవతా సాయం అందకుండా అడ్డుకొని ప్రజలను పస్తులు ఉంచి ఇజ్రాయిల్ చంపేస్తోందని ఐక్య రాజ్య సమితి (ఐరాస) మానవతావాది చీఫ్ టామ్ ఫ్లెచర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఆకలిని యుద్ధ నేరంగా చూడాలన్నారు. ఇజ్రాయిల్ దిగ్బంధనంతో ఆహారం, మందులు, ఇంధనం గాజాకు చేరలేదు. అంతర్జాతీయ ఒత్తిడి తీవ్రమైన తర్వాత మాత్రమే గాజాకు పరిమిత సహాయం అనుమతించబడింది.

10న భారత్ బంద్

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రకమిటీ అధికార ప్రతినిధి అభయ్ లేఖ విడుదల చేశారు. మే 21 భారత విప్లవోద్యమ చరిత్రలో చీకటి రోని లేఖలో ప్రస్తావించారు. హిందుత్వ, ఫాసిస్టులు, రక్తపిపాసులు, నరహంతకులైన ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా... మావోయిస్టులపై ప్రత్యక్ష యుద్ధం ప్రకటించారని ఆరోపించారు. భారత సైన్యం, పారామిలటరీ, కమాండో బలగాలు చత్తీస్‌గఢ్ పోలీసులు, నారాయణపూర్ జిల్లా మాడ్ ప్రాంతంలో చేపట్టిన జాయింట్ ఆపరేషన్‌లో మావోయిస్టు కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు సహా పీఎల్‌జీఏకి చెందిన వివిధ స్థాయి నాయకత్వ కామ్రేడ్లను కోల్పోయామని తెలిపారు. ఈ హత్యాకాండకు వ్యతిరేకంగా జూన్ 10న భారత్ బంద్ పాటించాలని దేశ ప్రజానీకానికి పిలుపునిస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా జూన్ 11 నుంచి ఆగస్టు 3 వరకు దేశవ్యాప్తంగా బసవరాజు సహా 27 మంది అమరవీరుల స్మారక సభలు జరపాల్సిందిగా పిలుపునిస్తున్నామని మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

కేసీఆర్‌పై ఈగ వాలినా ఊరుకోం

(మొదటిపేజీ తరువాయి)

చేశారు, ఇకపై కొత్త కార్యాలయం నుంచే జాగృతి కార్యకలాపాలు జరుగుతాయి' అని అన్నారు. 'ప్రత్యేక రాష్ట్రం కొట్లాడి తెచ్చిన కేసీఆర్‌కు నోటిసులిస్తారా. కేసీఆర్‌కు నోటీసులివ్వడమంటే తెలంగాణకు ఇచ్చినట్టే. తెలంగాణను కోటి ఎకరాల మాగాణి చేసినందుకు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారా... అసలు అది కాళేశ్వరం కమిషనా... కాంగ్రెస్ కమిషనా... కేసీఆర్ పిడికిలి బిగిస్తేనే తెలంగాణ వచ్చింది. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ జూన్ నాల్గో తేదీన ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేపడుతున్నాం. కేసీఆర్‌కు ఒక కన్ను బీఆర్ఎస్ అయితే మరో కన్ను తెలంగాణ జాగృతి. కేసీఆర్‌పై ఈగ వాలినా ఊరుకోం. గోదావరి జలాల్లో వాటా కాపాడకపోతే తెలంగాణ జాగృతి ఉద్యమిస్తుంది' అని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు.

రేవంత్ ... ఇప్పటికైనా జై తెలంగాణ అనండి

గత పదేళ్ల కేసీఆర్ పాలనకు... ఇప్పటి కాంగ్రెస్ పాలనకు ఎంతో తేడా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి కనీసం జై తెలంగాణ కూడా అనరు... ఇప్పటికైనా జై తెలంగాణ అని నినదించండి. తెలంగాణ అవతరణ దినోత్సవం నాడు అమరవీరులకు నివాళు లర్పించాలి. నివాళులర్పించని వారికి కుర్చీలో కూర్చునే అర్హత లేదు. ఉద్యమకారులపైకి గన్ తీసుకెళ్లిన వాళ్లు... ప్రస్తుతం రాష్ట్రానికి సీఎం అయ్యారు. తెలంగాణ పథకాలకు తెలంగాణ వారి పేర్లే పెట్టాలి. తెలంగాణ యువ వికాసం అని ఉండాలి... రాజీవ్ యువవికాసం అని కాదు. వేరే రాష్ట్రం తెలంగాణ నీళ్లు తీసుకెళ్తుంటే మాట్లాడలేని పరిస్థితి రేవంత్‌ది. బనకచర్ల ప్రాజెక్ట్‌పై ఎందుకు మాట్లాడటం లేదు. గోదావరి నీళ్లు శాశ్వతంగా దూరం కాబోతున్నాయి. ఏపీ ప్రయోజనాల కోసమే రేవంత్ పనిచేస్తున్నారు' అని కవిత అన్నారు.

సంక్షేమానికే పెద్దపీట

(మొదటిపేజీ తరువాయి)

ఆకాంక్షలను చట్టాలుగా చేర్చి కాంగ్రెస్ ప్రభుత్వం భూ సంస్కరణలు తెచ్చినట్లు చెప్పారు. ఇంటిగ్రేటెడ్ నూతన విద్యావిధానం ద్వారా విద్యాశాఖను ప్రగతి పథంలో నడుపుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 90 లక్షల కుటుంబాలకు సన్న బియ్యం సరఫరా అవుతున్నదని, ఇందుకుగాను రూ. 13,500 కోట్లు వెచ్చిస్తున్నట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకంతో లక్షల కుటుంబాలు నూటికి నూరు శాతం లబ్ధి పొందుతున్నాయని తెలిపారు. ఈ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు భట్టి విక్రమార్క సూచించారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు రామ సహాయం రఘురాం రెడ్డి, పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, జారె ఆదినారాయణ, డాక్టర్ రామచందర్ నాయక్, ఆదివాసీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గోశాలల శ్రీకారం

(మొదటిపేజీ తరువాయి)

భాగస్వాములను చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. వీటి పూర్తిస్థాయి బడ్జెట్ అంచనాలతో ప్రణాళికలు రూపొందించాలన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎంకేపల్లిలో ఏర్పాటు చేయనున్న గోశాల డిజైన్లను సీఎం పరిశీలించారు. షెడ్ల నిర్మాణం, ఇతర డిజైన్లలో కొద్దిపాటి మార్పులను అధికారులకు సూచించారు. సీఎంఓ అధికారులు శేషాద్రి, శ్రీనివాసరాజు, మాణిక్ రాజ్, అజిత్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్, హెచ్ఎం ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పశుపోషణ విభాగం డైరెక్టర్ బి.గోపి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

అధికారుల చిత్తశుద్ధి ప్రశంసనీయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ప్రభుత్వం ఆలోచన మాత్రమే చేస్తుంది...దాన్ని ఆచరణలో పెట్టాల్సింది మీరేనని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. భూపాలపల్లి పుష్ప గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన 'సరస్వతి పుష్కరాలు... ఏ డే ఆఫ్ థ్యాంక్స్'కు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని 'సరస్వతి పుష్కరాల' నిర్వహణను ప్రభుత్వం ఒక సవాలుగా తీసుకుందని, అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు రూ. 40 కోట్లు కేటాయించిందన్నారు. ఒకరికొకరు సమన్వయం చేసుకుని... పుష్కరాలను అత్యంత విజయవంతంగా నిర్వహించారని కొనియాడారు. 30 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి... కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారంటే దానికి మీరు పడిన శ్రమ, చూపిన చొరవ అని అన్నారు. కలెక్టర్, ఎస్పీ మార్గ నిర్దేశనంలో 33 శాఖలకు చెందిన అటెండర్ నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారి వరకూ ప్రతి ఒక్కరూ మూడు నెలలు కష్టపడ్డారని, పుష్కరాలను విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించారని అందుకు ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. కాశీ పండితుల చేతుల మీదుగా ప్రతి రోజు సాయంత్రం నిర్వహించిన "సరస్వతి నవరత్న మాలా హారతి" ప్రధాన ఆకర్షణగా నిలిచిందన్నారు. ఆర్టీసీకి సుమారు రూ.10 కోట్ల ఆదాయం వచ్చిందని, ఆర్టీసీ బస్సుల్లో "ఉచిత ప్రయాణం" అవకాశాన్ని వినియోగించుకొని లక్షలాది మంది సోదరీమణులు పుష్కరాలకు విచ్చేశారని తెలిపారు. మీడియా మిత్రులు పుష్కరాల సమాచారాన్ని భక్తులకు తెలియజేసి విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించారన్నారు. స్వచ్ఛంద సంస్థల కృషి ప్రశంసనీయమన్నారు. 2027లో రానున్న గోదావరి పుష్కరాలను మరింత వైభవంగా నిర్వహించాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. కాళేశ్వరానికి వెళ్లే జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటాన్నామని, త్వరలో కాళేశ్వరం, ఇతర ప్రాంతాల్లో కొత్త బస్సు డిపోల నిర్మాణానికి శ్రీకారం చుడతామని చెప్పారు. ఓవైపు అభివృద్ధి... మరోవైపు సంక్షేమంలో తెలంగాణను దేశంలోనే తొలిస్థానంలో నిలిపేందుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ విమానాలు కోల్పోయాం

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత ఏం చేశామన్నదే ముఖ్యమని సీడీఎస్ నొక్కిచెప్పారు. పోర్టర్ మరోమారు అదే ప్రశ్న అడిగే 'అవును నిజమే. యుద్ధ విమానాలు కోల్పోయం' అని ఆయన బదులిచ్చారు. 'యుద్ధ విమానాలు కోల్పోవడం వ్యూహాత్మక తప్పిదం వల్లనే జరిగింది. దానిని వెంటనే గ్రహించి సరిదిద్దుకున్నాం. ఆపై రెండు రోజుల్లో అన్ని యుద్ధ విమానాలు దాడికి సిద్ధమయ్యాయి. సుదూర లక్ష్యాలపై విరుచుకుపడ్డాయి' అని సీడీఎస్ తెలిపారు. ఆరు భారత విమానాలు కూల్చినట్లు పాకిస్థాన్ చేసిన వాదనలో నిజం లేదని ఆయన కొట్టిపారేశారు. అయితే కోల్పోయిన విమానాలు ఎన్ని, అవి ఏ రకమైనవో సీడీఎస్ వెల్లడించలేదు. అణు యుద్ధాన్ని తప్పించామన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాదనపై స్పందించేందుకు నిరాకరించారు. 'కన్వెన్షనల్ ఆపరేషన్లకు అణు యుద్ధాలకు మధ్య వ్యత్యాసం ఉందన్నది నా అభిప్రాయం' అని సీడీఎస్ చెప్పారు. 'పరిస్థితిని నియంత్రించేందుకు పాకిస్థాన్‌తో చర్చలకు అన్ని మాధ్యమాలూ తెరిచేవున్నాయి. అణ్వస్త్రాల అవసరం రాకుండానే అన్నింటిని పరిష్కరించుకోవచ్చు. ఇందుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయి' అని సీడీఎస్ అభిప్రాయపడ్డారు. చైనా ఆయుధాలను పాకిస్థాన్ వినియోగించినట్లు వాదనలపై స్పందిస్తూ అవేమీ మనమీద పనిచేయలేదన్నారు. పాకిస్థాన్ వైమానిక స్థావరాలపై భారత్ సమర్థంగా దాడి చేసిందన్నారు. భారత్ సొంతంగానే పాకిస్థాన్‌ను నియంత్రించగలదని, ఆ దేశానికి వేరొకరి సహాయం కావాలేమో మనకు అక్కర్లేదని వ్యాఖ్యానించారు. 'రెడ్ లైన్స్' గీశాం... భవిష్యత్ పరిణామాలు పాకిస్థాన్ వైఖరిపై ఆధారపడి ఉంటాయని వేరొక ప్రశ్నకు సీడీఎస్ సమాధానం చెప్పారు. ఇదిలావుంటే, కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ ఇదే వ్యవహారంలో కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్-పాకిస్థాన్ మధ్య ఘర్షణలపై రివ్యూ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 1999 జులై 29న అప్పటి వాజ్‌పేయి ప్రభుత్వం కార్గిల్ యుద్ధంపై రివ్యూ కమిటీ వేసిందని గుర్తుచేశారు. ఈ కమిటీ కీలక విషయాలను వెల్లడించిందన్నారు. ప్రధాని మోదీ సైతం ఆపరేషన్ సిందూర్‌పై రివ్యూ కమిటీ వేయాలని, తద్వారా అన్ని వివరాలు తెలపాలని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు.

పూర్తిస్థాయి డీజీపీగా గుప్తా బాధ్యతల స్వీకరణ

(మొదటిపేజీ తరువాయి)

విరమణ తేదీతో సంబంధం లేకుండా డీజీపీగా మే 31 నుంచి రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. ఈ ఏడాది జనవరిలో ద్వారకా తిరుమలరావు డీజీపీగా పదవీ విరమణ చేసిన తర్వాత హరీశ్‌కుమార్ గుప్తాకు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఇంఛార్జిగా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. హరీశ్‌కుమార్ గుప్తాను సీనియర్ పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

డ్రగ్ స్మగ్లర్లపై 'జీపీఎస్' నిఘా

(మొదటిపేజీ తరువాయి)

కింద కేసుల్లో నిందితులపై నిఘా పెట్టేందుకు జమ్మూకశ్మీర్ పోలీసులు ప్రత్యేక డివైజ్‌లు ఉపయోగిస్తున్నారు. ఇటువంటి ప్రతిపాదనను న్యాయకోణంలో పరిశీలిస్తున్నాం. తీవ్ర నేరాభియోగాలు ఎదుర్కొంటూ... బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత నిందితుల కదలికలను గమనించేందుకు వారి పాదాలకు జీపీఎస్ ఆధారిత చైన్‌లు అమర్చుతాం' అని పంజాబ్ డైరెక్టర్ జనరల్ గౌరవ్ యాదవ్ తెలిపారు. గోప్యతా హక్కును దృష్టిలో ఉంచుకొని తగు చర్యలు తీసుకుంటామని పంజాబ్ డీజీపీ పేర్కొన్నారు. గ్రామ పెద్దలు, పంచాయతీలను పరిగణనలోకి తీసుకొని ఈ పర్యవేక్షణ వ్యవస్థను రూపొందించామన్నారు. జిల్లాల్లో మాదకద్రవ్యాల స్మగ్లింగ్‌కు పాల్పడుతూ అరెస్టయ్యే వారి సమాచారాన్ని సేకరించేందుకు ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్ ఉపయోగిస్తామని చెప్పారు.

తెలంగాణ అభివృద్ధే మా అభిమతం

విశాలాంధ్ర - హైదరాబాద్: దిగ్గజ కార్పొరేట్ సంస్థలకు తెలంగాణ బిడ్డలు సేవలు అందించడం మనందరికీ గర్వకారణం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా... తెలంగాణ అభివృద్ధి చెందాలన్నదే తమ అభిమతమని తెలిపారు. ఇండియా ఫస్ట్, తెలంగాణ ఫస్ట్ అన్నదే తమ విధానం అని పేర్కొన్నారు.

తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు కోసం తమ సర్వశక్తులు ఉపయోగిస్తామన్నారు. ఇంగ్లండ్‌లోని వార్విక్ యూనివర్సిటీ లో ఏర్పాటు చేసిన పీడీఎస్ఎల్ నాలెడ్జ్ సెంటర్‌ను కేటీఆర్ ప్రారంభించారు. ఈ అద్భుతమైన అవకాశాన్ని ఇచ్చిన పీడీఎస్ఎల్‌కు ధన్యవాదాలు తెలిపారు. పీడీఎస్ఎల్ కార్యకలాపాలను తెలంగాణలో విస్తరించాలని కోరారు. ఇంగ్లండ్ లో యూనివర్సిటీ, పరిశ్రమల మధ్య ఉన్న పరస్పర సహకారం ఆశ్చర్యపరిచిందన్నారు. మెక్‌లారెన్, ఆస్టన్ మార్టిన్, జాగ్వార్, ల్యాండ్ రోవర్ వంటి దిగ్గజ ఆటోమోటివ్ కంపెనీలకు రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సేవలను అందించే పీడీఎస్ఎల్ సంస్థ, వార్విక్ యూనివర్సిటీ లో తన నాలెడ్జ్ సెంటర్ ప్రారంభించుకోవడం తెలంగాణ టాలెంట్ కు నిదర్శనం అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వినూత్న విధానాలతోనే ఆటోమోటివ్ హబ్ గా పూణే, చెన్నైల సరసన హైదరాబాద్ నిలిచిందన్నారు. తమ ప్రభుత్వ కాలంలోనే ఐటీ, లైఫ్ సైన్సెస్‌తో పాటు ఆటోమోటివ్ రంగంలోనూ తెలంగాణ సత్తా చాటిందన్నారు.

కేవలం రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ కే పరిమితం కాకుండా తయారీ రంగంలో కూడా తెలంగాణను నెంబర్ వన్‌గా నిలిపేందుకు తమ ప్రభుత్వం తీసుకువచ్చిన పాలసీలు ఉపయోగపడతాయన్నారు. భారతదేశంలో ఫార్ములా ఈ రేసింగ్ ఛాంపియన్‌షిప్‌ను నిర్వహించిన మొదటి రాష్ట్రం తెలంగాణ అన్నారు. తమ ప్రభుత్వ నిరంతర కృషితో అంతర్జాతీయ కంపెనీలకు కొత్త చిరునామాగా తెలంగాణ మారిందన్నారు. గూగుల్, అమెజాన్, ఫేస్ బుక్ వంటి కార్పోరేట్ దిగ్గజాలు తమ అతిపెద్ద కార్యాలయాలను హైదరాబాద్ లో ప్రారంభించాయని గుర్తుచేశారు. తమ తొమ్మిదేండ్ల కాలంలో ఐటీ ఉద్యోగాలు, ఎగుమతులతో పాటు ఇతర రంగాల్లోనూ తెలంగాణ అద్భుతంగా పురోగతి సాధించిందన్నారు.

పీడీఎస్ఎల్ డైరెక్టర్ క్రాంతి పుప్పాల మాట్లాడుతూ...కేటీఆర్ ఆలోచనలు, పనితీరు కేవలం తెలంగాణకు మాత్రమే పరిమితం కాలేదన్నారు. ఆయన చేసిన పనులు, తీసుకొచ్చిన విధానాలు ముఖ్యంగా ఇన్నోవేషన్ రంగానికి చేసిన కృషితో ఐటీ ఒక్కటే కాదు అనేక రంగాల్లోనూ తెలంగాణ అగ్రగామిగా నిలబడిరదన్నారు. గ్లోబల్ లీడర్ గా ఎదిగిన కేటీఆర్ చేతుల మీదుగా తమ నాలెడ్జ్ సెంటర్ ను ప్రారంభించుకోవడం తమ కంపెనీ కి అత్యంత గౌరవం అని క్రాంతి అన్నారు.

కాళేశ్వరంపై ఉత్తమ్‌ది తప్పుడు ప్రచారం: హరీశ్‌రావు

విశాలాంధ్ర - హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. కాళేశ్వరం నుంచి నీరు పారలేదని మాట్లాడుతున్నారని... ఈ ప్రాజెక్ట్‌లో భాగమైన రంగనాయక సాగర్ నుంచి ఇక్కడ పొలాలకు నీళ్లు వచ్చింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవపూర్‌లో శనివారం గంగమ్మ ఆలయ వార్షికోత్సవం జరిగింది. ఇక్కడికి విచ్చేసిన ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాళేశ్వరంతో ఉపయోగం లేదని చెప్పిన ఉత్తమ్ ... రాఘవాపూర్ చెరువులో నీళ్లు ఎక్కడి నుంచి వచ్చాయో సమాధానం చెప్పాలన్నారు. కాలేశ్వరం జలాలతో చెరువులు మత్తళ్లు పారుతున్నాయని తెలిపారు. 'మిషన్ కాకతీయతో చెరువులు బాగు చేసుకుని, కాళేశ్వరం ప్రాజెక్టులతో అనుసంధానం చేసుకున్నామని వివరించారు. కాళేశ్వరం నీళ్లతో రెండు పంటలు పండిరచుకుంటున్నామని, కొంతమంది హైదరాబాద్‌లో కూర్చుని ఏం తెలియకుండా మాట్లాడుతున్నారంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్ బతుకుదెరువు చూపిస్తే రేవంత్ ప్రభుత్వం బతుకుదెరువును ఆగం చేసిందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ రావాలని, మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.

ఇండో-పసిఫిక్‌లో చైనాను అడ్డుకుంటాం

అమెరికా

వాషింగ్టన్: ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా నుంచి ఆర్థిక, మిలిటరీ ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ తెలిపారు. ఆ ప్రాంతంలో చైనా దూకుడు నేపథ్యంలో తైవాన్‌లో సంఘర్షణ తలెత్తే ప్రమాదం ఉందన్నారు. చైనా నుంచి ముప్పు ఎదురైనట్లైతే మిత్రపక్షాలకు అమెరికా అండగా నిలుస్తుందని చెప్పారు. భౌగోళిక, సముద్ర వివాదాల పరిష్కారంలో, తైవాన్ విషయంలో చైనా ఏకపక్షంగా వ్యవహరిస్తోందన్నారు. పనామా కాలువపై చైనా ప్రభావాన్ని తగ్గించడానికి కలిసి కృషి చేద్దామని యూరోపియన్ దేశాలకు హెగ్సెత్ పిలుపునిచ్చారు. దీనికోసం రక్షణ వ్యయాన్ని తమ స్థూల దేశీయోత్పత్తిలో ఐదు శాతానికి పెంచాలని సూచించారు. ఇండో-పసిఫిక్ దేశాలకు అమెరికా మద్దతు వల్ల స్థానిక ప్రభుత్వాలు సాంస్కృతిక.. వాతావరణ సమస్యలపై పశ్చిమ దేశాలతో పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉండదని హెగ్సెత్ అన్నారు.

ఎల్‌డీఎఫ్... సమ్మిళిత శక్తి

న్యూఢిల్లీ: ఎల్‌డీఎఫ్ ఐక్యంగా ఉందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా వక్కాణించారు. అభిప్రాయ బేధాలు సహజమని, సరైన మాధ్యమాల్లో చర్చల ద్వారా వాటిని పరిష్కరించుకోవచ్చన్నారు. కేరళలో ఎల్‌డీఎఫ్ తిరిగి అధికారంలోకి వస్తుందని, చరిత్ర లిఖిస్తుందని రాజా ఉద్ఘాటించారు. ఎల్‌డీఎఫ్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం లేదన్న ఆరోపణలను తోసిపుచ్చారు. పరస్పర విశ్వాసం, గౌరవం, సహనం, సహకారంతో కూడిన సమ్మిళిత శక్తిగా ఎల్‌డీఎఫ్‌ను అభివర్ణించారు. ఉమ్మడి నిర్ణయాలతో ముందుకెళుతున్నట్లు తెలిపారు. ఎల్‌డీఎఫ్ పక్షాలు ఒకదానిపై ఒకటి ఆధారపడి పని చేస్తాయని అన్నారు. ఫాసిస్టు మతవాదాన్ని ప్రతిఘటించేందుకు నమ్మకమైన, స్థిరమైన రాజకీయ శక్తిగా ప్రజల నమ్మకాన్ని ఎల్‌డీఎఫ్ పొందగలగాలని ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాజా నొక్కిచెప్పారు. సీపీఎం నాయకులపై ఈడీ కేసులను ప్రస్తావిస్తూ రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యం చేసుకోవడం కోసం కేంద్ర దర్యాప్తు సంస్థలను బీజేపీ దుర్వినియోగిస్తున్నదని విమర్శించారు. అసలు ఇటువంటి ఆరోపణలు ఎందుకు వస్తున్నాయనే దానిపై పార్టీలకు ఆత్మపరిశీలన అవసరమని రాజా సూచించారు. దేశానికి సంక్షేమం, అభివృద్ధి నమూనాలు అందిస్తూ కేరళ మార్గదర్శిగా నిలుస్తున్నదన్నారు. ఉద్యోగాలు, విద్య, ఆరోగ్యం, నివాసం, ఆహార భద్రత కోసం ఎల్‌డీఎఫ్ నిరంతర పోరాటాన్ని ప్రజలు గుర్తించారన్నారు. నిరుద్యోగం, పేదరికం, వ్యవసాయ సంక్షోభం వంటి ప్రధాన సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి ఆపరేషన్ సిందూర్ వంటి సైనిక చర్యలను ప్రధాని మోదీ వినియోగిస్తున్నారని రాజా దుయ్యబట్టారు. ఈ వ్యూహాలు ఆయనను ఎన్నికలప్పుడు ఆదుకోలేవని వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని ప్రభుత్వం వేడుక చేసుకుంటున్నప్పటికీ దేశంలోకి చొరబడి 26 మంది పౌరులను చంపిన ఉగ్రవాదులు జాడ లేకుండా పోవడంపై ప్రశ్నలకు ప్రధాని ఏం సమాధానం ఇస్తారన్నారు. 'భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ కోసం వాణిజ్యపరంగా ఒత్తిడి తెచ్చినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే చెప్పుకుంటున్నారు. ఆయన మాటల్లో నిజమెంత? ట్రంప్ వ్యాఖ్యలను మోదీ సమర్థించడం లేదా తోసిపుచ్చడం లేదు. ఈ వ్యవహారంలో ప్రభుత్వ మౌనం అనేక అనుమానాలకు తావిస్తోంది' అని రాజా అన్నారు. సైన్యం తమ పక్షాన్ని వెల్లడించింది కానీ ప్రభుత్వం ఎందుకు వివరణ ఇవ్వదని ప్రశ్నించారు. కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ స్థాయికి మోదీ ప్రభుత్వం తీసుకెళ్లిందని, అది ద్వైపాక్షిక అంశమని సూచించే సిమ్లా ఒప్పందాన్ని ఉల్లంఘించిందని అన్నారు. ఇప్పుడు కశ్మీర్ అంశం అంతర్జాతీయ ఫోరంలో బహిరంగ చర్చనీయాంశంగా మారిందని రాజా చెప్పారు. కశ్మీర్‌లో దాడిపై చర్చకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించకుండా అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని బీజేపీ విదేశాలకు పంపిందని, ప్రభుత్వ వైఖరి, తదుపరి చర్యలపై పార్లమెంటు, దేశ పౌరులను చీకట్లో ఉంచిందని వ్యాఖ్యానించారు. ఆర్థిక రంగంపై బీజేపీ వాదనలను రాజా విమర్శించారు. నాల్గో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచిందని మోదీ ప్రభుత్వం గొప్పలు పోయింది కానీ ప్రపంచ మానవాభివృద్ధి సూచీల్లో దేశం వెనుకబడిందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, నల్ల ధనాన్ని వెనక్కి తేవడం, రైతులకు న్యాయమైన ఎంఎస్‌పీ కల్పన వంటి హామీల అమలులో బీజేపీ పూర్తిస్థాయిలో విఫలమైందని రాజా విమర్శించారు.

ఓ వైపు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే మరోవైపు కార్పొరేట్లకు మోదీ ప్రభుత్వం ఊడిగం చేస్తోందని దుయ్యబట్టారు. ఒక దేశం, ఒక ఎన్నిక కోసం బీజేపీ పట్టుబట్టడం... భారత సమాఖ్యస్ఫూర్తికి, ప్రజాస్వామ్యానికి ప్రమాదమని రాజా హెచ్చరించారు. ఎల్‌డీఎఫ్‌ను మళ్లీ ఎన్నుకోవడం ద్వారా దేశానికి కేరళ మార్గదర్శిగా నిలవాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి పిలుపునిచ్చారు.

'జీఎస్టీ రిజిస్ట్రేషన్‌లో అవినీతి'

(మొదటిపేజీ తరువాయి)

భార్య, కుమార్తె కలిసి నెలకొల్పిన సంస్థకు జీఎస్టీ నంబర్ కోసం తాను దరఖాస్తు చేశానని, 20 రోజులు దాటినా నంబర్ రాలేదని ఆరోపించారు. అభ్యంతరాలు వస్తున్నా జీఎస్టీ నంబర్ రాలేదని తెలిపారు. జీఎస్టీ నంబర్ పొందడం కోసం తాను లంచం ఇవ్వనున్నట్టు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ట్యాక్స్ నిపుణులు అభిషేక్ రాజారామ్ ఈ అంశంపై ఎక్స్ వేదికగా స్పందించారు. వినోద్ గుప్తా పోస్ట్ స్క్రీన్ షాట్‌ను కోట్ చేస్తూ... జీఎస్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అవినీతి గురించి సీబీఐసీకి తెలీడం లేదని పేర్కొన్నారు. ఉన్నతస్థాయి ఉద్యోగులే జోక్యం చేసుకుని దేశంలోని ఈ అవినీతి నుంచి కాపాడాలంటూ పోస్ట్ పెట్టారు. సీబీఐసీని ట్యాగ్ చేశారు. దీంతో పరోక్ష పన్నుల బోర్డు సత్వరమే స్పందించి వివరణ ఇచ్చింది. గుప్తా దరఖాస్తు మే 26న ఫైల్ చేశారని, ఇది దిల్లీ స్టేట్ జీఎస్టీకి అసైన్ చేశారని పేర్కొంది. అయితే రెంట్ అగ్రిమెంట్‌పై సంతకం చేసిన వ్యక్తికి సంబంధించిన వివరాలను పూర్తిగా పేర్కొనకపోవడంతో దరఖాస్తు పెండింగ్‌లో ఉందని తెలిపింది. ఇదే విషయాన్ని దరఖాస్తుదారుకు కూడా తెలియజేశామని వెల్లడించింది. ఈ పోస్ట్‌పై నిర్మలా సీతారామన్ స్పందిస్తూ... పన్ను చెల్లింపుదారులకు సేవలందించడంతో పాటు వారి నమ్మకాన్ని చూరగొనడం ముఖ్యమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది పారదర్శకంగా వ్యవహరించడంతో పాటు తక్షణమే స్పందించాలని సూచించారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించే వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా అధికారులతో కోరారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై శనివారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. వర్షాన్ని దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు చేయాలని, ఇందుకుగాను అవసరమైతే రైన్ ప్రూఫ్ టెంటు వేయించాలని చెప్పారు. వివిధ శాఖల అభివృద్ధిని తెలిపే విధంగా శకటాలను ప్రదర్శించాలని, అదే విధంగా స్టాల్స్ ఏర్పాటు చేయాలని, అత్యవసర సేవలను అందించే వైద్య ఆరోగ్య, ఫైర్, ఆర్అండ్‌బి తదితర శాఖలు వారి శాఖల ద్వారా ముఖ్యమైన సేవలు ప్రజలకు తెలిసే విధంగా ప్రదర్శించాలని అన్నారు. రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా పోలీస్ పరేడ్ మైదానంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలని డీఈఓను ఆదేశించగా, వేడుకలకు వచ్చే వారందరికి కుర్చీలు, తాగునీరు, టెంట్లు, ఇతర ఏర్పాట్లు చేయాలని కోరారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం సైతం రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, వేడుకల నిర్వహణలో భాగంగా పోలీస్ తరఫున అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

విశాలాంధ్ర - మరిపెడ : వానకాలం సీజన్ ప్రారంభమవుతున్నందున రైతులకు విత్తనాల డీలర్లు నాణ్యమైన విత్తనాలను అందించాలని ఎస్ఐ గంద్ర సంతోష్ కుమార్, ఏఓ వీరాసింగ్ అన్నారు. శనివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని విత్తన, పురుగు మందుల దుకాణాలను టాస్క్‌ఫోర్స్, లోకల్ స్క్వాడ్ తనిఖీలు చేశారు. షాపుల్లో నిల్వ ఉంచిన విత్తన ప్యాకెట్లు, విత్తన ధ్రువీకరణ ఆధార పత్రాలు, స్టాక్ రిజిస్టర్స్, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు. చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులు, విత్తనాలు విక్రయించే డీలర్లు, షాపుల యజమానులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి వ్యాపారం చేసుకోవాలన్నారు. షాపుల వద్దకు వచ్చే రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలన్నారు. ఫర్టిలైజర్ షాపుల యజమానులు విధిగా స్టాక్ రిజిస్టర్లు, బిలబుక్కు నిర్వహించాలని తెలిపారు. అనుమతి లేని విత్తనాలు, ప్రభుత్వ నిషేధిత రసాయన మందులు అమ్మకాలు జరిపితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

విశాలాంధ్ర- తొర్రూరు: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కార్మికుల పక్షం ఉండేది సిఐటీయు అని సిఐటీయు జిల్లా నాయకులు బొల్లం అశోక్ అన్నారు. శనివారం సిఐటీయు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిఐటీయు జెండాను మండల కార్యదర్శి జమ్మల శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం ఈ కార్యక్రమాని ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఐటీయు జిల్లా నాయకులు బొల్లం అశోక్ మాట్లాడుతూ కార్మికులు కష్టజీవుల కోసం 1970 మే 30న సిఐటీయు ఏర్పడి సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులకు కూలి రేట్లు పెరగాలని, పెట్టుబడిదార్ల బడా భూస్వాముల మెడలు వంచి కార్మికులకు అండగా ఉండే కార్మిక సంఘమేని అన్నారు. మోడీ ప్రభుత్వం అధికారం లోకి రాగానే కార్మిక చట్టాలను రద్దు చేసి, ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం ఈ కార్మిక లేబర్ కోట్లకు వ్యతిరేకంగా అనేక ఆందోళన పోరాటాలు దేశమంతా తీవ్రతరం అవుతున్నా సందర్భంగా కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి కార్మిక లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జూన్ 9న కేంద్ర ప్రభుత్వ కార్మిక విధానాలకు వ్యతిరేకంగా జరిగే సార్వత్రిక సమ్మెను కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటీయు మండల నాయకులు. వెంకటేశ్వర్లు, యాకన్న, పాష, సురేష్, రవి, సైదులు, వెంకన్న, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

విశాలాంధ్ర - ఖమ్మం : ప్రజా పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజా సమస్యల పరిష్కారమే సిపిఐ లక్ష్యమని సిపిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. ఖమ్మం శనివారం వన్ టౌన్ ఏరియా మహాసభ మాడుగుల నాగేశ్వరరావు మలకొండయ్య. అధ్యక్షతన మినీ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ మహాసభకు సూచికగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్కే జానిమియా పతాకాన్ని ఆవిష్కరించారు. మహాసభను ఉద్దేశించి సిపిఐ జిల్లా సహాయ సహాయ కార్యదర్శి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల ఫలితంగా పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర సంక్షోభం నెట్టి వేయబడుతున్నారని అయన విమర్శించారు. ప్రజా పోరాటాలు నిర్వహించటం ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఉద్యమ కార్యాచరణే లక్ష్యంగా శాఖ, మండల మహా సభలు జరపాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు మహమ్మద్ సలాం పగడాల మల్లేష్, వన్‌టౌన్ ఏరియా నాయకులు యాకుబ్, రావుల హనుమంతరావు. సిద్ది శ్రీనివాసరావు సోమోజులో సరోజనమ్మ నారపోగు నాగమణి, మెంటెం రవి కారం సామేలు శీలం నాగేశ్వరరావు, యాతం భూపాల్ రెడ్డి, కాట్ల నరసింహారావు పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

విశాలాంధ్ర-కొత్తగూడెం క్రైమ్ : కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సరిత అన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సమావేశం నిర్వహించారు. ఇందులో న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉద్యోగులు, కోర్ట్ డ్యూటీ పోలీసుల చేత న్యాయమూర్తి ఎస్.సరిత ప్రతిజ్ఞ చేయించారు. ఆమె మాట్లాడుతూ పొగాకు వాడడంతో రోగాల బారిన పడుతున్నారని వివరించారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని కోరారు. పొగాకు, సిగరెట్, ఆల్కహాల్ వినియోగం వల్ల గుండె జబ్బులు, నోటి క్యాన్సర్, ఊపిరి తిత్తుల క్యాన్సర్ లాంటి జబ్బులు అధికంగా వస్తున్నాయన్నారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె. కిరణ్ కుమార్, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి రవికుమార్, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ మెండు రాజమల్లు, పీ.పీ పీవీడీ లక్ష్మి, స్పెషల్ పి.పి.వి.నాగిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, న్యాయవాదులు, కిరణ్ కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాబోయే 30 ఏళ్ల కాలం పాటు 22 మిలియన్ టన్నుల

బొగ్గు వెలికి తీసేందుకు కొత్త గనులు సిద్ధం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : రాబోయే 30 ఏళ్ల కాలం పాటు 22 మిలియన్ టన్నుల బొగ్గులు వెలికి తీసేందుకు కొత్త గనులు సిద్ధంగా ఉన్నాయని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి మల్లు పెట్టి విక్రమార్క అన్నారు. శనివారం కొత్తగూడెం ఏరియాలోని 3 ఇంక్లైన్లో కొత్తగా నిర్మించిన జీఎం కార్యాలయంతో పాటు, వర్క్ షాప్ ప్రారంభం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా అద్భుతంగా సింగరేణి విస్తరిస్తరించి దేశంలోనే అగ్రగామి సంస్థల్లో ఒకటిగా నిలుపుతామన్నారు. విస్తరణకు అవసరమైన సమాచారం, సూచనల కోసం ప్రత్యేక బృందాన్ని నియమించినట్లు చెప్పారు. నివేదిక రాగానే కార్యాచరణ చేపడతామని తెలిపారు. 136 ఏళ్ల అనుభవం ఉన్న సింగరేణి సంస్థ ద్వారా లాభదాయకమైన టెక్నికల్, మినరల్స్ తవ్వే ఆలోచనలో ఉన్నట్లు భట్టి వివరించారు. సింగరేణి కార్మికుల రక్షణే ప్రధాన ధ్యేయంగా బొగ్గు గనులను విస్తరింప చేస్తున్నామన్నారు. ఆ తరువాతే వ్యాపారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. సింగరేణి కార్మికులు ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోతే రూ. కోటి ప్రమాద బీమాతో పాటు కారుణ్య నియామకం చేపడుతున్నట్లు ఇది దేశ చరిత్రలోనే ఒక రికార్డు అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సింగరేణి ఛైర్మన్ మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరామ్ మాట్లాడుతూ సింగరేణి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు, సహాయ సహకారాలు, ప్రోత్సాహం ఉంటుందన్న భరోసా నింపేందుకు ఈ రోజు ముఖ్య అతిథిగా భట్టి విక్రమార్క రావడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. సింగరేణి సంస్థ తెలంగాణలో కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. సింగరేణి ఉత్పత్తి చేసి సరఫరా చేస్తున్న బొగ్గుతో దేశంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలతో పాటు సిమెంట్, స్పాంజ్ ఐరన్, హెవీ వాటర్ ప్లాంట్, సిరామిక్స్, ఫార్మా తదితర 2 వేల కంపెనీల మనుగడ కొనసాగుతుందన్నారు. ఇందులో పాల్గొన్న జియం షాలేం రాజు మాట్లాడుతూ జియం కార్యాలయం, ఏరియా వర్క్ షాప్ ను దాదాపుగా రూ. 7.66 కోట్ల వ్యయంతో నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కునంనేని సాంబశివరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ మాలోత్, ఎస్సి ఎస్టీ ఓబిసి నేషనల్ కోఆర్డినేటర్ కొప్పుల రాజు, జిల్లా ఎస్పీ బి. రోహిత్ రాజు, డైరక్టర్లు సత్యానారాయణ రావు, ఎల్.వి. సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఏఐటియూసి డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య, ఐఎన్‌టియూసి జనరల్ సెక్రటరీ బి.జనక్ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ కుమార్, మల్లికార్జున రావు, ఎండి. రజాక్, అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు

మంత్రి సీతక్క

విశాలాంధ్ర బ్యూరో - కొమరం భీం : అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో కుమ్రంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్ వెంకటేష్ దోత్రే, కుమార్ దీపక్, రాజర్షి షా, అభిలాష అభినవ్, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ-ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, శాసనమండలి సభ్యులు మల్క కొమురయ్య, దండే విఠల్, మంచిర్యాల, బెల్లంపల్లి, ముథోల్ నియోజకవర్గాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వినోద్, రామారావు పటేల్, జి.సి.సి. చైర్మన్ కొట్నాక తిరుపతి లతో కలిసి ఉమ్మడి జిల్లా అదనపు కలెక్టర్లు, రెవెన్యూ, వ్యవసాయ, గృహ నిర్మాణ శాఖల అధికారులతో భూభారతి, ఇందిరమ్మ ఇండ్లు, యాసంగి వరి ధాన్యం సేకరణ, రాజీవ్ యువ వికాసం, ఖరీఫ్ సాగు సన్నద్ధం అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ జిల్లాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. యాసంగి వరి ధాన్యం సేకరణ కొరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి ధాన్యం సేకరించడం జరుగుతుందని, ధాన్యం సేకరణ ప్రక్రియ చివరి దశకు చేరుతుందని తెలిపారు. జూన్ 3వ తేదీ నుండి 20వ తేదీ వరకు భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, ధరణి స్థానంలో తీసుకువచ్చిన భూ భారతి చట్టం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నియోజకవర్గానికి 3 వేల 500 చొప్పున రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. నైరుతి రుతుపవనాలు వస్తున్నందున విత్తనాలు, ఎరువులు అవసరమైన మేరకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అధిక ధరలకు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించే వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ జిల్లాలో యాసంగి వరి ధాన్యం కొనుగోలు కొరకు 40 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల మధ్య నుండి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. జూన్ 2వ తేదీ నుండి 20వ తేదీ వరకు జిల్లాలోని పెంచికల్ పేట మండలం మినహాయించి మిగిలిన 14 మండలాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై ధ్రరఖాస్తులు స్వీకరించి పరిష్కారం దిశగా రెవెన్యూ యంత్రాంగాన్ని సిద్ధం చేశామని తెలిపారు.

రజతోత్సవ వేడుకలకు తరలిన టీజేఎఫ్ శ్రేణులు

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్: హైదరాబాద్‌లోని జలవిహార్‌లో శనివారం టీజేఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన రజతోత్సవ కార్యక్రమానికి తొర్రూర్ పట్టణ కేంద్రానికి చెందిన జర్నలిస్టులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా టీజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు తీగల కృష్ణారెడ్డి, మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు నన్నపురాజు నారాయణరాజు, గజ్జల వినోద్ రెడ్డి, తాటికొండ సదాశివరావు, టెమ్జు జిల్లా ఉపాధ్యక్షులు దేవరకొండ కృష్ణ ప్రసాద్, సంయుక్తంగా మాట్లాడుతూ టీజేఎఫ్ ఆవిర్భావించి నేటికీ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ ఆధ్వర్యంలో రజతోత్సవ సంబరాలు నిర్వహించడం గర్వకారణమని, ఈ వేడుకలకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి అధిక సంఖ్యలో టీజేఎఫ్ సంఘానికి సంబంధించిన జర్నలిస్టులు పెద్ద ఎత్తున హాజరు జరుగుతుందని తెలిపారు. తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు వీరోచిత పోరాటాలు చేసి తెలంగాణ రాష్ట్ర సాధించుకున్నారని తెలంగాణ సాధించుకున్న సమయంలో కొంతమంది జర్నలిస్టులు తమ ప్రాణాలను సైతం అర్పించారని వారిని గుర్తు చేసుకొనడం మనందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బందు శ్రీధర్, ఇమ్మడి రాంబాబు, ఎండి అమీర్, వెల్తూరి పూర్ణ రామచందర్, దారవత్ రాజేందర్, కుక్కల కృష్ణ, పెండోట కిషన్‌రావు, మహంకాళి వెంకటేశ్వర్లు, గట్టు నాగార్జున, మంద యాకమల్లు, మడిపెద్ది కార్తీక్, పొన్నోజు యశ్వంత్, ఎండి ఏజాస్, రెడ్డబోయిన దిలీప్, ఓరుగంటి సైదులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై పచ్చి రొట్టె ఎరువులు

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్ల మండలంలో రైతులకు సబ్సిడీ మీద పచ్చి రొట్టె ఎరువులు అయినా జీలుగులను పంపిణీ చేస్తున్నట్లు శనివారం మండల వ్యవసాయ అధికారి జావేద్ శనివారం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 30 కిలోల జీలుగు ధర 50శాతం సబ్సిడీతో 2100 ధర ఉన్నది ప్రభుత్వం నిర్ణయించడం జరిగింది. కావున అవసరమున్న రైతులు నేరేడుచర్ల సొసైటీని సంప్రదించాలని సూచించారు.

పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు ఎస్పీ సన్మానం

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : పోలీస్ శాఖలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తూ ఎనలేని సేవలందించి పదవీ విరమణ పొందిన ఆరుగురు పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శనివారం ఆత్మీయంగా సన్మానించారు. ఇద్దరు ఎస్ఐలు, ముగ్గురు ఏఎస్సైలు, ఒక హెడ్ కానిస్టేబుల్ ను పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఎస్సైలు సెల్వ రాజు, మస్తాన్ రావు లతోపాటు ఏఎస్సై లు వెంకటేశ్వర్లు, ఎస్తేరు రాణి, నారాయణరావు, హెడ్ కానిస్టేబుల్ మధుసూదన్‌రావులు ఈ రోజు పదవి విరమణ పొందడం జరిగింది. ఈ ఆరుగురు అధికారులను ఎస్పీ శాలువాలు కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పోలీస్ శాఖలో తమ అనుభవాలను ఎస్పీ తొ పంచుకున్నారు. శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా గడపలను ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి, ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు, జిల్లా పోలీస్ అధికారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఓవర్సీస్ విద్యా పథకానికి దరఖాస్తులు

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి : ముఖ్యమంత్రి ఓవర్సీస్ విద్య పథకం కోసం స్కాలర్ షిప్, ఆర్థిక సహాయం కొరకు దరఖాస్తులు జూన్ 30 లోగా జిల్లా మైనార్టీస్ సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలని జిల్లా సంక్షేమశాఖ అధికారి రంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 లక్షల లోపు సంవత్సర ఆదాయం ఉన్న పేద మైనార్టీస్ విద్యార్థులు విదేశీ యూనివర్సిటీలలో చదువుటకు ఇంజనీరింగ్‌లో 60 శాతం మార్కులు ఉండి పోస్టు గ్రాడ్యుయేట్ చేయుటకు, పి.జి.లో 60 శాతం మార్కులు వచ్చి డాక్టరేట్ చదువుటకు 2025 జనవరి 1 నుండి 2025 జూన్ 30 వరకు విదేశీ యూనివర్సిటీలలో అడ్మిషన్ తీసుకొన్న మైనార్టీస్ విద్యార్థులకు ఈ పథకానికి అర్హులని ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు 20 లక్షల ఉపకార వేతనం, ఆర్థిక సహాయం రెండు విడతలలో, విమాన చార్జీలు 60 వేల రూపాయల వరకు చెల్లించబడతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రణాళిక బద్ధంగా చదివితేనే లక్ష్యాలు సాధ్యం

విశాలాంధ్ర - కారేపల్లి : ప్రతి విద్యార్థి కష్టపడి చదివితేనే అనుకున్న లక్ష్యాలను సులువుగా చేరుకోవచ్చని సింగరేణి మండల మాజీ ఎంపీపీ మాలోత్ శకుంతల కిషోర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని చీమలపాడు గ్రామంలో ఏన్కూర్ మండలం తిమ్మరావుపేట గ్రామంలో గల ఓం ఆదిత్య గాయత్రి స్కూల్‌లో శిక్షణ పొంది నవోదయ, సైనిక్, ఏకలవ్య మోడల్ స్కూల్, గురుకులంలో సీట్లు సాధించిన విద్యార్థులకు సింగరేణి మాజీ ఎంపీపీ శకుంతల, మాజీ సర్పంచ్ మాలోత్ కిషోర్ దంపతుల సమక్షంలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా సీట్లు సాధించిన విద్యార్థులకు ఓం ఆదిత్య గాయత్రి స్కూల్ దశాబ్ది ఉత్సవాలు సందర్భంగా చదువులో ప్రతిభ కనబరిచి సీట్లు పొందిన 30 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సింగరేణి మండలం చీమలపాడు, పాటిమీద గుంపు, చింతలతండా, నానునగర్ తండా గ్రామాల నుండి విద్యార్థులు ఓం ఆదిత్య గాయత్రి స్కూల్‌లో శిక్షణ పొంది సీట్లు పొందిన 30 మంది విద్యార్థులకు ఉత్తమ విద్యార్థి అవార్డులను అందజేయటం హర్షించదగ్గ విషయమని ఎంపీపీ పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ దాసరి రమేష్, ఉపాధ్యాయులు ప్రసాద్, హుస్సేన్ బీ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - గూడూరు: కల్యాణ లక్ష్మి షాదీ, ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, మండల తహసిల్దార్ నాగ భవానితో కలిసి ఎమ్మెల్యే లబ్ధిదారులకు కళ్యాణ్ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్ లాంటి పథకాలు పేదింటి బిడ్డకు అండగా నిలుస్తున్నాయన్నారు. గూడూరు గూడూరు, కొల్లాపురం, మచ్చెర్ల, వద్దెర గూడెం, గాజుల గట్టు, పొనుగోడు, బొద్దుగొండ, దామరవంచ, ఊట్ల గోవిందపురం, వేంగంపేట గ్రామాల నుండి వచ్చిన లబ్ధిదారులైన ఎస్సీలు 06, ఎస్టి 27, షాదీ ముబారక్ (మైనారిటీ)05 లకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల తాహసిల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్మా దారపు రమాదేవి, మండల అధ్యక్షులు చిట్టే వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వాంకుడోత్ కొమ్మలు, జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ చంటి స్వామి, టౌన్ అధ్యక్షులు రాసమల్ల యాకయ్య, సనుప సుదర్శన్, సూర గంగయ్య, రసూల్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాం రెడ్డి శ్రమదానం

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : కొత్తగూడెం నియోజకవర్గంలోని పాల్వంచ మండలంలో గల కిన్నెరసాని గిరిజన బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి శనివారం శ్రమదానం చేశారు. ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి ఎంతో ఉత్సహంగా స్వయంగా పిచ్చి మొక్కలను తొలగించారు. చెత్తను ఎత్తివేసి శుభ్రం చేశారు. ఈ శ్రమధానంలో పాల్గొన్న ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచందర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా బాల పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలంలోని ఆదివాసీ గ్రామం తొట్టిపంపులో గ్రామంలో కనుల పండుగగా వేదమంత్రాల మధ్య వేద మంత్రాల మధ్య శ్రీ బాల పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఆలయ అభివృద్ధి వ్యయ ప్రధాత, ధర్మకర్త హరిహర ఫౌండేషన్ వ్యవస్థాపకులు మారగాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్మిక క్రతువును శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి ఆలయంలో జీవ ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠన పురస్కరించుకొని మహిళలు అమ్మవారికి బోనం నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ నేపథ్యంలో 30 మంది పుణ్య దంపతులు యాగశాల నందు హోమంలో పాల్గొని భక్తి శ్రద్దలతో విశేష పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణ మధ్య గ్రామం యావత్తు భక్తుల కోలాహలం మధ్య పెద్దమ్మ తల్లి విగ్రహా ప్రాణ ప్రతిష్ట మహోత్సవం నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, ఆదివాసీ నేత, గ్రామపెద్ద పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అమ్మ వారి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠానంతరం పూర్ణహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల భక్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొని అమ్మవారికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మార్షల్ ఆర్ట్స్‌తో విద్యార్థులకు ఆత్మరక్షణ, ఆరోగ్యం

విశాలాంధ్ర - భద్రాచలం : కుంగ్ ఫు లాంటి మార్షల్ ఆర్ట్స్‌ను విద్యార్థులు విధిగా నేర్చుకోవాలని దీనివల్ల ఆత్మరక్షణతో పాటు ఆరోగ్యం కలుగుతుందని సెంట్ పాల్స్ స్కూల్ కరస్పాండెంట్ అబ్రహం అన్నారు. జిల్లా కుంగ్ ఫు మార్షల్ ఆర్ట్స్ మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు నెల రోజులుగా శిక్షణ ఇచ్చారు. శనివారం స్థానిక సెంట్ పాల్స్ స్కూల్ లొ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం జరిగింది. భద్రత భద్రాచలంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన 50 మంది బాల, బాలికలు ఈ శిక్షణలో పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అబ్రహం మాట్లాడారు. వేసవి సెలవులను వృధా చేయకుండా విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో పిల్లలకు ఈ కుంగ్ ఫు విద్య ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నేటి పరిస్థితుల అభద్రత నేపథ్యంలో ముఖ్యంగా అమ్మాయిలకు మార్షల్ ఆర్ట్స్ చాలా అవసరం అన్నారు. నెలరోజుల పాటు వేసవి సెలవుల సమయాన్ని వృధా చేయకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ఇతరులకు ఆదర్శమన్నారు. మార్షల్ ఆర్ట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, శిక్షకులు కూడా అయిన హుస్సేన్ ఖాన్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్నారు విద్యతో భవిష్యత్తులో ఇంకా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఐ.ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి పి.కాశీ హుస్సేన్, సంయుక్త కార్య దర్శులు రాజ, హరిబాబు ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.సాగర్ సభ్యులు లీల, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు : ఎస్సై

విశాలాంధ్ర - పినపాక: ఫెర్టిలైజర్ వ్యాపారస్తులు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజ్ కుమార్, ఏవో వెంకటేశ్వరరావు హెచ్చరించారు. శనివారం పినపాక మండలం పరిధిలోగల ఏజెన్సీ ఫెర్టిలైజర్ షాపులను ఎస్సై, ఏవో లు కలిసి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. విత్తనాలు, పురుగుమందుల ప్యాకింగ్, లేబుల్లు, అమ్మకాల రిజిస్టర్ల ను పరిశీలించారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని నకిలీ విత్తనాలు అమ్ముతు అధిక దిగుబడులు వస్తాయని మాయ మాటలు చెప్పి రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ప్రతి ఫర్టిలైజర్ దుకాణంలో ధరల పట్టిక ఉండాలని, స్టాక్ రిజిస్టర్ మెయింటెనెన్స్ చేయాలని, ఎరువులు, విత్తనాలు బ్లాక్ మార్కెటుకు తరలిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవ సంబరాలు

విశాలాంధ్ర - పెనుబల్లి : పెనుబల్లి మండలంలో పెనుబల్లి ఆయుష్ విభాగం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ సంబరాలలో భాగంగా ఐదవ రోజు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని పేషెంట్లకు, నర్సులకు, ఆశ వర్కర్లకు, ప్రాణాయామ విశిష్టత గురించి, ధ్యానం గొప్పతనాన్ని గురించి, యోగా ఇన్స్ట్రక్టర్లు రామకృష్ణ, శిరీష వివరించారు. ప్రాణయమం నిత్య సాధన చేయడం వలన ప్రతి మనిషిలో రోగనిరోధక శక్తిని పెంచుకోవచ్చు అని సూచించారు. సర్వ రోగాలని కంట్రోల్ చేసుకోవచ్చునని, నిత్యం ధ్యాన సాధన చేయడం వలన ప్రతి మనిషి తనలో ఉన్న బత్తిడిని జయించవచ్చునని అన్నారు. యోగతో నిత్యం ఆరోగ్యవంతంగా జీవించవచ్చునని, ధ్యానమే సరళ మార్గమని యోగ మాస్టర్ రామకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమానికి ఆయుష్ మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్ నాయక్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, హాస్పిటల్ సిబ్బంది, ఫార్మసిస్ట్ అఖిలా, ఆయుర్వేద ఫార్మసిస్ట్ నారాయణమ్మ, చాంద్ భాషా తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

ఇంకా రహస్యం ఎందుకో!

ఆపరేషన్ సిందూర్ ద్వారా ఈ సారి మనం పాకిస్థాన్‌ను లొంగదీసి ఉండొచ్చు. ఆపరేషన్ సిందూర్‌లో మన దళాలు పాకిస్థాన్ భూభాగంలో, ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలో తీవ్రవాద స్థావరాలను ధ్వంసం చేసి ఉండొచ్చు. కానీ ఈ ప్రక్రియ వెనక ఉన్న నిజాలేమిటో చెప్పాలని ప్రతిపక్షాలు ఎన్ని సార్లు అడిగినా ప్రధాన మంత్రి మోదీ పెదవి విప్పిన పాపాన పోలేదు. అయితే ఆపరేషన్ సిందూర్ పూర్తిగా ఆగిపోలేదని పదే పదే చెప్తున్నారు. మోదీ మాటలకు రక్షణ మంత్రి తాళం వేస్తున్నారు. యుద్ధ తంత్రంలోని సకల వివరాలను ప్రభుత్వం వెల్లడించలేదు. వెల్లడించనవసరమూ లేదు. కానీ ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిపక్షాలన్నీ మద్దతిచ్చాయి. ప్రభుత్వం వెనక బలంగా నిలబడ్డాయి. ఈ యుద్ధంలో మనకు జరిగిన నష్టం ఏమిటో చెప్పాలనీ ఈ అంశాన్ని చర్చించడానికి పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలే లేవు. కానీ మన వైమానిక దళాధిపతి ఎయిర్‌చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ రక్షణ విభాగాలకు కావాల్సిన సామాగ్రి అందడంలో జరుగుతున్న తీవ్ర జాప్యంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం ఆందోళనకరమే కానీ ప్రైవేటు రంగానికి రక్షణ సామాగ్రి ఉత్పత్తి చేసే అవకాశం ఇవ్వాలని ఏపీ సింగ్ చేసిన సూచన మరింత ఆందోళనకరం. ఈ యుద్ధంలో భారత్ కొన్ని యుద్ధ విమానాలు కోల్పోయిందని ఎప్పుడూ భిన్న స్వరం వినిపించే డా. సుబ్రమణ్యం స్వామి మన యుద్ధ విమానాలను కూడా పాకిస్థాన్ కూల్చేసింది అని చెప్తూనే ఉన్నారు. ఆ సమయంలో సైనిక దళాలు కూడా మన పైలెట్లు అందరూ సురక్షితంగా తిరిగి వచ్చారు అని నర్మగర్భమైన సమాధానమే ఇచ్చాయి తప్ప అసలు విషయం బయట పెట్టలేదు. ఆపరేషన్ సిందూర్‌ను యుద్ధంగా పరిగణించకపోవచ్చు. కానీ ఏ పోరాటంలోనైనా తరతమ భేదాలతో రెండు పక్షాలకూ ఎంతో కొంత నష్టం కలుగుతుంది. దాన్ని గంపకింద కమ్మేయవలసిన అవసరం లేదు. మోదీకి ఎన్నడూ నిజం మాట్లాడే అలవాటు లేదు. మోదీ ఊరారా తిరిగి సిందూర్ గురించి మాట్లాడుతున్నారు. ఇంటింటికీ సిందూర్ పంపిణీ చేయాలంటున్నారు. ఆయన పర్యటనలు ప్రధానంగా ఈ ఏడాది చివరలో, వచ్చే ఏడాదిలో శాసనసభ ఎన్నికలు జరిగే రాష్ట్రాలలోనే కొనసాగుతున్నాయి. కానీ త్రివిధ దళాల అధిపతి జనరల్ అనిల్ సింఘ్ చౌహాన్ మన యుద్ధ విమానాలు కూలిపోయాయని నేరుగా అంగీకరించలేదు కానీ అవి ఎందుకు కూలిపోయాయో ఆలోచించవలసిన అవసరం ఉందని మాత్రం అంగీకరించారు. మన యుద్ధ విమానాలు ఎన్ని కూలిపోయాయో మాత్రం ఇదమిద్ధంగా చెప్పలేదు. విమానాలు కూలడం మన ఎత్తుగడల లోపం అని మాత్రం అంగీకరించారు. మన దళాలు దాడి చేయడంవల్ల తీవ్రవాద శిబిరాల్లో ఉన్న ఎంత మంది తీవ్రవాదులు మరణించారో లెక్క చెప్పడం సాధ్యం కాకపోవచ్చు. ఒక అంచనా మాత్రం ఉండొచ్చు. దాడి చేసిన వారు ఆ దాడిలో సఫలమైనా శవాలు లెక్కెడ్తూ కూర్చోరు. పైగా మన యుద్ధ విమానాలు దాడి చేశాయే తప్ప పదాతి దళాలు పాక్ భూభాగంలోకి ప్రవేశించనే లేదు. సైనికులు బాంబులు కురిపిస్తున్న వైమానిక దళానికి నేల మీంచి కావాల్సిన సహాయం మాత్రం అందించారు. మన యుద్ధ విమానాలు ఎన్ని కూలిపోయాయో చెప్పాలని అడుగుతూనే ఉన్నారు. కానీ ప్రభుత్వం దగ్గర నుంచి ఏ సమాధానమూ లేదు.

మొత్తం మీద మన యుద్ధ విమానాలు కొన్ని కూలిపోయాయని త్రివిధ దళాల అధిపతి అనిల్ సింగ్ చౌహాన్ అంగీకరించారు. పాకిస్థాన్ యుద్ధ విమానాలతో తలపడినప్పుడు ఈ విమానాలు కూలిపోయాయని చౌహాన్ సింగపూర్‌లోని బ్లూంబర్గ్ టీవీతో మాట్లాడుతూ చెప్పారు. కూలిన విమానాలు రాఫేల్ యుద్ధ విమానాలా, మిరాజ్ లా, సుఖోయ్ విమానాలా అన్న వివరం మాత్రం చౌహాన్ వెల్లడించలేదు. మన యుద్ధ విమానాలు కూలాయా లేదా, కూలితే ఎన్ని కూలాయి అన్నది ప్రధానం కాదు, ఎత్తుగడలలో మన లోపం ఏమిటనేదే ముఖ్యం అని ఆయన అన్నారు. మన ఆరు యుద్ధ విమానాలను కూల్చేశామని పాకిస్థాన్ చెప్పుకుంటోంది కదా అని అడిగితే అది పూర్తిగా అసత్యం అని ఆయన అన్నారు. మూడు రోజుల పాటు కొనసాగిన దాడిలో విపరీతంగా ప్రచారంలో పెట్టిన తప్పుడు సమాచారాన్ని సరిదిద్దడానికే రక్షణ దళాలు ఎక్కువ శ్రమించవలసి వచ్చిందని చౌహాన్ తెలియజేశారు. కార్గిల్ యుద్ధం జరిగిన తరవాత 1999 జులై 29న వాజపేయి ప్రభుత్వం భారత వ్యూహాత్మక వ్యవహారాల నిపుణుడు కె. సుబ్రమణ్యం నాయకత్వంలో ఒక సమీక్షా సంఘం ఏర్పాటు చేసింది. కార్గిల్ యుద్ధం ముగిసిన మూడు రోజులకే ఈ సమీక్షా సంఘం ఏర్పాటు అయింది. అయిదు నెలల తరవాత ఈ సంఘం సవివరమైన నివేదిక ఇచ్చింది. ఈ నివేదికను 2000 సంవత్సరం ఫిబ్రవరి 23 న పార్లమెంటులో ప్రతిపాదించారు కూడా. త్రివిధ దళాల అధిపతే కొన్ని యుద్ధ విమానాలు కూలాయని అంగీకరించిన తరవాత మోదీ ప్రభుత్వం కూడా సమీక్షా సంఘాన్ని ఏర్పాటు చేస్తుందా అన్నది ఇప్పటికైతే సమాధానం లేని ప్రశ్నే. మన యుద్ధ విమానాలు కూలిన తరవాత లోపాలను సరిదిద్దామని కూడా చౌహాన్ చెప్పారు. భారత్ యుద్ధ విమానమో, లేక కొన్ని యుద్ధ విమానాలో కూలిపోయాన్న సమాచారం మన నేల మీంచి రాలేదు. సింగపూర్ నుంచి వచ్చిన విషయాన్ని ప్రత్యేకంగా గమనించవలసిందే. ఇలాంటి కీలక సమాచారాన్ని మన నేల మీంచి ప్రకటించకుండా ఇతర దేశాలలో ఈ విషయం వెల్లడించడంలో ఆంతర్యం ఏమిటో తెలియదు. ప్రభుత్వ ఒడిలో హాయిగా కూర్చున్న మన దేశంలోని మీడియాకు అసలు ఇలాంటి ప్రశ్నలు అడగాలన్న ధ్యాసే లేదు. ఆపరేషన్ సిందూర్ ఆరు, ఏడు తేదీల అర్థ రాతి మొదలు పెట్టినప్పుడు మొదటి రోజు మనకు కొంత నష్టం కల్గిందని కూడా చౌహాన్ అంగీకరించారు. ఆ తరవాత పొరపాట్లు సరిదిద్దుకున్నామని చెప్పారు. జనరల్ చౌహాన్ బ్లూం బర్గ్‌తో పాటు పీటీఐకి కూడా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ రెండు ఇంటర్వ్యూల్లో అడిగిన అన్ని ప్రశ్నలకు ఆయన చెప్పిన సమాధానంలో కొంత వ్యత్యాసం కనిపిస్తోంది. దీనికి కారణం ఏమిటో ప్రస్తుతానికి తెలియదు. ఎన్ని విమానాలు కూలాయి అన్న దానికన్నా ఎందుకు కూలాయి అని చౌహాన్ అనడం అంటే ఈ ప్రశ్నకు సమాధానం అధికారంలో ఉన్న రాజకీయ నాయకుల నుంచే రావాలి. జనరల్ చౌహాన్ చెప్తున్నట్టు ఎన్ని విమానాలు కూలాయన్నది ప్రధానం కావొచ్చు. కానీ ఎన్ని కూలాయో రక్షణ దళాలకైనా తెలిసే ఉంటుందిగా! సుబ్రమణ్యం స్వామి మన అయిదు యుద్ధ విమానాలు కూలాయంటున్నారు. ఇందులో రాఫేల్ యుద్ధ విమానాలు ఉన్నాయా లేవా అనే ప్రశ్నకు సమాధానం లేదు. ఒక వేళ ఉంటే వాటి కొనుగోలు మీద మళ్లీ ప్రశ్నలు తలెత్తక తప్పదు. ఇంకా రహస్యం ఎందుకో!

వైద్య కళాశాలల్ని అమ్మేస్తున్న కూటమి ప్రభుత్వం

మందగళ్ళ సాయికుమార్

ప్రజలకు జవాబుదారీ తనంగా ఉండాల్సిన పాలకులు ఇస్తున్న అందరికీ విద్య, వైద్యం ఉచిత విద్య అనే హామీలు కేవలం కాగితాలకే పరిమితం అయ్యాయి. ప్రభుత్వం ఆధీనంలో ఉండాల్సిన ఆయా రంగాలను ప్రైవేట్‌పరం చేసి కార్పొరేట్ దోపిడీ వర్గాలకు అప్పజెప్పేస్తున్నారు. రాష్ట్రంలో అందరూ వైద్య విద్యను అభ్యసించేందుకు అవకాశం కల్పించేందుకు గత ప్రభుత్వం కోరిక మేరకు జాతీయ వైద్య మండలి 17 వైద్య కళాశాలలు ప్రభుత్వ అధీనంలో నడిపేందుకు అవకాశం కల్పిస్తూ నిధులు అందజేసింది. ఆనాడు ఒకేసారి 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రారంభించేందుకు ఆర్థిక పరిస్థితులు సరిపోవడం లేదని మొదటి విడతగా ఐదు కళాశాలలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. రెండవ విడతలో మరో ఐదు కళాశాలలు,

మూడో విడతలో మిగిలిన ఏడు కళాశాలల్ని ప్రారంభిస్తామని ఆనాటి వైసీపీ ప్రభుత్వం తెలిపింది. విద్యార్థులకు ఇచ్చిన హామీలో భాగంగా మొదటి విడతలో ఐదు వైద్య కళాశాలల నిర్మాణం సకాలంలో పూర్తిచేసి మచిలీపట్నం, ఏలూరు, విజయనగరం, రాజమహేంద్రవరం, నంద్యాలలో ప్రారంభించింది. ఈ 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీ4 ద్వారా ప్రైవేటు పరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పావులు కదుపుతున్నది. రెండో విడతలో ఉన్న పులివెందుల మెడికల్ కళాశాలకు ఎన్ఎంసీ 50 ఎంబీబీఎస్‌కి అనుమతించింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం రాసిన లేఖ ఆధారంగా చేసుకుని ఎన్ఎంసీ తీసుకున్న నిర్ణయం వల్ల ఒక్కొక్క కళాశాలలో 150 సీట్లు వరకు విద్యార్థులు అవకాశం కోల్పోయారు.

మెడికల్ కళాశాలలో జీవో నంబర్ 107, 108 అమలుపరస్తు ఏ,బీ,సీ కేటగిరీలుగా విభజించి ఏ కేటగిరి కన్వీనర్ కోటా కింద, బి కేటగిరిలో ఏడాదికి 12 లక్షలు, సీ కేటగిరిలో ఏడాదికి 20 లక్షలుగా ఫీజు నిర్ణయించారు. జీవో సారాంశం ప్రకారం కళాశాలల నిర్మాణం చేపట్టాలంటే ప్రభుత్వం చేతిలో నిధులు లేవని సెల్ఫ్ ఫైనాన్స్ కోటా అనే పేరుతో విద్యార్థులు తమ కళాశాలలను తాము తీసుకుని వచ్చిన రుసుముతోనే ఆయా కళాశాలల అభివృద్ధికి తోడ్పడతారనే సారాంశంతో జీవో నంబర్ 107,108 అమలుచేశారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఇప్పటి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర చేసినప్పుడు వేలాది మంది విద్యార్థి, యువతను సమీకరించి "ప్రస్తుతం అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం వైద్య విద్యను అంగట్లో సరుకులాగా అమ్మేస్తున్నది, మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే 100 రోజుల్లోనే ఈ జీవో నంబర్ 107, 108 రద్దు చేస్తాను,

వైద్య విద్యను ప్రతిఒక్క విద్యార్థికి అందేవిధంగా చొరవ చేపడతాను" అని మైకుల ముందు ఉదర కొట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు మెడికల్ సీట్లు దక్కకుండా గత ప్రభుత్వం 107, 108 జిఓలను తెచ్చిందనీ, వాటిని రద్దుచేసి మొత్తం సీట్లను ప్రభుత్వ కోటాలోనే భర్తీ చేస్తామని ఇచ్చిన హామీ హామీగానే మిగిలిపోయింది.

గత ప్రభుత్వం సెల్ఫ్ ఫైనాన్స్ కోటా పేరుతో 50 శాతం సీట్లను కార్పొరేట్ విధానంగా నడిపారు అయితే, ప్రస్తుత ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలు 66 సంవత్సరాలు లీజుకు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు, అప్పనంగా ప్రైవేటు వారికీ వైద్య కళాశాలలను దోచిపెట్టే పనిలో ఉన్నదని వార్తలు వస్తున్నాయి. వైద్య కళాశాలలు ప్రైవేటుపరం అయితే పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరం కావడం ఖాయం. అంతేకాక పేద ప్రజలకు వైద్యం అందుబాటులో లేకుండా పోతుంది. డబ్బు ఉన్నవారు లక్షల కోట్లు ఖర్చుపెట్టి లేదా అప్పులుచేసి మరీ విద్యను అభ్యసిస్తారు. వైద్యునిగా స్థిరపడిన తర్వాత కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి ఆధునిక భవనాలు, వైద్య యంత్ర పరికరాలు ఏర్పాటు చేసి పెట్టుబడిగా పెట్టి వైద్యరంగాన్ని వ్యాపారంగా తయారు చేసే అవకాశం ఉంది, తద్వారా పేద, మధ్య తరగతి ప్రజలను అక్కడ కూడా దోపిడీ చేస్తున్నారు. ఇటువంటి సామాజిక, ఆర్థిక దోపిడీ విధానాన్ని మనందరం సంఘటితంగా ఎదుర్కొనాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు మెడికల్ సీట్లు దక్కకుండా గత ప్రభుత్వం తెచ్చిన 107, 108 జిఓలను రద్దు చేసి మొత్తం సీట్లను ప్రభుత్వ కోటాలోనే భర్తీ చేస్తామని ఇచ్చిన మాటకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉండాలి. ఇటు పేద విద్యార్థులకు అటు పేద ప్రజలకు నష్టం చేసే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ విధానాలను విరమించుకోవాలి. లేని పక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఏకమై ఉద్యమానికి సిద్ధంకావాలి.

ఉపాధ్యక్షులు
అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి
సెల్: 9133638567

గాలిలో మేడలు కట్టే పీ-4 పథకం

చలసాని వెంకటరామారావు

మహాత్మాగాంధీ 1920లో 14,000 మంది కార్మికులకు ప్రాతినిధ్యంవహించే అహ్మదాబాద్ టెక్స్‌టైల్ లేబరు అసోసియేషన్‌ను స్థాపించారు. అన్ని ప్రముఖ కార్మిక సంఘాలు ఆ నాడు ఏఐటీయూసీలో చేరాయి. కానీ మహాత్మాగాంధీ ఈ సంఘాన్ని ఏఐటీయూసీకి అనుబంధం చేయడానికి నిరాకరించారు. దానికి కారణం ఆయన వర్గ పోరాటాన్ని తీవ్రంగా వ్యతిరేకించడమే. వర్గ సంఘర్షణను ఆయన నిరాకరించారు. ఆయన ధర్మ కర్తృత్వ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఈ సిద్ధాంతం ప్రకారం, పరిశ్రమలు సమాజానికి చెందినవి. దాని యజమానులు ధర్మకర్తలు, ధర్మకర్తలకు వ్యతిరేకంగా ఎటువంటి సమ్మెలు, ఆందోళనలు కార్మికులు చేయరాదని గాంధీజీ భావించారు. మధ్యవర్తిత్వం ద్వారా మాత్రమే సమస్యలు పరిష్కరించాలని గాంధీజీ కోరుకున్నారు. యజమానులు తమ లాభాలకోసం కాకుండా సమాజోద్ధరణకే పరిశ్రమలు పెడుతున్నారనే భావనతో, వారి దయాదాక్షిణ్యాలపై కార్మికవర్గం ఆధారపడాలనే భావనను తన ధర్మకత్వ సిద్ధాంతం ద్వారా గాంధీ వ్యక్తపరిచారు. 1928 ఏప్రియల్ 18న ప్రారంభమై సెప్టెంబరు మధ్యవరకు ఐదు నెలలపాటు సాగిన టాటా ఇనుము-ఉక్కు కర్మాగారంలో సమ్మె విషయంలోనూ గాంధీజీ ఇదే వైఖరిని అనుసరించారు. దీర్ఘకాలిక సమ్మె అంతం కోసం యూనియన్ అధ్యక్షులు సీఎఫ్ ఆండ్రూస్ గాంధీని ఆహ్వానించారు. గాంధీ కుదిర్చిన ఒప్పందం కార్మికులకు సంతృప్తిని కలిగించలేదు. టాటా నాకు ఒక మానవతావాదిగా, కార్మికుల కష్టసుఖాలు ఆలోచించే మంచి యజమానిగా కన్పిస్తున్నాడని గాంధీ కితాబు ఇచ్చారు. గాంధీ ఒప్పందం చేసిన కొద్దికాలానికే యాజమాన్యం కార్మికులపై అణచివేత, రిట్రెంచ్‌మెంట్, జీతాల కోత వంటి తీవ్ర చర్యలకు పాల్పడింది. చివరకు గాంధీజీ అరెస్టుకు నిరసనగా అహ్మదాబాద్ టెక్స్‌టైల్స్ కార్మికులు సమ్మె చేయవలసి వచ్చింది. పెట్టుబడిదారులు ఎప్పటికి ధర్మకర్తలు కాలేరని ఈ ఘటనలు తెలియజేస్తున్నాయి. లాభాలే వారికి పరమావధిగా ఉంటాయనేది ఆచరణలో తెలసిన విషయం. వారు ఎప్పటికి కార్మికులకు, సమాజానికి ధర్మకర్తలుగా మనజాలలేరు అనేది వాస్తవం.

తెలంగాణలో నిజాం వ్యతిరేక సాయుధ పోరాట కాలంలో కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్ర మహాసభల నేతృత్వంలో లక్షలాది ఎకరాల భూమి పంపిణీ జరిగింది. దున్నే వాడికే భూమి నినాదాన్ని కమ్యూనిస్టుపార్టీ ఇచ్చింది. దీనితో భూస్వామ్య వర్గాలు, పెట్టుబడీదారీ, భూస్వామ్య పాలకవర్గాలు బెంబేలు ఎత్తి వినోబా భావే నేతృత్వంలో భూదాన యజ్ఞం కార్యక్రమాన్ని తెలంగాణా నుండి ప్రారంభించారు. దీనికి ఎంతో ప్రచారం కల్పించారు. కానీ వాస్తవానికి భూదాన యజ్ఞంలో భూస్వాములు, జమిందారుల, దేశ్‌ముఖ్‌లు కొండలు, గుట్టలు, నిస్సారమైన చౌడు భూములను, ఇతర వ్యవసాయానికి ఆయోగ్యమైన భూములను మాత్రం దానంగా ఇచ్చారు. దీనికే గొప్ప ప్రచారం కల్పించి దేశంలో భూ సమస్య పరిష్కారానికి దీనిని గొప్ప ప్రయత్నంగా ఆనాడు పాలకవర్గాలు ప్రచారం కల్పించాయి. అయినా 77ఏళ్ల స్వతంత్ర భారతంలో నేటికి భూమి సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. కమ్యూనిస్టు పోరాటాలు ఫలితంగా 1970 దశకంలో భూ సంస్కరణల చట్టాలు వచ్చినా నేటికి భూ సమస్య అపరిష్కృతం గానే ఉంది. గ్రామీణ పేదరికం, దారిద్ర్యం రోజురోజుకు పెరుగుతున్నది.

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో పేదరికం నిర్మూలనకు కొత్త పల్లవిని అందుకున్నారు. మహాత్మాగాంధీ, వినోబాబావే గతంలో ప్రారంభించి ఆచరణలో విఫలమైన ధర్మకర్తృత్వం, భూదానం వంటి అంశాలను తీసుకుని అదే తరహాలో సంపన్నుల నుంచి సంపదను స్వీకరించి పేదలకు పంపిణీ చేయడం ద్వారా పేదరికాన్ని నిర్మూలించే పీ-4 అనే పథకాన్ని ముందుకు తెచ్చారు. "మనం బాగుండాలి... మనతోపాటు మన చుట్టూ ఉన్న అందరూ బాగుండాలి" అంటూ చంద్రబాబు ఉగాది రోజున పీ4 ను విడుదల చేశారు. రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించడానికి అధిక ఆదాయాలు కలిగిన సంపన్నులు, ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గాల మధ్య అనుసంధానం ఏర్పాటుచేసి బలహీనులను ఆర్థికంగా బలవంతులుగా మార్పు చేయటం పీ-4లక్ష్యం. పీ-4 అంటే పబ్లిక్, ప్రైవేటు, పీపుల్‌పార్టనర్ షిప్ అని ముఖ్యమంత్రి చెబుతూ ఇది 2047 స్వర్ణ ఆంధ్రప్రదేశ్ దార్శనికతకు కీలకమైన పిల్లర్‌గా ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అత్యంత సంపన్నులైన పైస్థాయిలోని 10 శాతం సంపన్నులను మార్గదర్శకులుగా గుర్తించి, దిగువ స్థాయిలో అట్టడుగున ఉన్న 20 శాతం మందిని గుర్తించి పైస్థాయిలోని వారు కింది స్థాయిలోని వారిని ఆదుకోవాలని ఈ పీ-4 లక్ష్యం. దీని ప్రకారం కింది స్థాయి అట్టడుగు వర్గాలు బంగారు కుటుంబాలుగా రూపొందుతాయని చంద్రబాబు సెలవిచ్చారు. కానీ ఆచరణలో ఇది సుసాధ్యం కావటం పట్ల అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గత అనేక దశాబ్దాలుగా భారతదేశంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పేదరికం దినదినాభివృద్ధి చెందటం చూస్తున్నాం. కొన్ని సంపన్న వర్గాలు తమ సంపదను ఇబ్బడి ముబ్బడిగా పెంచుకునేం దుకు అట్టడుగు వర్గాల, శ్రమ జీవుల, కార్మికుల, అల్పాదాయ వర్గాల ప్రజలను దోపిడీ చేయటం, వారి శ్రమ శక్తికి తక్కువ విలువను ఆపాదిం చటం చూస్తున్నాం. కార్మికులతో ఎక్కువ గంటలు పని చేయించటం, తక్కువ వేతనాలు చెల్లించటం జరుగుతున్నది. దీని వలన ఆర్థిక అసమానతలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయాయి. దేశంలో, రాష్ట్రంలో ఈ అసమానతల పెరుగుదలను అనేక ఆర్థిక సంస్థల నివేదికలు తేటతెల్లం చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత దశాబ్దంకు పైగా కాలంలో పేదరికం, నిరుద్యోగం, పోషకాహార లోపం, శిశు మరణాలు పెరుగుతున్న వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే భవిష్యత్తు ఎంత దుర్భరం కానుందో అర్థం చేసుకోవచ్చును. ఎన్నికల ప్రయోజనాలను ఆశించి ఇబ్బడి ముబ్బడిగా కొత్త కొత్త సంక్షేమ పథకాలు తీసుకు వచ్చి వాటిని అమలు చేసే వనరులు లేక అప్పులపై ఆధారపడి రాష్ట్ర ప్రభుత్వం మనుగడ సాగిస్తున్నది. ఈ స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఆదాయ వనరులను పెంచుకునే మార్గాలను ఆలోచించుకోవాలి. కానీ దానికి భిన్నంగా సంపన్నుల త్యాగ నిరతిపై ఆధారపడి పీ-4 వంటి పథకాలతో ప్రజలను మభ్య పెట్టటం సరికాదు. ఈ పీ-4 అనేది ఆచరణకు వచ్చేసరికి "మేకను గుంజకు కట్టివేసి దానికి పులిని కావలి ఉంచినట్లు" గా ఉంటుంది. రాష్ట్రంలో పేదరికం నిర్మూలించటానికి ప్రభుత్వం ఆచరణలో తీసుకోవలసిన అంశాలనేకం ఉంటే వాటిని పక్కనబెట్టి వట్టి నినాదాలతో అరకొర చర్యలు పేదరికాన్ని నిర్మూలించలేవనేది వాస్తవం.

తెలంగాణలో నిజాం వ్యతిరేక సాయుధ పోరాట కాలంలో కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్ర మహాసభల నేతృత్వంలో లక్షలాది ఎకరాల భూమి పంపిణీ జరిగింది. దున్నే వాడికే భూమి నినాదాన్ని కమ్యూనిస్టుపార్టీ ఇచ్చింది. దీనితో భూస్వామ్య వర్గాలు, పెట్టుబడీదారీ, భూస్వామ్య పాలకవర్గాలు బెంబేలు ఎత్తి వినోబా భావే నేతృత్వంలో భూదాన యజ్ఞం కార్యక్రమాన్ని తెలంగాణా నుండి ప్రారంభించారు. దీనికి ఎంతో ప్రచారం కల్పించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా గ్రామాలపై ఆధారపడి ఉంది. గ్రామీణ ప్రాంతాలలో ఆర్థిక అసమానతల స్థాయిని తగ్గించాలంటే భూమి పంపిణీ జరగాలి. భూ సంస్కరణల చట్టం వచ్చి ఐదు దశాబ్దాలు గడిచినా నేటికి అపరిష్కృతంగానే ఈ సమస్య ఉన్నది. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను అమలుచేస్తే భూమి లేని ప్రతి కుటుంబానికి ఒక హెక్టారు భూమిని ఇవ్వవచ్చును. దీనిని అమలుచేస్తే గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి ఎంతో పెరుగుతుంది. నిరుద్యోగ సమస్య కొంత మేరకు పరిష్కారమై ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. దీని వల్ల గ్రామీణ పేదరికాన్ని తగ్గించవచ్చును. ఇంకా గ్రామీణ ప్రాంతాలలో ఫుడ్‌ప్రాసెసింగ్, బయోగ్యాస్ ప్లాంట్లను నిర్మించటం ద్వారా గ్యాస్ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పటం ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చు. రాష్ట్ర ముఖ్యమంత్రి వివిధ దేశాలతో అవగాహనా ఒప్పందాలు (ఎంఓయూ) చేసుకుని అమలులో ఇబ్బందుల వల్ల అనేక ఒప్పందాలు నిష్ఫలమౌతున్నాయి. భౌతిక పరిస్థితులకు అనుగుణంగా పరిశ్రమలను నెలకొల్పటం ద్వారా నిరుద్యోగ సమస్యను పరిష్కరించవచ్చును. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తి చేయటంద్వారా సాగు యోగ్యమైన ప్రతి ఎకరం భూమికి నీటి సదుపాయం కల్పించటం ద్వారా రాష్ట్రంలో పేదరికం నిర్మూలించవచ్చును. కేవలం రాజకీయ ప్రయోజనాలు ఆశించి సంక్షేమ పథకాలే సర్వస్వం అనుకుంటే రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడి పేదరికం వృద్ధి చెందుతుంది. "ఒక మనిషికి చేపను ఇస్తే ఆ రోజూ తింటాడు, కాని చేపను పట్టటం నేర్పితే ఎప్పుడూ తింటాడు" అనే చైనా సామెతను అర్థం చేసుకుని పేదరికం పోవాలంటే ప్రతి కుటుంబం స్వయం పోషకంఅయ్యే మార్గం ఆలోచించాలే గాని, సంపన్నుల దయాదాక్షిణ్యాలు మీద ఆధారపడటం "నేల విడిచి సాము చేయటమే" అవుతుంది. నేడు ఆంధ్రప్రదేశ్‌లో పేదరికాన్ని నిర్మూలించటం అనే ఆలోచన హర్షించవలసినదే. కాని రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ఉన్న విశాఖ ఉక్కు వంటి పరిశ్రమలను కాపాడుకోవటం ఎంతో అవసరం. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అవసరమైన నిధులను కేంద్రంపై ఒత్తిడి తెచ్చి సాధించుకోవాలి. కేంద్రంలోని మైనారిటీ ప్రభుత్వానికి చంద్రబాబు మద్దతు కీలకంగా ఉన్న పరిస్థితులలో వాస్తవిక దృక్పథంతో వ్యవహరించాలి. విభజన హామీలతో సహా, రాజధాని నిర్మాణం, పోలవరం పూర్తి, నిర్వాశితుల సమస్యలను పరిష్కరించేందుకు అన్ని పక్షాలను కలుపుకుని కేంద్రంపై ఒత్తిడి తేవాలి. అంతేగాని గాలిలో మేడలు కట్టే పీ-4 వంటి పథకాలకు ప్రాధాన్యత ఇవ్వరాదు. వాస్తవిక దృష్టితో వ్యవహరించాలి.

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు
సెల్ : 9490952093

సంక్షోభంలో గ్రామీణ భారతం

కృష్ణ ఝా

భారతదేశంలో గత రెండునెలల్లో గ్రామీణ ఉపాధి కల్పన మరింతగా దిగజారింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగ కల్పన దాదాపు మృగ్యమైందని చెప్పవచ్చు. తాజాగా "మింట్" పత్రికలో ప్రచురించిన నివేదిక ఈ సంవత్సరం ఏప్రిల్, మే నెలల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్ఈజీఎస్) కింద నైపుణ్యం లేని పనులకు డిమాండ్ పెరిగిందని తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ పథకం కింద 20.12 మిలియన్ల గ్రామీణ కుటుంబాలు ఉపాధిని నమోదుచేశాయి. మేలో ఇటువంటి కుటుంబాల సంఖ్య 20.37 మిలియన్లకు పెరిగి మొత్తంగా చూస్తే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ గణాంకాలు గ్రామీణ భారతదేశంలో ఉద్యోగ పరిస్థితి మరింత దిగజారడానికి నిదర్శనం. మార్చిలో ఈ పథకం కింద నమోదైన గ్రామీణ కుటుంబాల మొత్తం సంఖ్య 18.64 మిలియన్లు. గ్రామీణ కుటుంబాలకు చెందిన వయోజనులు వృత్తి నైపుణ్యంలేని చేతి పని చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ పథకం కింద ఉపాధి కోరుకునే వారికి సంవత్సరానికి కనీసం 100 రోజుల హామీ ఉపాధిని కేంద్ర ప్రభుత్వం కల్పించింది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, వ్యవసాయేతర ఉద్యోగ అవకాశాలు తగ్గినప్పుడల్లా ఎంజీఎన్‌ఆర్ఈజీఎస్ కింద పనికి డిమాండ్ పెరుగుతుంది.అయితే కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో ఎంజీఎన్‌ఆర్ఈజీఎస్ కింద ఉపాధి కోరుకునే గ్రామీణ కుటుంబాల సంఖ్య పెరిగింది. దీనికి ప్రధానకారణం దేశ ఆర్థిక వ్యవస్థ కుచించుకుపోవడం గ్రామాల్లో జీవనోపాధి దిగజారడమే.

గ్రామీణ ఉపాధి హామీ పథకానికి డిమాండ్ పెరిగినప్పటికీ, ఈ

సంవత్సరం కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి పథకం కోసం బడ్జెట్ కేటాయింపులలో ఎటువంటి పెరుగుదల చేయకపోవడం తాజాగా గ్రామాల్లో జీవన పరిస్థితిని మరింత దిగజారడానికి కారణమైంది. అయితే 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో ఎంజీఎన్‌ఆర్ఈజీఎస్ కోసం రూ.86,000 కోట్లు కేటాయించింది. వామపక్ష పార్టీల ఒత్తిడి కారణంగానే 2005లో ప్రారంభించిన ఎంజీఎన్‌ఆర్ఈజీఎస్‌ను యూపీఏ ప్రభుత్వం ప్రారంభించింది. మన్‌మోహన్ సింగ్ ప్రభుత్వం తీసుకువచ్చిన మొదటి ప్రధాన సంక్షేమ పథకాలలో ఇది ఒకటని చెప్పవచ్చు. ఎంజీఎన్‌ఆర్ఈజీఎస్ గ్రామీణ ప్రజలకు, కార్మికులకు అనతికాలంలోనే జీవనాధారంగా మారింది. గ్రామాల్లో పేదరిక నిర్మూలనకు అత్యంత శక్తిమంతమైన పథకంగా నిరూపితమైంది. ఇది ఒక ఆర్థిక సంవత్సరంలో కనీసం 100 రోజుల ఉపాధి హామీ వేతన ఉపాధిని అందించడం ద్వారా గ్రామీణ కుటుంబాలకు జీవనోపాధి భద్రతను కల్పించింది. గ్రామాల నుంచి వలసలను తగ్గించడంలో ఈ పథకం చేయూతనిచ్చింది. అయితే నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రారంభం నుంచి ఎంజీఎన్‌ఆర్ఈజీఎస్‌కి వ్యతిరేకంగా కీలక వైఖరిని తీసుకుంది. 60 ఏళ్లలో కాంగ్రెస్ పార్టీ పేదరికాన్ని ఎదుర్కోవడంలో విఫలమైనందుకు మోదీ ఎంజీఎన్‌ఆర్ఈజీఎస్‌ను "జీవన స్మారక చిహ్నం"గా అభివర్ణించారు. అయితే మోదీ ఈ విధానంపై వ్యతిరేకంగా ఉన్నప్పటికీ, 2020లో కోవిడ్-19 మహమ్మారి కారణంగా లాక్‌డౌన్ అమలు చేయడంతో ఎంజీఎన్‌ఆర్ఈజీఎస్ చాలా మందికి జీవనాధారమైంది. ఈ పథకం అమలుతో ప్రజలు గ్రామాలకు వలసలు వెళ్లారు. అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం చేపట్టిన 2022 అధ్యయనం ప్రకారం, గ్రామీణ కుటుంబాలకు లాక్‌డౌన్ ప్రభావంతో సంభవించిన ఆదాయ నష్టంలో 20 శాతం నుంచి 80 శాతం మధ్య భర్తీ చేయడానికి ఈ పథకం సహాయపడింది.

వాస్తవానికి, కోవిడ్ తర్వాత ఉద్యోగాల సంక్షోభంలో కూడా ఎంజీఎన్‌ఆర్ఈజీఎస్ ప్రధాన పాత్ర పోషించింది. 2023-24లో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించడంలో ఈ పథకం గణనీయమైన పాత్ర పోషించింది. ఈ కారణంగానే ఎంజీఎన్‌ఆర్ఈజీఎస్ ద్వారా గ్రామీణ ఉపాధిపై లోక్‌సభ స్టాండింగ్ కమిటీ ఫిబ్రవరి 2024 నివేదిక 2023-24లో ఈ పథకానికి బడ్జెట్ కేటాయింపులో తగ్గింపుపై పరిశీలన చేయవలసిందిగా పేర్కొంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకంలో కార్మికులు, జాబ్ కార్డులు పెరిగాయని, వాస్తవ ఉద్యోగ సృష్టి తగ్గిందని వెల్లడించింది. 2024-25లో నికరంగా 1.16 కోట్ల జాబ్ కార్డులు,1.31 కోట్ల మంది కార్మికులు చేరారని తెలిపింది. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 5.9 కోట్ల కార్మికులు, 2.1 కోట్ల కుటుంబాలను తొలగించినట్లు అధ్యయనం వెల్లడించింది. "ది టెలిగ్రాఫ్" నివేదిక ప్రకారం, ఎంజీఎన్‌ఆర్ఈజీఎస్ ద్వారా వ్యక్తిగత పని దినాలు 2023-24లో 289 కోట్ల నుంచి 2024-25లో 268 కోట్లకు తగ్గాయి. ప్రతి ఇంటికి సగటు ఉపాధి దినాలు కూడా 52 నుంచి 50కి తగ్గాయి. దేశంలోని కొన్ని ప్రాంతాలలో ఎంజీఎన్‌ఆర్ఈజీఎస్ అమలులో మోసపూరిత విధానాలు అమలు చేస్తున్నట్లు నివేదికలు వెల్లడించాయి. ఉదాహరణకు, ఈ నెల ప్రారంభంలో ప్రచురించిన "డెక్కన్ హెరాల్డ్" నివేదిక ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లాలోని ఒక గ్రామంలో ఈ పథకం కింద జరిగిన మోసం గురించి ప్రస్తావించింది. మరణించిన గ్రామస్తుల పేర్లతో జాబ్ కార్డులను సృష్టించి, కాగితంపై "పని పూర్తయింది" అని తప్పుగా చూపించి వేతనాలను ఉపసంహరించుకుంది.

రెండు తలల విషనాగు పాక్

ఎంజే అక్బర్



న్యూదిల్లీ: పహల్గాం ఉగ్రదాడి అత్యంత పాశవికమని, యూరప్ చవిచూసిన మత ఉగ్రవాదం తరహా అనాగరిక చర్య అని కోపెన్‌హెగెన్‌లో పర్యటిస్తున్న అఖిలపక్ష ప్రతినిధి బృందం సభ్యుడు, కేంద్ర మాజీమంత్రి ఎంజే అక్బర్ అన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌ను విషపు నాగుతో పోల్చారు. ఆ దేశంలోని ప్రభుత్వానికి చీలిక నాలుక, రెండు తలలు ఉన్నాయని అన్నారు. డెన్మార్ రాజధాని కోపెన్‌హెగెన్‌లో ఎన్ఆర్ఐలతో అఖిలపక్ష ఎంపీల ప్రతినిధి బృందం మాట్లాడింది. ఈ ప్రతినిధి బృందానికి బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ సారథ్యం వహించారు. ఏప్రిల్ 26న పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది ప్రజలను కాల్చిచంపారని, ఇందుకు ప్రతిగా ఇస్లామాబాద్‌పై భారత్ కఠిన చర్యలు తీసుకుందని, దీంతో న్యూదిల్లీతో ఇస్లామాబాద్ చర్చల ప్రస్తావన చేస్తోందన్నారు. 'పాకిస్థాన్‌లో రెండు ముఖాల ప్రభుత్వం ఉంది. ఏ ముఖంతో మేము మాట్లాడాలి? అక్కడున్నది చీలిక నాలుక ఉన్న ప్రభుత్వం. ఏ నాలుకతో చర్చించాలి? విషపు నాలుకతో వాళ్లు మాట్లాడతారు. పాము ఎప్పుడూ తన విషం వల్ల తాను చనిపోదు. ఇతరులకే నష్టం' అని పాక్‌పై ఆయన విమర్శలు గుప్పించారు. చర్చల పేరుతో కాలాన్ని తాము వృథా చేయబోమని, సమస్యలను పరిష్కరించుకునే నైతిక స్థైర్యం తమకుందని చెప్పారు. పాక్ చర్చల ప్రస్తావనంతా ఒక బూటకమని, మరో ఉగ్రదాడికి ఆ దేశం సిద్ధమయ్యేంతవరకూ కాలయాపన జరిపే ఉద్దేశం మాత్రమేనని పాక్ వైఖరిని ఎండగట్టారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాక్‌కు గుణపాఠం చెప్పేందుకు తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని అక్బర్ అన్నారు. పాకిస్థాన్ బూటకపు మాటలు నమ్మే నాయకత్వం కాదని స్పష్టం చేశారు.

'టైగర్ మ్యాన్' వాల్మీక్ థాపర్ కన్నుమూత

న్యూదిల్లీ: ప్రఖ్యాత పులుల సంరక్షణకారుడు, రచయిత వాల్మీక్ థాపర్ (73) కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా క్యాన్సర్‌తో పోరాడుతున్న ఆయన శనివారం ఉదయం దిల్లీలోని కౌటిల్య మార్గ్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. థాపర్... తన జీవితాన్ని నాలుగు దశాబ్దాలకు పైగా వన్యప్రాణుల సంరక్షణకు అంకితం చేశారు. ముఖ్యంగా పులుల రక్షణలో వాల్మీక్ థాపర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన దిల్లీ విశ్వవిద్యాలయంలోని సెయింట్ స్టీఫెన్స్ కళాశాల నుంచి సోషియాలజీలో గోల్డ్‌మెడల్ సాధించారు. లివింగ్ విత్ టైగర్స్, ది సీక్రెట్ లైఫ్ ఆఫ్ టైగర్స్ వంటి దాదాపు 30కి పైగా పుస్తకాలు రచించారు. ఆయనకు 'ఇండియన్ టైగర్ మ్యాన్'గా మంచి గుర్తింపు ఉంది. వాల్మీక్ థాపర్ మృతి వార్త తెలుసుకున్న రాజకీయ, సినీ ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు. వన్యప్రాణుల సంరక్షణకు ఆయన చేసిన కృషిని కొనియాడారు. లోధీ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

టర్కీతో లీజు ముగించాలి... ఇండిగోకు కేంద్రం ఆదేశం

న్యూదిల్లీ: ఆపరేషన్ సింధూర్ సమయంలో పాకిస్థాన్‌కు టర్కీ మద్దతు ఇవ్వడాన్ని కేంద్రం జీర్ణించుకోలేకపోతోంది. దీంతో టర్కీకి షాకుల మీద షాకులిస్తోంది. ఇండిగోను టర్కిష్ ఎయిర్‌లైన్స్‌తో తన విమానాల లీజు ఒప్పందాన్ని మూడు నెలల్లోగా ముగించాలని కేంద్రం ఆదేశించింది. దిల్లీతో సహా భారత్ లోని తొమ్మిది కీలక విమానాశ్రయాలలో సేవలను నిర్వహించిన టర్కీ-సంబంధిత సంస్థ సెలెబి ఏవియేషన్‌కు భద్రతా అనుమతిని ప్రభుత్వం రద్దు చేసిన కొన్ని వారాల తర్వాత టర్కీకి మరో దెబ్బ తగిలేలా చేసింది. ఇండిగో 'డంప్ లీజు' ఒప్పందాన్ని ఆగస్టు 31, 2025 నాటికి రద్దు చేస్తామని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తెలిపింది. ప్రస్తుతం, ఇండిగో టర్కిష్ ఎయిర్‌లైన్స్ నుంచి డంప్ లీజుకు రెండు బోయింగ్ 777-300 ఈఆర్ విమానాలను తీసుకొని దిల్లీ, ముంబై నుంచి ఇస్తాంబుల్‌కు విమానాలను నడుపుతోంది. వాస్తవానికి ఈ లీజు గడువు మే 31న ముగియాల్సి ఉండగా, ఇండిగో అభ్యర్థన మేరకు డీజీసీఏ దానిని మరో మూడు నెలలు పొడిగించింది. లీజును ఆరు నెలలు పొడిగించాలని ఇండిగో కోరగా డీజీసీఏ దానిని తిరస్కరించింది.

ఉగ్రవాదానికి, మతవిద్వేషానికి వ్యతిరేకంగా

దృఢంగా, స్థిరంగా పోరాడదాం

ఏఐటీయూసీ జనరల్ కౌన్సిల్ పిలుపు

(జైపూర్ నుంచి డి.సోమసుందర్)

భారతదేశపు లౌకిక ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు సంఘ్‌పరివార్ విషపూరిత, విచ్ఛిన్నవాద కుట్రలను దృఢనిశ్చయంతో, స్థిరసంకల్పంతో శ్రామికప్రజలు ఎదుర్కొని ఓడించాలని ఏఐటీయూసీ జనరల్ కౌన్సిల్ సమావేశం పిలుపు ఇచ్చింది. జైపూర్‌లో జరుగుతున్న ఏఐటీయూసీ మూడురోజుల జనరల్ కౌన్సిల్ సమావేశాల రెండోరోజు సెషన్‌లో 'టెర్రరిజానికి, మత విద్వేషానికి వ్యతిరేకంగా చేతులు కలపండి' పేరుతో తీర్మానాన్ని ఆమోదించింది. ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి వహీదా నిజామీ ఈ తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. సమావేశాలకు ఏఐటీయూసీ జాతీయ అధ్యక్షుడు రామేంద్ర కుమార్ అధ్యక్షత వహించారు. 'ఏప్రిల్ 22న పహల్గాంలో 26 మంది అమాయక ప్రజలను పొట్టనబెట్టుకున్న తీవ్రవాదుల అమానుష చర్య దేశప్రజల మనసులను కలచి వేసింది. టెర్రరిజం అనేది ఒక శాపం. అది మానవత్వానికే అవమానం. పాకిస్థాన్ ప్రభుత్వ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ఏఐటీయూసీ జనరల్ కౌన్సిల్ తీవ్రంగా ఖండిస్తున్నది' అని ఆ తీర్మానం పేర్కొన్నది. 'ఉగ్రవాదుల క్రూరమైన నేరానికి బలైన బాధిత కుటుంబాలకు ఏఐటీయూసీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. మన సైనిక బలగాలు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' ఉగ్రవాద శిబిరాలపై సూటిగా గురిపెట్టి చేసిన దాడి అని, అందుకు భద్రతా దళాలకు ఏఐటీయూసీ తరపున కృతజ్ఞతలు, అభినందనలు తెలుపుతు న్నట్లు తీర్మానం పేర్కొన్నది. ఇలాంటి విషాద సమయంలో కనీస సానుభూతి, సున్నితత్వం లేకుండా బీజేపీ ఒక రాబందులా శవరాజకీయానికి తెరతీయడం సిగ్గుచేటు. భారతీయ ముస్లిములను దెయ్యాలుగా చూపించడానికి బీజేపీ ఈ సందర్భాన్ని వినియోగించుకున్నది. విద్వేష రాజకీయాలను ఉధృతం చేయడానికి దుర్మార్గ ప్రయత్నాలు సాగించింది. ముస్లిము మైనారిటీలపై విద్వేష ప్రచారానికి మీడియా కూడా తెగబడింది. మీడియాను బీజేపీ దారుణంగా వాడుకున్నది' అంటూ ఏఐటీయూసీ విమర్శించింది. దేశంలో హిందూ రాష్ట్ర స్థాపనకు తమ దుష్ట సంకల్పాన్ని ముందుకు తీసుకుపోయేందుకు మోదీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ఆర్ఎస్ఎస్ సంకల్పిస్తున్న మెజారిటీ ఆధిపత్యవాద స్థాపన కోసం మన సమాజాన్ని, చట్టాలను, వీధి బలగాలను, ఎన్నికల ప్రచారాన్ని, ఎన్నికలను అన్నింటినీ లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నది' అని తీర్మానం హెచ్చరించింది. ముస్లింలపై ద్వేషాన్ని పెంచడానికి, వారిని సమాజం నుండి వెలి వేయడానికి పహల్గాం ఘటన బీజేపీ ప్రయత్నాలకు సారవంతమైన క్షేత్రంగా దొరికిందని ఏఐటీయూసీ పేర్కొన్నది. 'భారతీయ ఆధునిక చరిత్ర నేడు ఒక ప్రమాదకర దశకు చేరుకున్నది. అయితే మతప్రాతిపదికపై మనలో విభజన తెచ్చేందుకు విచ్ఛిన్నశక్తులు చేస్తున్న ప్రయత్నాలకు శ్రామికప్రజలు ఎంతమాత్రమూ అవకాశం ఇవ్వరాదు' అని ఏఐటీయూసీ పిలుపు ఇచ్చింది. విభజించి పాలించడానికి బ్రిటిష్ వలసపాలకులు చేపట్టిన విభజన కుట్రలకు వ్యతిరేకంగా భారతీయ కార్మికవర్గం అప్పట్లో దృఢంగా నిలిచింది. లౌకిక ప్రజాస్వామ్య జాతి నిర్మాణం కోసం సర్వశక్తులూ ఒడ్డి పోరాడింది. లౌకికతత్వంలోనే నిజమైన ఇండియా అనే భావన ఉందని రుజువు చేసింది. మన ప్రజాస్వామ్య విలువలకు లౌకికవాదమే మూల స్తంభంగా నిలుస్తున్నది. ఇప్పుడు మరోసారి భారతీయ కార్మికవర్గం లౌకిక ప్రజాస్వామ్యానికి హాని కలిగించే విచ్ఛిన్నశక్తుల కుట్రలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన తరుణం ఆసన్నమయింది' అని తీర్మానంలో ఏఐటీయూసీ పిలుపు ఇచ్చింది. ఉగ్రవాద చర్యలను ముక్తకంఠంతో ఖండించడంలో, టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడటంలో ఏఐటీయూసీ ముందు పీఠిన నిలుస్తుంది. అదే సమయంలో మైనారిటీ సోదరులను అపఖ్యాతి పాలు చేసే, దూషించే ఎలాంటి చర్యలకు తావు ఇవ్వదు. ఈ విషయంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ కుట్రలకు వ్యతిరేకంగా గట్టిగా ఎదురొడ్డి పోరాడుతుంది. ఫాసిజానికి వ్యతిరేకంగా కూడగట్టే సంఘీభావమే మనబలం. విచ్ఛిన్నవాదుల విషానికి కార్మికవర్గ ఐక్యతే విరుగుడని ఏఐటీయూసీ పేర్కొన్నది.

ఈ తీర్మానాన్ని జనరల్ కౌన్సిల్ సమావేశం హర్షధ్వానాలతో ఆమోదించింది. ఏఐటీయూసీ జాతీయ ప్రధానకార్యదర్శి అమర్‌జీత్ కౌర్ ప్రవేశపెట్టిన కార్యకలాపాల నివేదికపై రెండోరోజు విస్తృతమైన చర్చలు కొనసాగాయి. పలు తీర్మానాలను సమావేశం ఆమోదించింది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఏఐటీయూసీ నేతలు తమ తమ రాష్ట్రాల్లో చేపట్టిన కార్యక్రమాలపై సవివరంగా మాట్లాడారు.

ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్ రాజ్ మాట్లాడుతూ ఎన్నోపోరాటాలు చేసి సాధించుకున్న కార్మికచట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా సాగుతున్న దేశవ్యాప్త పోరాటంలో తెలంగాణ కార్మికవర్గం ముందు నిలుస్తున్నదని తెలిపారు. పెరుగుతున్న కార్మిక, ప్రజా పోరాటాల ఉధృతిని చూసి ప్రజలను పక్కదారి పట్టించడానికి పహల్గాం ఘటనను, తీవ్రవాద సమస్యను ముందుకు తెచ్చారని బాల్‌రాజ్ అనుమానం వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి కోశాధికారి బీవీవీ కొండలరావు రాష్ట్ర కార్యకలాపాల నివేదికను వివరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు శస్త్రచికిత్స కారణంగా సమావేశాలకు హాజరు కాలేకపోయారని తెలిపారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో పదమూడు జిల్లాల్లో జిల్లాస్థాయి కార్మిక సమావేశాలు నిర్వహించామని వివరించారు. కార్మిక సమస్యలపై విజయవాడలో పదిహేను వేలమందితో భారీ ర్యాలీ జరిపామని తెలిపారు. అఖిల భారత ఉక్కు కార్మికుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ దేశంలో ఉక్కు పరిశ్రమలో జరుగుతున్న పరిణామాలు తీవ్ర ఆందోళనకరంగా మారాయని అన్నారు. భిలాయ్, బొకారో వంటి కర్మాగారాల్లో భారీ ఎత్తున కాంట్రాక్టీకరణ చోటుచేసుకుందని తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారం కార్మికులు సాగిస్తున్న నిరవధిక పోరాటం పూర్వాపరాలను ఆదినారాయణ వివరించారు. భవన, ఇతర నిర్మాణ కార్మికుల సమాఖ్య జాతీయ ఉప ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక ఉద్యమాన్ని పటిష్టం చేసే ప్రయత్నం చేస్తున్నామని, ఇప్పటికే పద్దెనిమిది రాష్ట్రాల్లో సంఘాలు ఏర్పడ్డాయని, త్వరలో మరో ఐదారు రాష్ట్రాల్లో సంఘాలు ఏర్పడనున్నాయని తెలిపారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు యూసఫ్, ఆంధ్రప్రదేశ్ సమితి గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్.వెంకటసుబ్బయ్య తదితరులు మాట్లాడారు.

తాజ్‌మహల్ రక్షణకు యాంటీ డ్రోన్ వ్యవస్థ

ఆగ్రా: తాజ్‌మహల్ రక్షణకు ప్రత్యేక యాంటీ డ్రోన్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అదనపు భద్రతలో భాగంగా పాలరాతి కట్టడం వద్ద ఈ ఏర్పాట్లు చేశారు. తాజ్ సెక్యూరిటీకి చెందిన ఏసీపీ సయ్యద్ ఆరిబ్ అహ్మద్ మాట్లాడుతూ... తాజ్‌మహల్ పరిసరాల్లో ఎటువంటి డ్రోన్లను రానివ్వకుండా యంటీ డ్రోన్ వ్యవస్థను అమర్చినట్లు చెప్పారు.

చుట్టూ 500 మీటర్ల మేర యాంటీ డ్రోన్ వ్యవస్థ నిఘా ఉంటుందన్నారు. ఎటువంటి డ్రోన్ కనిపించినా దాన్ని గుర్తించి, ధ్వంసం చేస్తుందని ఆరిబ్ చెప్పారు. వాస్తవానికి యాంటీ డ్రోన్ వ్యవస్థ... సుమారు ఎనిమిది కిలోమీటర్ల పరిధి వరకు పనిచేస్తుందని, కానీ తాజ్ పరిసరాలను సెక్యూరిటీ సున్నిత ప్రదేశంగా భావిస్తూ కేవలం 500 మీటర్ల పరిధికే పరిమితం చేసినట్లు అహ్మద్ తెలిపారు. రేడియో ఫ్రీక్వెన్సీ, జీపీఎస్ సిగ్నల్ జామ్ టెక్నాలజీ ద్వారా యాంటీ డ్రోన్ వ్యవస్థ... డ్రోన్లను కూల్చుతుందని వివరించారు. డ్రోన్ కూలిపోగానే అక్కడకు ర్యాపిడ్ రెస్పాన్స్ బృందం వెళ్తుందని, తర్వాత ఆ లొకేషన్‌ను ఆధీనంలోకి తీసుకుంటారని చెప్పారు. డ్రోన్‌ను ఆపరేట్ చేసిన వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకోనున్నట్లు తెలిపారు.

విద్వేష ప్రసంగం కేసులో ఎమ్మెల్యేకి రెండేళ్ల జైలు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా విద్వేషపూరిత ప్రసంగం చేసిన కేసులో ఎమ్మెల్యేకి కోర్టు శిక్ష విధించింది. ఉత్తరప్రదేశ్‌లోని మావు జిల్లాలో ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు సుహాల్దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్‌బీఎస్‌పీ) ఎమ్మెల్యే అబ్బాస్ అన్సారీకి రెండేళ్ల జైలుశిక్ష విధించింది. ఇదే కేసులో దోషిగా తేలిన అబ్బాస్ అన్సారీ సన్నిహితుడు మన్సూర్ అన్సారీకి కూడా కోర్టు ఆరు నెలల జైలుశిక్ష విధించింది. విద్వేషపూరిత ప్రసంగం, ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసులలో ఎమ్మెల్యే అబ్బాస్ అన్సారీ, అతడి సన్నిహితుడు మన్సూర్ అన్సారీలను ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు శనివారం దోషులుగా తేల్చింది. అబ్బాస్ అన్సారీకి రెండేళ్ల జైలుశిక్ష, రూ.రెండు వేల జరిమానా విధించింది. మన్సూర్ అన్సారీకి ఆరు నెలల జైలుశిక్ష విధించింది.

దేశ సంక్షేమం కోసమే డీఎంకేతో పొత్తు: కమల్

చెన్నై: దేశ సంక్షేమం కోసమే డీఎంకే కూటమిలో చేరామని మక్కల్ నీదిమయ్యం(ఎంఎన్ఎం) అధినేత కమల్‌హాసన్ చెప్పారు. డీఎంకే ప్రధాన కార్యాలయమైన అన్నా అరివాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులను మర్యాదపూర్వకంగా ఆయన కలుసుకున్నారు. జూన్ 19న జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో పార్టీకి ఓ సీటిచ్చినందుకుగాను ఆయన స్టాలిన్, డీఎంకే నేతలకు ధన్యవాదాలు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కుదిరిన పొత్తుల ప్రకారం లభించిన రాజ్యసభ స్థానానికి కమల్ పోటీ చేయనున్న విషయం విదితమే. ఈ భేటీ అనంతరం కమల్‌హాసన్ అన్నా అరివాలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. మక్కల్ నీది మయ్యంకు రాజ్యసభ స్థానం కేటాయించినందుకుగాను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులను కలుసుకుని కృతజ్ఞతలు తెలిపానని చెప్పారు. రాజ్యసభ ఎన్నికల ముందస్తు ఏర్పాట్ల గురించి స్టాలిన్ తనకు సమగ్రంగా వివరించారని తెలిపారు. దేశ సంక్షేమానికి అవసరమైనందున డీఎంకే కూటమిలో చేరినట్లు ఆయన చెప్పారు. ఇకపై రాజ్యసభలో రాష్ట్రానికి సంబంధించిన సమస్యలపై మాట్లాడి పరిష్కరించేందుకు దోహదపడతానని చెప్పారు. రాష్ట్ర సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని కమల్ హాసన్ అన్నారు.

'ఒకే దేశం-ఒకే భర్త'పై రాజకీయ దుమారం

తిరువనంతపురం: 'ఒకే దేశం-ఒకే భర్త' అనే ట్యాగ్‌లైన్‌తో కేరళ కాంగ్రెస్ పార్టీ చేసిన ట్వీట్ రాష్ట్రంలో కొత్త వివాదానికి తెరతీసింది. సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ చేసియబడిన ఈ పోస్ట్... కాంగ్రెస్ వర్సెస్ బీజేపీగా మారింది. కాంగ్రెస్ హిందూ ఆచారాలను లక్ష్యంగా చేసుకుంటుందని, అగౌరవపరుస్తోందని, బుజ్జగింపు రాజకీయాల్లో పాల్గొంటోందని కేరళ బీజేపీ ఎదురుదాడికి దిగింది. కేరళ కాంగ్రెస్ అధికారిక ఎక్స్ హ్యాండిల్ నుంచి 'ఒకే దేశం-ఒకే భర్త' అనే క్యాప్షన్‌తో పాటు ఒక ఫొటోను ట్వీట్ చేసింది. ఈ ట్వీట్ ప్రధాని మోదీ వ్యక్తిగత జీవితంపై వ్యంగ్యంగా చేసినట్లు కనిపిస్తోంది. అయితే, ఈ పోస్ట్ హిందువుల మనోభావాలు కించపరిచేలా, అవమానకరంగా ఉందని బీజేపీ ఆరోపించింది. 'ఈ ట్వీట్ కేవలం రాజకీయం కాదు... ఇది హిందూ ఆచారాలపై దాడి. సిందూరం ధరించిన మహిళలను అవమానించిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. కేరళలోని లక్షలాది మంది మహిళలకు సిందూరం ఎంతో పవిత్రమైందని, వివాహం, మహిళలకు చిహ్నం అని బీజేపీ తెలిపింది. కాంగ్రెస్ చేసిన ట్వీట్ కాంగ్రెస్‌లోని పీఎఫ్ఐ భావజాలాన్ని ప్రతిబింబిస్తోందని బీజేపీ విమర్శించింది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం హిందూ, క్రైస్తవ విశ్వాసాలపై కాంగ్రెస్ నిరంతరం దాడులు చేస్తోందని ఆరోపించింది. గతంలో శబరిమలను అపవిత్రం చేయడానికి కాంగ్రెస్ వామపక్షాలతో నిలిచిందని, వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా తీర్మానాలు ఆమోదించిందని బీజేపీ చెప్పింది.

ఫలించిన భారత్ దౌత్యం

కొలంబియా ప్రకటన వెనక్కి

న్యూదిల్లీ: ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌లో ప్రాణాలు కోల్పోయిన వారికి కొలంబియా ప్రభుత్వం సంతాపం తెలపడంపై కాంగ్రెస్ నాయకుడు శశిథరూర్ వ్యక్తం చేసిన అసహనం ఫలితాన్నిచ్చింది. తమ సంతాప ప్రకటనను కొలంబియా వెనక్కి తీసుకుంది. ఉగ్రవాదంపై పాకిస్థాన్ అనుసరిస్తున్న విధానాన్ని ఎండగట్టేందుకు భారత పార్లమెంటరీ అఖిలపక్ష ప్రతినిధి బృందాలు పలు దేశాల్లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. అందులోభాగంగా థరూర్ నేతృత్వంలోని బృందం కొలంబియాకు వెళ్లింది. ఆ దేశ విదేశాంగ శాఖ ఉప మంత్రి రోసా యెలాండ్ విల్లావిసెన్సియోతో థరూర్ భేటీ అయ్యారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి, ఆ తర్వాత భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన పూర్తి విషయాలు ఆయన తెలియజేశారు. అనంతరం యెలాండ్ మీడియాతో మాట్లాడుతూ తమ ప్రకటనను వెనక్కి తీసుకుంటున్నట్లు తెలిపారు. 'ఈ రోజు భారత బృందం మాకు అన్ని విషయాలు తెలియజేసింది. కశ్మీర్‌లో ఏం జరిగిందనేది పూర్తిగా తెలుసుకున్నాం. దాడులకు దారితీసిన పరిస్థితిపై అవగాహన వచ్చింది' అని వెల్లడించారు. ఈ ప్రకటన అనంతరం థరూర్ కొలంబియా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉగ్రవాదంపై తమ వైఖరిని వారు పూర్తిగా తెలుసుకున్నారని థరూర్ తెలిపారు.

అమెరికా సుంకాలతో ప్రతికూల ప్రభావం: జీటీఆర్ఐ



న్యూదిల్లీ: ఉక్కు అల్యూమినియంపై అమెరికా సుంకాలు రెట్టింపు చేయడంతో భారత ఎగుమతులు తీవ్రంగా ప్రభావితమవుతాయని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్షియేటివ్ (జీటీఆర్ఐ) శనివారం పేర్కొంది. ఈ చర్య భారత ఉత్పత్తిదారులు, ఎగుమతిదారుల లాభదాయకతను దెబ్బతీస్తుందని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ అన్నారు. భారత్‌పై ఈ పరిణామం ప్రత్యక్షంగా ఉంటుందని అన్నారు. ఈ సుంకాలకు ప్రతిస్పందనగా అమెరికా ఎగుమతులపై భారత్ ప్రతీకార సుంకాలు విధిస్తుందో లేదో చూడాలని అన్నారు. గతంలో విధించిన ఉక్కు సుంకాలకు ప్రతిస్పందనగా అమెరికా వస్తువులపై ప్రతీకార సుంకాలు విధించే ఉద్దేశాన్ని సూచిస్తూ భారత్ ఇప్పటికే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ)లో అధికారిక నోటీసు జారీ చేసిందని అన్నారు. ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై ప్రస్తుతం ఉన్న 25 శాతం సుంకాలను రెట్టింపు చేస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శుక్రవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. 1962 నాటి అమెరికా వాణిజ్య విస్తరణ చట్టంలోని సెక్షన్ 232 కింద ఈ పెంపుదల చేశారు. విదేశాల నుండి దిగుమతులు జాతీయ భద్రతకు ప్రమాదంగా భావిస్తే సుంకాలు లేదా ఇతర వాణిజ్య పరిమితులు విధించడానికి ఈ చట్టం అనుమతిస్తుంది. 2018లో ఉక్కుపై 25 శాతం, అల్యూమినియంపై 10 శాతం సుంకాలు విధించేందుకు ట్రంప్ మొదట ఈ సెక్షన్ వినియోగించారు. తిరిగి 2025 ఫిబ్రవరిలో ఉక్కు, అల్యూమినియంపై సుంకాలను 25 శాతానికి పెంచారు. 2024-25లో, భారతదేశం అమెరికాకు 4.56 బిలియన్ డాలర్ల విలువైన ఇనుము, ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులు ఎగుమతి చేసింది. వీటిలో 587.5 మిలియన్ డాలర్ల ఇనుము, ఉక్కు, 3.1 బిలియన్ డాలర్ల ఇనుము లేదా ఉక్కు వస్తువులు, 860 మిలియన్ డాలర్ల అల్యూమినియం, సంబంధిత వస్తువులు ఉన్నాయి.

తొమ్మిది మంది ఉగ్రవాదుల అరెస్ట్

ఇంఫాల్: మణిపూర్‌లోని వివిధ నిషేధిత సంస్థలకు చెందిన తొమ్మిదిమంది ఉగ్రవాదులను భద్రతా దళాలు అరెస్ట్ చేశాయని శనివారం పోలీసులు తెలిపారు. దోపిడీ కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై బిష్ణుపూర్ జిల్లాలోని లీమాపోక్‌పామ్ నుండి నిషేధిత కాంగ్లీ యావోల్ కన్నలూప్ (కేవైకేఎల్)కు చెందిన ముగ్గురు క్రియాశీల కార్యకర్తలను గురువారం అదుపులోకి తీసుకున్నట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. వారి నుండి రెండు తుపాకులు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నామని అన్నారు. శుక్రవారం తెంగ్నౌపాల్ జిల్లాలోని గ్యాంగ్‌పిజాంగ్ గ్రామం నుండి నిషేధిత పీఎల్ఏకు చెందిన ముగ్గురు కార్యకర్తలను, ఇద్దరు సభ్యులను భద్రతా దళాలు అరెస్ట్ చేసినట్లు ఆ అధికారి తెలిపారు. నిషేధిత కేసీపీ (పీడబ్ల్యూజీ)కి చెందిన క్రియాశీల కార్యకర్తను ఇంఫాల్‌లోని వెస్ట్ జిల్లా యమ్నామ్ హుయిద్రోమ్ ప్రాంతం నుండి అరెస్ట్ చేశామని అన్నారు. లోయ ప్రాంతాల్లో దోపిడీ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు అతనిపై ఆరోపణలు వచ్చాయని పోలీసులు తెలిపారు.

ఆపరేషన్ సిందూర్‌పై పోస్టు... న్యాయ విద్యార్థి అరెస్ట్

కోల్‌కతా: ఆపరేషన్ సిందూర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణపై పూనెకు చెందిన శర్మిష్ట పనోలి అనే న్యాయ విద్యార్థిని పోలీసులు అరెస్టు చేశారు. తన సోషల్ మీడియా ఖాతాలో కొన్ని రోజుల క్రితం ఆమె ఓ పోస్టు పెట్టింది. ఓ మతాన్ని టార్గెట్ చేస్తూ వ్యాఖ్యలు చేసింది. ఆ వీడియో వైరల్‌గా మారడంతో తీవ్ర దుమారం చెలరేగింది. తాను తప్పు చేసినట్లు గుర్తించిన శర్మిష్ట వీడియోను వెంటనే డిలీట్ చేసింది. అదేసమయంలో తన ఎక్స్ ఖాతాలో క్షమాపణ పోస్టు పెట్టింది. 'నాకు ఎవర్నీ బాధ పెట్టాలన్న ఉద్దేశం లేదు. ఆ వ్యాఖ్యలు కేవలం నా వ్యక్తిగతం మాత్రమే. నా వ్యాఖ్యలు ఇబ్బంది పెట్టి ఉంటే క్షమించండి' అని పేర్కొంది. అయితే, అప్పటికే పరిస్థితి చెయ్యిదాటి పోయింది. ఆపరేషన్ సిందూర్‌పై ఆమె చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై కోల్కతాలోని ఓ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. కోల్‌కతా పోలీసులు షర్మిష్టను గురుగ్రామ్‌లో అరెస్ట్ చేశారు. శనివారం ఆమెను అలీపోర్ కోర్టులో హాజరుపరిచారు. శర్మిష్ట అరెస్ట్‌పై పోలీసులు మాట్లాడుతూ.. 'శర్మిష్టకు, ఆమె కుటుం బానికి చాలాసార్లు నోటీసులు పంపాం. ఎవరూ పట్టించుకో లేదు. తప్పించుకుని తిరుగుతున్నారు. అందుకే కోర్టు అరెస్ట్ వారెంట్ ఇచ్చింది. శుక్రవారం గురుగ్రామ్‌లో ఆమెను అరెస్ట్ చేశాం' అని తెలిపారు.

ట్రంప్ మాటలకు స్పందనేది?

మోదీకి జైరాం రమేశ్ ప్రశ్న

న్యూదిల్లీ: భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలను తానే తగ్గించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే ప్రకటించుకుంటున్న వేళ... దీనిపై కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీని కొన్ని రోజులుగా ప్రశ్నిస్తోంది. ద్వైపాక్షిక ఒప్పందం ద్వారా మాత్రమే కాల్పుల విరమణ జరిగిందని ప్రధాని ఎందుకు చెప్పలేకపోతున్నారని నిలదీసింది. '21 రోజుల్లో ఇది 11వ సారి. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తగ్గించానంటూ ట్రంప్ పదేపదే ఒకే విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. రెండు అణ్వస్త్ర దేశాల మధ్య ఘర్షణలు తగ్గించడానికి తాము జోక్యం చేసుకున్నామని, వాణిజ్యాన్ని ఒక సాధనంగా వాడామని చెబుతున్నారు. చివరికి కోర్టులోనూ అదే వాదన. కానీ ట్రంప్ ప్రకటనలపై స్నేహితుడు నరేంద్రమోదీ మౌనం వహిస్తున్నారు. ఆయన ఎందుకు మాట్లాడటం లేదు' అని ఎక్స్ వేదికగా కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ శనివారం పోస్టు పెట్టారు. 'భారత్- పాక్ మధ్య కాల్పుల విరమణకు మా యంత్రాంగం మధ్యవర్తిత్వం వహించింది. వాణిజ్యం విషయంలోనూ మేం అండగా ఉన్నాం. ఉద్రిక్తతలకు ముగింపు పలికితేనే వాణిజ్య సంబంధాలు బలోపేతం చేసుకుంటాం. లేకపోతే... ఎటువంటి వాణిజ్యం చేయబోమని స్పష్టంచేశాం. దీంతో ఆ రెండు దేశాలు సానుకూలంగా స్పందించాయి' అని ట్రంప్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

లాలూకు దక్కని ఊరట

న్యూదిల్లీ: ఆర్జేడీ అధినేత, మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్‌కు దిల్లీ హైకోర్టులో చుక్కెదురైంది. ఉద్యోగాలకు భూములు కేసులో సీబీఐ విచారణ నిలుపుదల కోరుతూ ఆయన వేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. ఇప్పటికే ఈ అంశం ప్రత్యేక న్యాయమూర్తి ముందు వాదనలకు సిద్ధంగా ఉందని, ఈ తరుణంలో స్టే కుదరదని స్పష్టం చేసింది.

మూడు వేలకు చేరువలో కరోనా కేసులు

న్యూదిల్లీ: దేశంలో మళ్లీ కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. దేశంలో మొత్తం 2,710 యాక్టివ్ కేసులు నమోదైనట్లు ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. గత వారం రోజులుగా కేరళ, మహారాష్ట్ర, దిల్లీ, గుజరాత్, తమిళనాడు, కర్నాటక వంటి రాష్ట్రాల్లో కొత్త కేసులు నమోదవుతున్నట్లు పేర్కొన్నారు. కేరళలో అత్యధిక కేసులు వస్తున్నట్లు తెలిపారు. మహారాష్ట్ర, దిల్లీ తరువాత స్థానంలో ఉన్నాయి. నాలుగు రోజుల్లోనే కేసులు వేగంగా పెరిగినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. దేశంలో మే 26న మొత్తం 1,010 కేసులు నమోదవగా... మే 30 నాటికి మొత్తం 2,710కు పెరిగినట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ శనివారం వెల్లడించింది. కరోనా కొత్త వేరియంట్లపై భయాందోళనలు అవసరం లేదని, ఇన్ఫెక్షన్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. డేటాబోర్డులో వెల్లడించిన సమాచారం ప్రకారం దేశవ్యాప్తంగా క్రియాశీల కేసుల సంఖ్య 2,710గా ఉండగా, కేరళలో అత్యధికంగా 1,147 కేసులు నమోదయ్యాయి. మహారాష్ట్రలో 424, దిల్లీలో 294, గుజరాత్‌లో 223, తమిళనాడులో 148, కర్నాటకలో 148, పశ్చిమబెంగాల్‌లో 116, రాజస్థాన్‌లో 51 కేసులు, ఉత్తరప్రదేశ్‌లో 42, పుదుచ్చేరిలో 25, హర్యానాలో 20, ఆంధ్రప్రదేశ్‌లో 16, మధ్యప్రదేశ్‌లో 10, గోవాలో 7, ఒడిశా, పంజాబ్, జమ్మూకశ్మీర్‌లో నాలుగు చొప్పున కేసులు నమోదయ్యాయి. తెలంగాణ, అరుణాచల్ ప్రదేశ్, చండీగఢ్ రాష్ట్రాలలో మూడు కేసుల వంతున నమోదవగా... మిజోరం, అసోంలో చెరో ఇద్దరు ఈ ఇన్ఫెక్షన్ బారిన పడినట్లు తెలుస్తోంది.

విశాలాంధ్ర హైదరాబాద్

అరుదైన చికిత్సలతో రోగికి పునర్జన్మనిచ్చిన ప్రతిమ ఆసుపత్రి

విశాలాంధ్ర - హైదరాబాద్ : కాచిగూడ, ప్రతిమ ఆసుపత్రికి నిరాశాజనకమైన పరిస్థితిలో వచ్చిన మంచిర్యాలకు చెందిన 43 ఏళ్ళ దినేష్ అనే రోగికి అరుదైన చికిత్సలతో వైద్యులు పునర్జన్మనిచ్చారు. ఇతను నెక్రోటైజింగ్ ప్యాంక్రియాటైటిస్, సెప్టిసిమియా, బహుళ అవయవ వైఫల్యం, మూత్రపిండ, గుండె వైఫల్యం, హెపాటిక్, ఏ.ఆర్.డి.ఎస్, టాక్సిక్, మెటబాలిక్ ఎన్సెఫలోపతి, ఆల్కహాలిక్, అన్ కంట్రోల్డ్ డయాబెటిస్, ఫిమోసిస్‌తో బాధపడుతున్నట్లు నిర్ధారించి, ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ ఫిజిషియన్, డయాబెటాలజిస్ట్, లిపిడాలజిస్ట్, హెచ్ఓడి డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెడిసిన్, అకాడెమిక్స్, మెడికల్ సర్వీసెస్ డాక్టర్ హరిచరణ్ నేతృత్వంలో ఆసుపత్రి బృందం సకాలంలో స్పందించడం, వైద్య నిర్వహణకు సంబంధించి నిపుణుల నిర్ణయంతో, రోగికి సమర్థవంతంగా చికిత్స చేసి హెమోడైనమిక్‌గా స్థిరమైన స్థితితో డిశ్చార్జ్ చేసారు. ప్రతిమ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ హరిణి రావు పూర్తి సహకారంతో డాక్టర్ సుప్రియ సమన్వయంతో, క్రిటికల్ కేర్ బృందం, డాక్టర్ రేచల్ కార్డియాలజిస్ట్, డాక్టర్ సాయి దేదీప్య పల్మోనాలజిస్ట్, నర్సింగ్ సిబ్బంది అవిశ్రాంతంగా కృషి చేసి రోగి దినేష్ కు పునర్జన్మనిచ్చారు. ఈ సందర్భంగా రోగి దినేష్ అయన కుటుంబ సభ్యులు డాక్టర్ హరిచరణ్‌కు, ప్రతిమ ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

మౌలాలీలో యుపిహెచ్‌సిలో టిబి స్క్రీనింగ్ టెస్ట్‌లు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : యు.పీ.హెచ్.సి. మౌలాలిలో టీ.బీ స్క్రీనింగ్ టెస్ట్‌లను శనివారం దాదాపు 102 మందికి శనివారం నిర్వహించారు. ఏ.ఐ ఎక్స్‌రే యంత్రంతో ఈ స్క్రీనింగ్ టెస్ట్‌లను నిర్వహించడం జరిగింది. ఇందులో 16 మంది 60 సంవత్సరాల పైబడిన వారు మధుమేహం, బిపి ఉన్నవారు గతంలో టీ.బి.ఉన్నా వారికి ప్రధానమంత్రి టీబి ముక్త్ భారత్ అభినాయ్ ప్రోగ్రాంలో భాగంగా ఈ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిబి ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ వెంకటేష్, ఎస్.టి.ఎస్. బి.రామోజీ, రామ్‌చందర్, గిరి, హేమలత, మౌలాలి యు.పి.హెచ్.సి. సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టలో మైనంపల్లి హన్మంతరావు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని ఓల్డ్ మల్కాజ్గిరి ఆంజనేయ స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వై ప్రేమ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, ఆంజనేయ స్వామి దేవాలయం డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు చింతల మల్లేష్ గౌడ్, మండల రాధా కృష్ణ యాదవ్, రంగ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శి యాదయ్యగౌడ్‌కు పరామర్శ



విశాలాంధ్ర - మల్కాజిగిరి : గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై డాక్టర్ సలహా మేరకు ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మల్కాజిగిరి మండల సిపిఐ కార్యదర్శి టి.యాదయ్య గౌడ్ ను శనివారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.యస్.బోస్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి కాసర్ల నాగరాజు, ఏఐటీయూసీ నాయకులు ఎస్.కె.అజీజ్, ఆర్.వెంకటేష్ పరామర్శించి ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని ఉమార్ ఖాన్ గూడలో శ్రీ అభయ ఆంజనేయస్వామి విగ్రహ ఆవిష్కరణ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమనికి రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రజలు అందరూ సుఖసంతోషాలతో వుండాలని అన్నారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కరాడి శ్రీలత అనిల్ కుమార్, తుర్కయంజాల్ మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ హరిత ధనరాజ్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ మల్‌రెడ్డి యాదిరెడ్డి, స్థానిక మాజీ సర్పంచ్ కందాల రంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ ప్రమీల కృష్ణారెడ్డి, మాజీ వార్డు బండారి వెంకటేష్, కావాడపు శివారెడ్డి, నల్ల బలవంత్ రెడ్డి, సామ ధన్ పాల్ రెడ్డి, బండారు రమేష్, నల్ల నరసింహారెడ్డి, గుండ్ల రంగయ్య గౌడ్, గజ్జలధాన్ రెడ్డి, నల్ల ప్రభాకర్ రెడ్డి, సామ శ్రీనివాస్ రెడ్డి, బండారు దానయ్య, నల్ల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ నగరవాసుల తాగునీటి సమస్య పరిష్కారం కోసం కృష్ణ గోదావరి నుండి 15 టిఎంసిల నీరు అందించినందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం జిహెచ్ఎంసి కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశం మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో హైదరాబాద్ జిల్లా అభివృద్ధికి చేపట్టవలసిన చర్యలపై చర్చించారు. రాజీ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్లు, సివిల్ సప్లై, వైద్య ఆరోగ్యం, ఎలక్ట్రిసిటీ, విద్య తదితర అంశాలపై చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాస పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి కేటగిరీల వారీగా రుణాలు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ జిల్లాలో 41,726 మంది నిరుద్యోగ యువతకు రుణాలు అందించాలని లక్ష్యం కాగా 1,25, 595 మంది నిరుద్యోగ యువకులు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో రాజీవ్ యువశక్తి పథకానికి రూ.6230.52 కోట్లు కేటాయించిందని అన్నారు. హైదరాబాద్ మహానగరంలో జన సాంద్రత పెరుగుతున్న నేపథ్యంలో అన్ని నియోజక వర్గాల్లో అభివృద్ధి సంక్షేమ పథకాలు అలాగే నీటి నిల్వలు, ప్రజల అవసరాల మేరకు మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. సన్న బియ్యం పథకం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉగాది పండుగ రోజున సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించుకోవడం జరిగిందని హైదరాబాద్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున ఏప్రిల్ మాసంలో అందించలేకపోయామని మే మాసం నుండి 653 రేషన్ షాపుల ద్వారా ప్రతి నెల 14500 మెట్రిక్ టన్నుల బియ్యం అందిస్తున్నామని అన్నారు. వర్షాకాలం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో మూడు నెలలకు గాను 42,619 మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని కేటాయించడం జరిగిందని అందులోనుండి ఇప్పటివరకు 8440 మెట్రిక్ టన్నుల బియ్యన్ని రేషన్ షాపులకు అందించడం జరిగిందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. రేషన్ కార్డుల సర్వే ప్రక్రియ చేపట్టామని త్వరలో అర్హులైన ప్రతి ఒక్కరికి నూతన రేషన్ కార్డులో అందించడం జరుగుతుందని తెలిపారు. నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 3500 డబ్బులు బెడ్ రూమ్ ఇండ్లను మంజూరు చేసేందుకు నిర్ణయించడం జరిగిందని అన్నారు. హైదరాబాద్ జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు చొప్పున అందించనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే కట్టిన 62500 పైగా ఉన్న రెండు పడకల గదుల ఇండ్లను ప్రభుత్వంతో చర్చించి ఈనెల 15 వరకు పేదలకు పంపిణీ చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. జూన్ 12 వరకు స్కూల్ యూనిఫామ్‌లతో పాటు పాఠ్యపుస్తకాలు, టెస్ట్‌బుక్స్ అందించడం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. వర్షాకాలం నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాను వర్షపు నీటి ద్వారా భూగర్భ జలాలు పెంచే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని ఆ దిశలో భాగంగా ప్రతి 300 గజాల ఇంటి స్థలం ఉన్నవారు ఇప్పుడు గుంతలు చేపట్టే విధంగా జిహెచ్ఎంసి అధికారులు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. అదేవిధంగా వర్షాకాలం నేపథ్యంలో 150 ప్రత్యేక బృందాలను ఏర్పాటుతో పాటు నిరంతర పర్యవేక్షణ అలాగే పటిష్ట చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. జిల్లాలో 141 వాటర్ లాగిన్ పాయింట్స్ గుర్తించడం జరిగిందని అందులో 76 వాటర్ లాగింగ్ పనులు పూర్తి చేయడం జరిగిందనిఅన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జిల్లాలోని 169 బస్తీ దవఖానాలలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచడం జరిగిందని బస్తీ దవఖానాలో ఇతర వ్యాధుల చికిత్స లకై సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తెలిపారు. హైదరాబాద్లో వర్షపు నీటి తొలగింపుకు శాశ్వత పరిష్కారం కల్పించడం జరుగుతుందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు శాసనమండలి సభ్యులు లేవనెత్తిన అనేక అంశాలపై అంశాల వారీగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలో పరిష్కరించనున్నట్లు మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. వర్షాకాలం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టనున్నట్లు చెట్లు ప్రగతికి మెట్లు కాబట్టి చేసిన ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్, హెచ్ఎండిఏ కమిషనర్ అశోక్ రెడ్డి,హైడ్రా కమిషనర్ రంగనాథ్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జూన్ 3 నుండి జరిగే

గ్రామ రెవెన్యూ సదస్సులపై అవగాహన కార్యక్రమం

అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి: జిల్లాలో జూన్ 3 నుండి జరిగే గ్రామ రెవెన్యూ సదస్సులపై డిఆర్‌ఓలతో కలిసి అదనపు కలెక్టరు విజయేందర్‌రెడ్డి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి రెవెన్యూ అధికారులకు, సిబ్బందికి అవసరమైన సలహాలను సూచనలను అందించారు. శనివారం నిర్వహించిన ఈ సమావేశంలో అదనపు కలెక్టరు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు ఏవిధంగా నిర్వహించాలనే ప్రక్రియను వివరంగా తెలియజేసారు. రెవెన్యూ సదస్సు నిర్వహించే గ్రామంలో ఒకరోజు ముందుగానే గ్రామ ప్రజలకు తెలియజేయాలని, వారి అర్జీలతో పాటు సంబంధిత డాక్యుమెంట్ల కాపీలను అందుబాటులో ఉంచుకునేలా తెలపాలని సూచించారు. ఏ విధమైన అర్జీ అనే అంశాన్ని అర్జీల ఫారంలలో నిర్దేశిత కాలమ్‌లలో తప్పనిసరిగా కోడ్ చేయాలన్నారు. కేటగిరిల వారిగా అంశాలను పరిశీలించి అర్జీలను వెంట వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ల్యాప్‌టాప్‌లు, స్టేషనరీ, ప్రింటర్లను, త్రాగునీటిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సులకు సరిపడా సిబ్బందిని కేటాయించాలన్నారు. అర్జీలలో సర్వే నంబర్లను, భూ విస్తీర్ణం, ఏ విధంగా సంక్రమించింది అనే భూ వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. అర్జీలను ముందుగా ధరణీలో ఉన్నదా లేదా అనే అంశాన్ని ముందుగా పరిశీలించాలన్నారు. అర్జీలకు అవసరమైన రసీదులను దరఖాస్తుదారులకు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. అవసరమైన మేరకు నోటీసులు జారీ చేయాలని, క్షేత్రస్థాయి పరిశీలనలు చేయాలని సూచించారు. ప్రతిరోజు సాయంత్రం సదస్సులో వచ్చిన దరఖాస్తులపై నివేదిక తప్పనిసరిగా అందించాలన్నారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను కూడా గుర్తించి వాటిని ప్రభుత్వ పరమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణలో ఏవైన సందేహాలుంటే ఆర్డిఓలను సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డిఓలు ఉపేందర్ రెడ్డి, శ్యాంప్రకాష్, తహాసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవానికి హాజరుకానున్న ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : జూన్ 2న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవానికి తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో జరిగే వేడుకలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, ఉపన్యసించి, అవార్డులు సైతం ప్రధానం చేస్తారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో జరిగే వేడుకలకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన ప్రజలు, రాజకీయ నాయకులు, సీనియర్ సిటిజన్స్ అందరు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు.

డ్రైనేజీ మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలి: కమిషనర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : మలక్ పేట్ డ్రైనేజీ లీకేజీ మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని జిహెచ్ఎంసి కమీషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. శనివారం హైడ్రా కమీషనర్ రంగనాథ్‌తో కలిసి ఆయన మలక్ పేట్ ఆర్.యు.బి వద్ద డ్రైనేజీ లీకేజిని పరిశీలించారు. గత రాత్రి నుండి లీకేజీ కావడంతో వరద నీరు నిలువ కుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. వెంటనే మరమ్మత్తులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అంతకు ముందు కమీషనర్ కూకట్ పల్లి జోనల్ కమీషనర్‌తో కలిసి కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో పలు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఫాక్స్ నగర్ చెరువును పరిశీలించారు. జాతీయ రహదారి 44 నుండి చింతల్ వరకు చేపట్టే రోడ్డు వెడల్పు ప్లాన్‌ను పరిశీలించారు. పైప్‌లైన్ రోడ్డులో స్టీల్ బ్రిడ్జి నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ఫాక్స్ సాగర్ చెరువు నుండి కెమికల్ నాలా వరకు చేపట్టిన మురుగునీరు మళ్లింపు, పైప్ లైన్ పొడిగింపు పనులను పరిశీలన చేశారు. డ్రైనేజ్ డైవర్షన్ పొడిగింపు పైప్‌లైన్ పనులు, రోడ్డు వెడల్పు పనులను చేపట్టేందుకు కావలిసిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కమీషనర్ వెంట జోనల్ కమీషనర్ అపూర్వ్ చౌహాన్, ఎస్.ఎన్.డి.పి సిఈ కోటేశ్వరరావు, జోనల్ ఎస్ఈ చిన్నారెడ్డి, లేక్స్ ఈఈ నారాయణ, డిసి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ ప్రయోజనాలను విడుదల చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిహెచ్ఎంసిలో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ విరమణ చేసిన వారి ప్రయోజనాలను తక్షణమే విడుదల చేయాలనీ జిహెచ్ఎంసి మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ డిమాండ్ చేసారు. హైదరాబాద్, జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో శనివారం ఐ.ఎన్.టి.యు.సి అనుబంధ మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ నేతృత్వంలో ఉద్యోగ విరమణ చేసి ప్రయోజనాలు పొందని జిహెచ్ఎంసి రిటైర్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ప్లకార్డులు పట్టుకుని ధర్నా నిర్వహించి, జిహెచ్ఎంసి అధికారులు సమస్యల పరిష్కరానికి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ కార్పొరేషన్‌కు చాలా సంవత్సరాలుగా సేవలందిస్తున్నప్పటికీ ఉద్యోగుల పెన్షన్ మరియు ఇతర పదవీ విరమణ తర్వాత ప్రయోజనాలను సకాలంలో చెల్లించకపోవడం దారుణం అని వాపోయారు.

అధికారుల జాప్యం వల్ల పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులపై ఆందోళన వ్యక్తం చేస్తూ, వీరిలో చాలా మంది తాము కష్టపడి సంపాదించిన ప్రయోజనాలను పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. జిహెచ్ఎంసి ఉద్యోగులకు పదోన్నతులు, వైద్యపరమైన కారణాల వల్ల బదిలీ, సుదూర ప్రాంతాలకు బదిలీ, హెల్త్ కార్డు, శానిటరీ జవాన్ల బదిలీ, శానిటరీ జవాన్లకు ఎఫ్.ఆర్.ఎస్ హాజరు వంటి ప్రధాన సమస్యలు తెలంగాణ ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని పరిష్కరించాలని డిమాండ్ చేసారు. అనంతరం జిహెచ్ఎంసి కమీషనర్ ను కలసి వినతిపత్రం అందజేసి ఉద్యోగ విరమణ ప్రయోజనాలను తక్షణమే చెల్లించడంతో పాటు, ఉద్యోగులు ఎదుర్కుంటున్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని ఆదిల్ షరీఫ్ విజ్ఞప్తి చేసారు. ఈ ధర్నాలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏవిఎస్. గాంధీ, అదనపు ప్రధాన కార్యదర్శి కె. శివ కుమార్, మహిళా కమిటీ ఛైర్ పర్సన్ ఎల్. మెర్సీ, జోనల్ అధ్యక్షులు వై.యాదగిరి, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ - జాగృత్తి కేసీఆర్‌కు రెండు కళ్లు

విశాలాంధ్ర. - హైదరాబాద్ : బీఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ ఒక కన్ను అయితే జాగృతి మరో కన్ను అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌పై ఈగ వాలినా కూడా ఊరుకోమని అమె హెచ్చరించారు. శనివారం తెలంగాణ జాగృతి నూతన కార్యాలయంలో ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడారు. కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ జూన్ 4న దీక్ష చేయనున్నట్లు కవిత ప్రకటించారు. తెలంగాణ సోయితో కేసీఆర్ పరిపాలన చేశారని కాని సీఎం రేవంత్ రెడ్డి కనీసం జై తెలంగాణ అనకపోవడం మన ఖర్మ అంటూ వ్యాఖ్యానించారు. కనీసం ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి జై తెలంగాణ అనాలని, అమరులకు నివాళులర్పించాలని డిమాండ్ చేశారు. జై తెలంగాణ అనని వారికి, అమరవీరులకు నివాళులులర్పించని వారికి సీఎం కుర్చిలో కూర్చొనే అర్హత లేదన్నారు. తెలంగాణ గ్రహచారం బాగలేక తెలంగాణకు రేవంత్ రెడ్డి సీఎం అయ్యారని, రాజీవ్ యువ వికాసం పేరు మార్చాలన్నారు. అసలు తెలంగాణకు రాజీవ్ గాంధీకి ఏం సంబంధమని అమె నిలదీశారు. అమరులు శ్రీకాంత చారి లేదా యాది రెడ్డి లేదా కాళోజి లేదా పీవీ నరసింహా రావు పేరు పెడితే తాము కూడా స్వాగతిస్తామన్నారు. తెలంగాణ నీళ్లను ఏపీ తరలించుకుపోతుంటే సీఎం రేవంత్ రెడ్డి మాట్లాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టును నిర్మించి నీళ్ల తరలించాలను కుంటున్నా సీఎం కనీసం స్పందించకపోవడం శోచనీయమన్నారు. అసలు ఎందుకు సీఎం అంత బలహీనంగా ఉన్నారో అర్థం కావడం లేదని, పక్క రాష్ట్రాల ప్రయోజనాల కోసం ఎందుకు పనిచేస్తున్నారని నిలదీశారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు నదుల అనుసంధానాన్ని తొపాకులగూడెం నుంచి చేపట్టాలని ప్రతిపాదించారని గుర్తు చేశారు. కానీ ఆనాడు కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోకుండా ఇచ్చంపల్లి నుంచి చేపడుతామని చెప్పిందని, పోలవరం నుంచి 200 టీఎంసీలను గోదావరి నీళ్లను తరలించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. గోదావరి నీళ్లను తెలంగాణకు శాశ్వతంగా దూరంకానున్నాయని, జూన్ 2 నాడు సీఎం రేవంత్ రెడ్డి ఈ అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సీఎం కేంద్రాన్ని డిమాండ్ చేయాలని, 200 టీఎంసీల హక్కు తెలంగాణకు ఉండాలని కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారని ఈ సందర్భంగా వెల్లడిరచారు. ప్రతీ ఏడాది 20 లక్షల ఎకరాలకు కాళేశ్వరం ద్వారా నీళ్లు అందించినందుకు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారా లేదా కోటి ఎకరాల మాగాణం చేసిందుకు కేసీఆర్ కు నోటీసులు ఇచ్చారా అని ప్రశ్నించారు. రైతులను రైతు బీమా, రైతు బంధు పథకాలను ప్రవేశపెట్టినందుకు నోటీసులు ఇచ్చారా లేక తెలంగాణ ప్రజలకు మేలు చేసినందుకు నోటీసులు ఇచ్చారా అని నిలదీశారు.

టిజిపిసిబి జాయింట్ చీఫ్ ఎన్విరాన్మెంటల్ సైంటిస్ట్ సత్యనారాయణరావు పదవీ విరమణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టిజిపిసిబి) జాయింట్ చీఫ్ ఎన్విరాన్మెంటల్ సైంటిస్ట్ డాక్టర్ ఎం సత్యనారాయణ రావు శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పీసీబీ లో ఏర్పటు చేసిన కార్యక్రమలో సభ్య కార్యదర్శి మాట్లాడు సత్య నారాయణ రావు చేసిన సేవలను కొనియాడారు. ఆయన రిటైర్మెంట్ జీవితం సంతోషంగా మరియు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. సంస్థకు ఆయన 36 సంవత్సరాలు అంకితభావంతో చేసిన సేవలను ప్రశంసించారు. సత్యనారాయణ లాగ ప్రతి ఒక్కరు అంకిత భావంతో పని చేయాలని సూచించారు.తనకు సహకరించినందుకు అధికారులు మరియు సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. టిజిపిసిబి అధికారులు మరియు సహచరులు ఆయన పదవీకాలంలో తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. సిబ్బంది, అధికారులు శాలువా మరియు జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ బి. రఘు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు సహకరించాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కొరకు ఈరోజు గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి జోనల్ కమిషనర్ హేమంత్ భోర్కడేని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం జోనల్ కమిషనర్ హేమంత్ భోర్కడేతో సమావేశమై గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నానక్ రామ్ గుడా, నేతాజీనగర్, రాయదుర్గం, నల్లగండ్ల హుడా కాలనీలలో సీసీ రోడ్లు దెబ్బతినడం వల్ల చిన్న పాటి వర్షానికి గుంతలలో నీరు నిలిచి స్థానిక ప్రజలు రాకపోకలకు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని తక్షణమే నూతన రోడ్లు వేయించాలని అలాగే గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని జనాభా దృశ్య రోడ్డు వెడల్పు కూడా చేయవలసిన అవసరం ఉందని కార్పొరేటర్ జోనల్ కమిషనర్ని కోరారు. దీనికి జోనల్ కమిషనర్ హేమంత్ భోర్కడే సానుకూలంగా స్పందించి ప్రస్తావించిన పనులపై తక్షణమే అంచనా వేసి తగిన నిధుల మంజూరు కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విత్తనాల పంపిణీకి ప్రణాళిక సిద్ధం

విశాలాంధ్ర - హైదరాబాద్ : వానాకాలం 2025 కి గాను పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసి, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ, నేషనల్ సీడ్ కార్పొరేషన్ విత్తనాల ద్వారా పంపిణీ చేయడానికి వ్యవసాయశాఖ ఒప్పందం చేసుకుంది. ఇప్పటివరకు 89,302.10 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను ఆగ్రో రైతు సేవ కేంద్రాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా పంపిణీకి సిద్ధం చేయగా, ఇప్పటివరకు 1,17,912 మంది రైతులు 56,262.10 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను కొనుగోలు చేయడం జరిగింది. ఐతే నేషనల్ సీడ్ కార్పొరేషన్ తమకు కేటాయించిన జీలుగ విత్తనాల ఇండెట్‌కు బదులు ఇతర రాష్ట్రాలలో పంపిణీ చేస్తున్న 5 రకాల విత్తనాలు గల 5కేజీల కిట్లను సరఫరా చేయడానికి ముందుకు రాగా, రాష్ట్ర వ్యవసాయ మంత్రి ఆదేశాల మేరకు, రైతులకు ఎక్కడా అసౌకర్యం జరగకుండా వాటిని కూడా తెప్పించి అందుబాటులో ఉంచడం జరుగుతుంది. ఇప్పటికే నేషనల్ సీడ్ కార్పొరేషన్ 750 ఎన్. ఎస్.సి కిట్లను పంపిణీ చేసింది. ఈ కిట్ ధర 635 రూపాయలుగా నిర్ణయించగా ఇది ఒక ఎకరానికి రెండు కిట్లు వాడితే సరిపోతుందని సూచించారు. ఇంకా 5000 కిట్లను పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉందని, ప్రతి సంచిలో ఒక కిలో జీలుగ, ఒక కిలో జనుము, ఒక కిలో మొక్కజొన్న, 0.5 కిలో జొన్న, 0.5 కిలోబొబ్బర్లు, ఒక కిలో గోరుచిక్కుడు విత్తనాలు ఉంటా యన్నారు. ఈ కిట్లో ఉన్న ఐదు రకాల విత్తనాలు పచ్చిరొట్టగావాడటం వలన భూసారం పెరగడంతో పాటు కలుపు నివారణ, భూమిలో నీటి నిలుపుదల సామర్థ్యం పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు.

అనంతగిరిలో పురాతన జైన గుహలను కాపాడుకోవాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : వికారాబాద్ జిల్లాలోని అనంతగిరిలో 9వ శతాబ్దానికి చెందిన 15 జైన గుహల సముదాయాలను కాపాడుకోవాలని ఆ గుహలను శనివారం సందర్శించిన ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సి.ఈ.ఓ., పురావస్తు పరిశోధకులు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి చెప్పారు. చదరం దీర్ఘచదరంగా ఉన్న గుహలు 2.0 నుండి 6.0 మీ. పొడవు, 2.0 నుండి 3.0 మీటర్ల వెడల్పు 2.5 మీటర్ల ఎత్తు కలిగి తూర్పు వైపు ద్వారంతో నేలపై రాతిపడకలు కలిగి ఉన్నాయని అన్నారు. వర్షాకాలంలో జైన మునులు ఈ గుహలలో నివసించే వారని, రాతిపడకలపై మరణించేంత వరకు ఆహారం తీసుకోకుండా సల్లేఖన వ్రతాన్ని ఆచరించేవారని, ఒక గుహలో పద్మాసనంలో ఉన్న జైన తీర్థంకరుని విగ్రహం వల్ల ఈ గుహలు క్రీ.శ. 9వ శతాబ్ది (రాష్ట్రకూటుల) కాలానికి చెందినవని తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత కల 1100 సం. నాటి జైన గుహలను కాపాడాలని, ఆలయ, వికారాబాద్ పురపాలక సంఘ అధికారులకు శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆలయ చైర్మన్ డా. పద్మనాభం వాటిని కాపాడటానికి సహకారం అందిస్తున్నారని, వారసత్వ కార్యకర్తలు డిఆర్ శ్యాంసుందర్‌రావు, బి.వెంకటరెడ్డి, బి.సాయి కిరణ్ రెడ్డి, ఎల్లయ్య పాల్గొన్నారని డాక్టర్ రెడ్డి చెప్పారు.

ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి



విశాలాంధ్ర- బషీర్ బాగ్: ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యమ కారుల సంఘాలు గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర కోసం అమరులైన కుటుంబాలను ఆదుకోవాలని, ఎన్నికల సందర్భంలో మేనిఫెస్టోలో పెట్టిన హామీలను వెంటనే అమలు చేయాలని, తెలంగాణ ఉద్యమంలో పోరాటం చేసిన కుటుంబాలకు 250 గజాల ఇళ్ల స్థలంను 30 వేల రూపాయల గౌరవ వేతనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాల్గొన్న ఎంఎల్‌సి ప్రొ:కోదండరాం మాట్లాడుతు తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్స్ ప్రభుత్వం దృష్టికి తీసుక వెళ్లడం జరిగిందని, త్వరలోనే సానుకూల ప్రకటన వెలువడు తుందని ఆశాభావం వ్యక్తం చేసారు. తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ సెక్రటరీ జనరల్ ప్రఫుల్ రాంరెడ్డి, తెలంగాణా అకాంక్షల వేదిక కన్వీనర్ కుమారస్వామి, రామగిరి ప్రకాష్, చంద్రన్న ప్రసాద్, అంజిరెడ్డి, పెద్ద యాదగిరి, నగేష్, ధనలక్ష్మి, అంజలి, సుజి స్వరూప రాణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేంజి చేతి పరికరాలను ఆవిష్కరించిన బాష్ పవర్ టూల్స్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ టెక్నాలజీ, సేవల సరఫరా సంస్థల్లో ఒకటైన బోష్ లిమిటెడ్... తాజాగా వృత్తి నిపుణులు, మేస్త్రీలు, ఇళ్ల వినియోగదారుల కోసం సరికొత్త చేతి పరికరాలను విడుదల చేసింది. ఈ కొత్త పరికరాలను డీఐవై వినియోగదారులు, కళాకారులు, వాణిజ్య నిపుణులు, ఎలక్ట్రీషియన్ల అవసరాల కోసం చాలా ఆలోచనాత్మకంగా డిజైన్ చేశారు. వీటిలో ఎర్గోనామిక్ గ్రీన్ రేంజ్, ప్రొఫెషనల్ బ్లూ రేంజ్, వెయ్యి వోల్టుల వరకు విద్యుత్ భద్రత కోసం రూపొందించిన ప్రత్యేక వీడీఈ-ప్రామాణిక సాధనాలు ఉన్నాయి. ఈ సందర్భంగా బాష్ ఇండియా పవర్ టూల్స్ డివిజన్ ఇండియా, సార్క్ ప్రాంతీయ ప్రెసిడెంట్ నిషాంత్ సిన్హా మాట్లాడుతూ, "వృత్తి నిపుణులు, మేస్త్రీలు, అందరికీ అసాధారణ పనితీరు, మన్నిక, భద్రతతో కూడిన పరికరాలు అందించేందుకు బాష్ సంస్థ కట్టుబడి ఉంది. మా చేతి పరికరాల రేంజిని మేం మరింతగా విస్తరిస్తున్నాం. ఇవన్నీ కూడా అధిక వోల్టేజి ఉన్న పరిస్థితుల్లోను, హెవీ డ్యూటీ అవసరాలకు కూడా పనికొస్తాయి. ఇవన్నీ దీర్ఘకాలం పాటు పనిచేస్తాయి.

ప్రతి ఉద్యోగికి తమ సేవలతోనే గుర్తింపు : కమిషనర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రతి ఉద్యోగికి తాము అందించిన సేవలతోనే గుర్తింపు లభిస్తుం దని జీహెచ్‌ఎంసీ కమీషనర్ ఆర్.వి.కర్ణన్ అన్నారు. జిహెచ్ఎంసి పరిధిలో వివిధ కేటగిరీలలో పనిచేసిన 21 మంది ఉద్యోగులకు ఉద్యోగ వయోపరిమితి పూర్తయిన నేపథ్యంలో జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో శనివారం పదవీ విరమణ వీడ్కోలు సభను నిర్వహించి, వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సర్వీస్ పెన్షనరీ బెన్ ఫిట్స్ పత్రాలు కమీషనర్ అందజేశారు. ఈ సందర్భంగా కమీషనర్ ఆర్.వి.కర్ణన్ మాట్లాడుతూ పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులందరూ తమ ఉద్యోగ జీవితంలో ఎంతో నిబద్ధత, అంకిత భావంతో సేవలందించారన్నారు. వారి కృషి, అందించిన సేవలు తమ సహచర ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. రిటైర్మెంట్ అన్నది జీవితంలో కొత్త అధ్యాయం లాంటిదని, రిటైర్మెంట్ పొందిన వారు వారి కుటుంబ సభ్యులతో సమయం గడుపుతూ, తమ ఆసక్తులకు ప్రాధాన్యం ఇస్తూ ఆరోగ్యంతో, ఆనందంగా గడపాలని ఆయన సూచించారు. వారి ముస్ముందు జీవితం ఆయురా రోగ్యాలతో ఆనందంగా గడపాలని కమీషనర్ కోరారు. అసిస్టెంట్ మున్సిపల్ కమీషనర్లు జె.శ్రీని వాసరావు, ఎం.సాయి శ్రీనివాస్, డి.నర్సింహా రెడ్డి, డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎస్.లలిత కుమారి, సీనియర్ అసిస్టెంట్‌లు కె.వి.సువర్ణ, టీ.కృష్ణమూర్తి, సీనియర్ ఆడిటర్ జి.నాని బాబు, ట్యాక్స్ ఇన్ స్పెక్టర్ నాగరాజు, జూనియర్ అసిస్టెంట్ బి.కృష్ణారావు, టెక్నికల్ ఇన్ స్పెక్టర్ బి.లక్ష్మీనారాయణ, డ్రైవర్లు బి.కృష్ణ, ఎ.శంకర్, ఫీల్డ్ వర్కర్ బి.విశ్వనాథ్, మైస్త్రీ మారగోని రాములు, శానిటరీ జవాన్ ఎం.రమేష్, స్వీపర్ పి.బాలమణి, కామాటీ లు డి.పున్నయ్య, దేవేందర్, బి.యాదయ్య, మజ్దూర్ ఎస్.ముత్యాలు, మాలి వెంకటేష్ లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమీషనర్లు రఘు ప్రసాద్, వేణుగోపాల్, అడ్మిన్ జాయింట్ కమీషనర్ శ్రీనివాస్, జాయింట్ కమీషనర్ మహేష్ కులకర్ణి, సి.పి.ఆర్.ఓ మహమ్మద్ ముర్తుజా, ఏ.ఎం.సి లు జీవన్ కుమార్, శారద, సహ ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం ర్యాలీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: పొగాకు ఉత్పత్తులు సేవించడం వల్ల కలిగే అనారోగ్య కారణాలను ప్రజలకు తెలియచేసే లక్ష్యంతో ప్రతి ఏటా మే 31 వ తేదీన ప్రపంచ పొగాకు వ్యతిరేఖ దినోత్సవం సందర్భంగా ప్రజాపిత బ్రహ్మకుమారిస్ ఐశ్వర్య విశ్వ విద్యాలయం వారి ఆధ్వర్యంలో జరిగిన అవగహన ర్యాలీలో కూకట్‌పల్లి డీసీ గంగాధర్‌తో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పాల్గొని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యం అని, పొగాకు ఉత్పత్తులు సేవించడం వల్ల కలిగే అనారోగ్య కారణాలను ప్రజలకు తెలియచేసే లక్ష్యంతో ప్రతి ఏటా మే 31 వ తేదీన ప్రపంచ పొగాకు వ్యతిరేఖ దినోత్సవం నిర్వహించడం జరుగుతుంది అని తెలియచేసారు. సిగరెట్లు, చుట్టలు, బీడీలు, గుట్కా, ఖైనీ, జర్దా మొదలైనవి పొగాకు ఉత్పత్తుల కిందికి వస్తాయి అని, ఇందులో ఉండే నికోటిన్ వదల్లేని అలవాటుగా మారి మానవులను వ్యసన పరులను చేస్తుంది అని, ధూమపానం ప్రభావం ఊపిరితిత్తులపై నేరుగా పడుతుందని తెలియచేసారు. పొగాకు వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని, యువకులలో విస్తృతంగా అవగాహన కల్పించాలని గాంధీ తెలియచేసారు. నాయకులు మంత్రి ప్రగధ సత్యనారాయణరావు, బ్రహ్మా కుమారిస్ సభ్యులు పాల్గొన్నారు.

పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ముద్రించిన పొగాకు, పొగాకు ఉత్పత్తుల వినియోగం వలన వచ్చే ఆరోగ్య సమస్యలతో పాటు జరిగే అనర్థాలను తెలియజేసే గోడ పత్రిక (స్టిక్కర్)ను ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సి.హెచ్. వై శ్రీనివాస కుమార్ (ఏసీపీ మియాపూర్), గోడ పత్రికను ఆవిష్కరించి తదనంతరం మాట్లాడుతూ 31మే 1988 నుండి ప్రపంచ ఆరోగ్య సంస్థవారు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఒక నినాదంతో నిర్వహించుచున్నారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం పొగాకు, పొగాకు ఉత్పత్తుల వలన ప్రజలకు, ప్రజారోగ్యానికి, సమాజానికి, పర్యావరణానికి కలిగే హాని గురించి అవగాహన పెంచడమేలి అని అన్నారు. పొగాకు, పొగాకు ఉత్పత్తులను సేవించడం వలన ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం 80 లక్షల మరణాలు సంభవిస్తున్నాయని డబ్ల్యుహెచ్ఓ నివేదికలు తెలియజేస్తున్నాయన్నారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మారబోయిన సదానంద యాదవ్ మరియు సభ్యులు జనార్ధన్, పాలం శ్రీను, అమ్మయ్య చౌదరి, శివరామకృష్ణ వాణిసాంబశివరావు, ప్రేమసింగ్, జిల్ మల్లేష్ శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

సంపత్ కుమార్‌ను అరెస్టు చేయాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : సింగరేణి కార్మికులను పీడిస్తున్న ఉద్యోగి జీకే సంపత్ కుమార్‌ను తక్షణమే అరెస్టు చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థి యువజన సంఘం నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో సింగరేణి ప్రాంత ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ ఉద్యోగులతో కలిసి సామూహిక నిరాహార దీక్షలు చేపడతామని వారు హెచ్చరించారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివశంకర్, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు జి.రమేష్‌లతో కలిసి రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ మాట్లాడారు. సింగరేణి సీఎం డి బలరాంను గిరిజనుడు అనే కారణంతో తీవ్ర వేదనలకు గురి చేస్తున్నాడని అన్నారు. ఈయనపై హైకోర్టులో తప్పుడు కేసుతో పాటు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు అనేక కల్పిత, అవాస్తవ ఆరోపణలతో ఫిర్యాదు చేస్తూ తీవ్రం మానసిక క్షోభకు గురి చేస్తున్నాడని చెప్పారు. గతంలో ఉద్యోగి సంపత్ ను అవినీతి ఆరోపణలతో సస్పెండ్ చేయగా ఇటీవల తిరిగి ఉద్యోగంలో చేరాడని అన్నారు. అప్పటి నుంచి అమాయక ఉద్యోగులను బదిలీలు, మెడికల్ అన్ ఫీట్ల పేరుతో వారి నుండి కోట్లలో డబ్బును దండుకుంటున్నాడన్నారు. ఇతనిపై ఇటీవల అవినీతి నిరోధక శాఖ జరిపిన దాడుల్లో ఎకౌంట్లో దాదాపు రెండు కోట్లను గుర్తించారన్నారు. ఈ కేసులో చెంచల్ గుడా జైల్లో శిక్ష సైతం అనుభవించాడని వెల్లడించారు. కావున సింగరేణి ఉద్యోగులను, ఉన్నతాధికారులను అకారణంగా వేధింపులకు గురి చేస్తున్న ఇతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

పామ్ ఆయిల్ రైతుపై దిగుమతి సుంకం తగ్గింపు ప్రభావం

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని తగ్గించడం వల్ల పామ్ ఆయిల్ సాగుచేసే రైతులపై తీవ్ర ప్రభావం పడ్తుందని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. రాష్ట్రంలో పామ్‌ఆయిల్ సాగు పెంచడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక ప్రోత్సహకాలు ఇస్తుందని, దీనితో రాష్ట్రంలో పామ్ ఆయిల్ సాగు చేయడానికి రైతులు ముందుకొస్తు న్నారని గుర్తుచేశారు. ఇలాంటి సమయంలో కేంద్ర ప్రభుత్వం.. పామ్ ఆయిల్ దిగుమతిపై సుంకం తగ్గించడం సరైన నిర్ణయం కాదన్నారు. ఇది దిగుమతి చేసుకునే పరిశ్రమలకు లాభం చేరుకు తుందన్నారు. ఒకపక్కన రాష్ట్ర ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తూ, సబ్సిడీలు ఇస్తుంటే.. కేంద్రప్రభుత్వం పిడుగులాంటి ఈ నిర్ణయం పామ్ ఆయిల్ తోటల రైతులకు నష్టం జరుగుతుంద న్నారు. కేంద్రంలో ఉన్న ప్రభుత్వం గతంలో కూడా మల్టీనేషనల్ కంపెనీలకు దిగుమతి సుంకం తగ్గించి కంపెనీల కు లాభాలు చేకూర్చిపెట్టింది. ఈ దిగుమతి, ఎగుమతి పాలసీ.. పామ్ ఆయిల్ తోటల వ్యవసాయంపైన ప్రభావం పడకుండా ఉండాలి అంటే.. కేంద్ర ప్రభుత్వం వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి, రైతులను కూడా భాగసామ్యం చేసి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ దిగుమతిపై సుంకాన్ని తగ్గించి తెలంగాణాలో సాగుచేసే పామ్ ఆయిల్ రైతులకు భారీ పెట్టుబడులు పెట్టి తోటలుపెంచి, ఆ లాభాలు రైతుకు అందకముందే ఈ నిర్ణయం తీసుకోవడంపై తెలంగాణ రైతు కమిషన్ తీవ్రంగా పరిగణలోకి తీసుకుంటుందన్నారు.

రాఫేల్ విషయంలో రాహుల్ గాంధీ డిమాండ్‌లో తప్పేముంది

విశాలాంధ్ర - హైదరాబాద్ : యుద్ధ విమానాల కొనుగోలు సమయంలో ప్రతిష్టాత్మకం గా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, పార్లమెంట్‌లో ప్రతిపక్షాల అభ్యంతరాలు, సూచనలు కాదని దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను కాదని ఫ్రాన్స్‌లోని యుద్ధాల తయారీ దస్సాల్ట్ కంపెనీతో అధిక ధరలకు ఒప్పందం చేసుకోవటం దేశ స్వావలంభనకు ప్రతీకగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థలలో ఒకటైన హెచ్ఏఎల్‌ను కాదని రాఫేల్ ఒప్పందం చేసుకున్నారని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.యస్.బోస్ అన్నారు. పార్లమెంట్‌లోని ప్రతిపక్షం సుప్రీంకోర్టులో ఈ ఒప్పందంపై కేసు వేస్తే దేశ భద్రతకు సంబంధిం చిన విషయంగా చెప్పి కేసు లేకుండా చేశారు. అందుకే రాహుల్ గాంధీ దేశ భద్రత కొరకు పాకిస్తాన్ యుద్ధంలో రాఫేల్ యుద్ధ విమానాల పనితీరు సమర్థత ఏమిటో తెలుసుకోవాలని కోరటంలో తప్పేముందని బోస్ ప్రశ్నించారు. రాఫేల్ యుద్ధ విమానాలు ఎన్ని పాకిస్తాన్ యుద్ధ విమానాలను కూల్చాయి, ఎన్ని రాఫేల్ యుద్ధ విమానాలు కూల్చివేయబడ్డాయో తెలియజేయాలని అడగటంలో తప్పేముందో మోడీ చెప్పాలని డిమాండ్ చేశారు. అలా అడగటం మూలంగా సైనికుల మానోభావా న్ని దెబ్బతీస్తుందని మోడీ వంద మగదలు ప్రచారం చేయటంలో అర్థం లేదని అన్నారు. యుద్ధంలో సమర్థవంతంగా పనిచేయని యుద్ధ విమానాలు సైనికులకు అందజేస్తే వారి మనోభావాలు దెబ్బతినవా అని బోస్ ప్రశ్నించారు. రాఫేల్ యుద్ధ విమానాలు బాగా పనిచేస్తే భారతదేశంలోని ప్రభుత్వరంగ సంస్థలు నిర్మించిన బ్రహ్మోస్‌ను అందరు ఎందుకు పొగుడుతున్నారో అర్థం చేసుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వరంగంలోని బ్రహ్మోస్‌ను కాదని రాఫేల్ యుద్ధవిమానాలు కొనటం సమర్ధనీయమా అని అన్నారు. యుద్ధ విమానాలు తయారీలో ఏలాంటి అనుభవంలేని, అసలు అలాంటి కంపెనీ లేని అనీల్ అంబానీ పేపర్ కంపెనీకి రాఫేల్ ఒప్పందం ఇప్పించటం దేశద్రోహం కాక మరేమిటని ప్రశ్నించారు. రాఫేల్ యుద్ధవిమానాలపై ప్రశ్నించిన రాహుల్ గాంధీని పాకిస్తాన్ పొమ్మంటే, రాఫేల్ ఒప్పందం చేసుకున్నవారు, ఒప్పందానికి సహకరించిన వారు ఫ్రాన్స్‌కు పోతారా అని అన్నారు. ఆనాడు రాహుల్‌గాంధీ హెచ్ఏఎల్‌కు అండగా నిలబడి ఉద్యమాలు చేశాడు. అందుకు అతనికి ఇప్పుడు ప్రశ్నించే హక్కు ఉందని, ప్రశ్నినందుకు నింధించి, అవమానం చేసే హక్కు ఎవరికీ లేదని ఆయన అన్నారు.

ఆశీర్వాద్ మల్టిగ్రెయిన్స్ హ్యాపీ టమ్మీ సర్వే నివేదిక వెల్లడి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రపంచ జీర్ణక్రియ దినోత్సవం సందర్భంగా ఆశీర్వాద్ హ్యాపీ టమ్మీ ప్లాట్ ఫాం 8 లక్షలకు పైగా ప్రజలు అందించిన జవాబులు ఆధారంగా దేశపు జీర్ణశక్తి ఆరోగ్యం గురించి అవగాహనా విశ్లేషణను విడుదల చేసింది. ఫలితాల్లో ఫైబర్ మీటర్ నుండి 1.27 లక్షల మంది డైజెస్టివ్ కోషియెంట్ ఆన్ హ్యాపీ టమ్మీ నుండి 7.4 లక్షలకు పైగా రెస్పాం డెంట్స్ ఇచ్చిన జవాబులు ఉన్నాయి. ఆశీర్వాద్ హ్యాపీ టమ్మీ అనగా మల్టిగ్రెయిన్స్‌తో ఆశీర్వాద్ద ఆటా అందించే ఆన్ లైన్ ప్లాట్ ఫాం. ఇది జీర్ణశక్తి ఆరోగ్యం ఫైబర్ తీసుకోవడంపై దృష్టి కేంద్రీకరించిన సమగ్రమైన గైడ్‌గా పని చేస్తుంది. సర్వేకి ప్రతిస్పందించిన 70 శాతం మంది భారతీయులు సిఫారసు చేసిన రోజూవారీ ఫైబర్‌ను తీసుకోవడం లేదని ఫైబర్ మీటర్ నివేదిక వెల్లడించింది. 64 శాతం మంది మగవారితో పోల్చినప్పుడు ఈ అంతరం మహిళల్లో అధికంగా 74 శాతం మందిలో ఉందన్నారు. జీర్ణశక్తి ఆరోగ్యం ప్రాధాన్య తను తెలియచేస్తూ చెన్నైలోని ఎస్ ఆర్ ఎం ఇన్స్టిట్యూట్స్ ఫర్ మెడికల్ సైన్స్ మెడికల్ గ్యాస్ట్రోఎంటిరాలజీ విభాగ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్. బిఎస్ రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నో దీర్ఘకాలిక వ్యాధుల అభివృద్ధి కొనసాగింపు పరిస్థితిలో జీర్ణశక్తి వ్యవస్థ కీలకమైన బాధ్యత, పేగుల మైక్రోబయోటలు ఇప్పుడు బాగా ప్రశంశించబడ్డాయన్నారు. పూర్తి జీర్ణశక్తి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ముఖ్యంగా తృణ ధాన్యాలు, మల్టిగ్రెయిన్ ఆధారాల నుండి ఆహారపు ఫైబర్ బాధ్యతను శాస్త్రీయ విజ్ఞానం నిరంతరంగా నిరూపిస్తోందన్నారు. ఐటీసీ ఫుడ్స్ స్టేపుల్స్ అడ్జసెన్సీస్ విభాగ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అనుజ్ రస్తగి మాట్లాడుతూ ఫైబర్ మన జీర్ణశక్తి ఆరోగ్యానికి పునాది స్థంభం అయినప్పటికీ చాలామంది తమ రోజూవారీ ఆహారంలో ప్రాధాన్యతనివ్వడం లేదని, జీర్ణశక్తి వ్యవస్థకు సర్వ రోగ నివారిణిగా పని చేసే ఫైబర్ బాధ్యతను చాలామంది తక్కువ అంచనా వేస్తున్నారన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

విశాలాంధ్ర - ఆమనగల్లు : అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని ఆమనగల్లు మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అందరికీ అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని తెలిపారు. ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామంలో శనివారం ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రొసీడింగ్లను అందించి ఇంద్రమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు. రాష్ట్రంలో నిరుపేదల కోసం అందరికీ సొంతింటిని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేసిందని తెలిపారు. లబ్ధిదారులు కట్టుకునే ఇంటికి ఐదు లక్షల ఆర్థిక సాయం నేరుగా వారి బ్యాంకు ఖాతాలో నాలుగు దశల్లో ప్రభుత్వం జమ చేస్తుందని తెలిపారు. మొదటి విడుదల నివాసస్థల ఉన్న వారికి ఇల్లు నిర్మించి ఇవ్వడం జరుగుతుందని, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులకు ప్రాధాన్యతిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకంలో ఎలాంటి అవినీతికి తావీ ఇవ్వకుండా రాజకీయ ప్రభావాలకు అధికారులు లొంగకుండా పారదర్శకంగా ఎంపిక విధానం రూపొందించినట్లు అనంతరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కొప్పు జంగయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య, గ్రామస్తులు మల్లయ్య, నరసింహ, అంజయ్య, బాలకష్టి తదితరులు పాల్గొన్నారు.

కొండంత అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు కొండంత అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి షాపూర్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తన నివాసం వద్ద విజయలక్ష్మికి రూ.60,000, ఎర్రబెల్లి సుష్మ రూ.60,000ల సిఎంఆర్‌ఆఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ సిఎంఆర్‌ఆఫ్ పేదలకు కొండంత అండగా మారిందని, తెలంగాణలో ప్రతి సామాన్యునిడికి సంక్షేమ ఫలాలు అందించడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృఢ సంకల్పమని తెలియజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రి దామోదర్ రాజానర్సింహా ప్రత్యేక చొరవతో ప్రభుత్వ ఆసుపత్రుల వైద్య సదుపాయాలు, సేవలు చాలా అభివృద్ధి చెందుతున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, సంక్షేమ సంఘాల నాయకులు, మహిళ సంఘాలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: ముఖ్యమంత్రి సహాయనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 128 - చింతల్ డివిజన్ ఎన్.ఎల్.బి నగర్ ప్రాంతానికి చెందిన వీర వీరరాజు (59) బిక్షపతి (58) 126 - జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్‌కు చెందిన ఆదిలక్ష్మి (54)ల ఆరోగ్య పరిస్థితి బాగాలేదని అనుచరుల ద్వారా తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ వైద్య సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లబ్ధిదారులకు 4.35 లక్షల రూపాయల విలువ గల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. అనంతరం శనివారం చింతల్ నందు ఎమ్మెల్యే కార్యాలయంలో బాధితులకు స్థానిక బిఆర్ఎస్ నాయకులు ఎల్వోసీ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్నామని ఇంటి తలుపు తట్టిన ప్రతీ ఒక్కరిని నేనున్నానంటూ అభయాన్నిస్తూ ఆదుకునే నాయకుడు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అని, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎదురు చూసేవారు ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కెపి.వెంకటేష్ గౌడ్, ప్రభాకర్ గుప్తా, బస్వరాజు, రాచకొండ మురళి, రత్నం, శ్రీశైలం యాదవ్ విశ్వనాథ్ గుప్తా, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

విశాలాంధ్ర - మొయినాబాద్ : నిజమైన అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ పామెన భీంభరత్, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్‌లు హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా శనివారం మండలంలోని కనకమామిడి గ్రామంలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలతో పాటు ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ గెలుపు కోసం పనిచేసిన వారికి, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించడం జరుగుతుందని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కష్టపడి పనిచేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్వర్యంలో ప్రజాపాలన అద్భుతంగా కొనసాగుతుందని అందరూ ప్రభుత్వ అధికారులకు సహకరించాలని కోరారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లి వచ్చే స్థానిక సంస్థల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకై పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీలోని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పార్టీ సీనియర్ నాయకులు బొక్క బాల కృష్ణారెడ్డి, మర్రి రవీందర్‌రెడ్డి, సొసైటీ బ్యాంకు డైరెక్టర్ రాఘవేందర్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దేశ ఐక్యతకు రాజ్యాంగమే పునాది

సీజేఐ గవాయ్ ఉద్ఘాటన

ప్రయాగ్‌రాజ్: సంక్షోభంలోనూ దేశాన్ని ఐక్యంగా ఉంచగలిగే సామర్థ్యం రాజ్యాంగానికి మాత్రమే ఉందని, అందుకు ఘనత దానికే దక్కుతుందని సీజేఐ బీఆర్ గవాయ్ అన్నారు. అలహాబాద్ హైకోర్టులో అడ్వకేట్ చాంబర్లు, మల్టీలెవల్ పార్కింగ్‌ను శనివారం ప్రారంభించారు. అనంతరం సభలో సీజేఐ మాట్లాడుతూ 'రాజ్యాంగం రూపకల్పన జరిగిన సమయంలో తుది ముసాయిదా రాజ్యాంగ సభ ఎదుటకు వచ్చినప్పుడు భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొందరు రాజ్యాంగాన్ని ఫెడరల్ అంటే మరికొందరు ఏకపక్షంగా ఉందన్నారు. రాజ్యాంగం పూర్తిగా ఫెడరల్ కాదు ఏకపక్షమైనదీ కాదని... శాంతి లేక యుద్ధం పరిస్థితి ఏదైనాగానీ దేశాన్ని ఐక్యంగా ఉంచగలిగేది రాజ్యాంగం మాత్రమే అని కచ్చితంగా చెప్పగలను అంటూ బాబాసాహెబ్ అంబేద్కర్ సమాధానం ఇచ్చారు' అని వెల్లడించారు. రాజ్యాంగం కారణంగానే స్వాతంత్ర్యం వచ్చాక భారత్ అభివృద్ధి పథంలో ముందుకెళ్ల గలిగిందని సీజేఐ తెలిపారు. 'దేశం ఎప్పుడు సంక్షోభం నెలకొన్నాగానీ ఐక్యంగా, దృఢంగా నిలిచి ఆ కష్టాన్ని అధిగమించింది.ఇందుకు రాజ్యాంగం దోహదమైంది' అని జస్టిస్ గవాయ్ నొక్కిచెప్పారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు అయిందని, సామాజిక, ఆర్థిక సమానత్వానికి చట్టం, పరిపాలన, న్యాయం దోహదమయ్యాయన్నారు. చివరి పౌరుడికి న్యాయం జరిగేలా చూడటం మన ప్రాథమిక కర్తవ్యమని జస్టిస్ గవాయ్ అన్నారు. భూ సంస్కరణలను ప్రస్తావిస్తూ సంబంధిత చట్టాలు ఎప్పటికప్పుడు సవాళ్లు ఎదుర్కొన్నాయన్నారు. రాజ్యాంగాన్ని, ప్రాథమిక హక్కులను సవరించే హక్కు పార్లమెంటుకు ఉంది కానీ రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణాన్ని మార్చే హక్కు లేదని 1973లో 13 మంది జడ్జిల సుప్రీం ధర్మాసనం నిర్ణయించిందని జస్టిస్ గవాయ్ వెల్లడించారు. 'ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక హక్కులు రెండూ రాజ్యాంగానికి ఆత్మ.. ఇవి బండికి రెండు చక్రాల వంటివి.. ఏ ఒక్క చక్రం లేకున్నా బండి కదల్లేదు' అని వ్యాఖ్యానించారు. బార్, బెంచ్ అన్నవి నాణేనికి రెండు పక్కల వంటివి అని తానెప్పుడూ అంటుంటానని జస్టిస్ గవాయ్ చెప్పారు. ఈ రెండు కలిసి పనిచేస్తే న్యాయ వ్యవస్థ సజావుగా సాగుతుందన్నారు. బార్ కోసం 12 బంగళాలను జడ్జిలు ఖాళీ చేయడం ద్వారా అలహాబాద్ హైకోర్టు దేశానికి మార్గదర్శిగా నిలిచిందని సీజేఐ అన్నారు. సోదర న్యాయవాదుల వెసులుబాటుకు ప్రాధాన్యత ఇవ్వడం స్వాగతించదగిందన్నారు.

పేదల ఇళ్ల కూల్చివేతలు ఆపండి

మోదీకి నారాయణ లేఖ

న్యూఢిల్లీ: సుందరీకరణ పేరిట పేదల తొలగింపు ఆక్షేపణీయమని, ఈ చర్యలను తక్షణమే నిలిపివేయాలని సీపీఐ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలోని మద్రాసీ క్యాంపు జంగాపురా బిలో పేదల ఇళ్ల కూల్చివేతలను ఖండించారు. ఈ కూల్చివేతలను ఆపాలని తక్షణమే ఆదేశాలివ్వాలని కోరుతూ ఆయన శనివారం ప్రధాని మోదీకి ఒక లేఖ రాశారు. ఝుగ్గి మురికవాడలతో పాటు మద్రాసీ క్యాంపులో కూల్చివేతలను నిలిపి వేయాలని ఢిల్లీ ప్రభుత్వానికి ఆదేశాలివ్వా లని డిమాండ్ చేశారు. పేద ప్రజలకూ జీవిక హక్కు ఉందని, శ్రమజీవులు ఎంతో కష్టంతో గూడు నిర్మించుకుంటే... సుందరీకరణ నెపంతో వాటిని కూల్చేస్తారా? ఇదేనా మీరు చెప్పే సబ్ కా సాథ్, సబ్ కా వికాస్‌కు అర్థమంటూ మోదీని నారాయణ ప్రశ్నించారు. తక్షణమే కూల్చివేతలు, బుల్డోజర్లను ఆపాలన్నారు. ఎక్కడైతే పేదల ఇళ్లు కూల్చారో అక్కడే బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి, వారికి ఫ్లాట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమిళనాడు నుంచి 50-60ఏళ్ల కిందట వచ్చి ఢిల్లీలో స్థిరపడిన ఈ బస్తీ ప్రజలకు న్యాయం చేయాలని నారాయణ కోరారు. ఈ బస్తీకి 45 కిమీల దూరంలోని నరేలాకు వెళ్లిపోవాలని, తక్షణమే ఈ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని మద్రాసీ క్యాంపు ప్రజలకు ఢిల్లీ ప్రభుత్వం నోటీసులు ఇచ్చిందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ఈ బస్తీ ప్రజలు ఢిల్లీలోనే నిరుపేదలని, రోజువారీ కూలీలుగా, పారిశుధ్య కార్మికులుగా, వీధి విక్రేతలుగా చిన్న చిన్న పనులు చేసుకుంటున్నారన్నారు. బస్తీని ఖాళీ చేయించడమంటే వారికి ఉపాధి లేకుండా చేయడమే కాకుండా వారి పిల్లలను విద్యకు దూరం చేయడమే అవుతుందని నారాయణ ఆందోళన వ్యక్తంచేశారు. పేదల గుడిసెల తొలగింపు పనుల్లో చాలా రాష్ట్రాల ప్రభుత్వాలు నిమగ్నమయ్యాయని, మురికివాడలు ఖాళీ చేయిస్తూ పేదలకు నిలువ నీడ లేకుండా, ఉపాధి లేకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. 'బుల్డోజర్లు ఆపాలని దయచేసి ఆదేశాలివ్వండి. దేశంలోని నిరుపేదలకు వ్యతిరేకమైన ఈ విధానాన్ని రద్దు చేయండి' అని ప్రధానిని కోరారు. కూల్చివేతలను ఆపడమే కాక అక్కడే పేదలకు ఇళ్లు కట్టి ఇవ్వాలని కూడా నారాయణ డిమాండ్ చేశారు.

ప్రపంచ సుందరి థాయ్‌లాండ్ భామ సుచాత

విశాలాంధ్ర- హైదరాబాద్: ఉత్కంఠ భరితంగా సాగిన 72వ మిస్ వరల్డ్ పోటీల్లో థాయ్‌లాండ్ సుందరి ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ ప్రపంచ సుందరి కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. విశ్వసుందరి పోటీలు హైదరాబాద్ నగరంలో శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. హైటెక్స్ వేదికగా జరిగిన ఈ అందాల పోటీలు బాలీవుడ్ తారల ప్రత్యేక ప్రదర్శనలతో మరింత శోభ సంతరించుకున్నాయి. ఈ ప్రతిష్ఠాత్మక కిరీటం కోసం ప్రపంచవ్యాప్తంగా 108 దేశాల అందాల భామలు పోటీ పడ్డారు. దీనిలో భాగంగా ఇప్పటికే వివిధ దశల్లో తమ ప్రతిభ చాటుకున్న అందగత్తెల నుంచి 16 మంది క్వార్టర్స్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. వీరి నుంచి చివరి రౌండ్‌లో నలుగురిని ఎంపిక చేశారు. అమెరికా-కరేబియన్, ఆఫ్రికా, యూరప్, ఆసియా-ఓషియానా ఖండాల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఈ నలుగురు ఫైనలిస్టులుగా నిలిచారు. ఫైనల్ పోటీలకు న్యాయనిర్ణేతల బృందంలో ప్రముఖ నటుడు సోనూ సూద్, వ్యాపారవేత్త సుధారెడ్డి, 2014 మిస్ ఇంగ్లండ్ కెరీనా ఉన్నారు. మిస్ వరల్డ్ సంస్థ చైర్మన్ జూలియా మోర్లీ న్యాయనిర్ణేతల ప్యానెల్‌కు చైర్మన్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి సినీ పరిశ్రమ నుంచి ప్రముఖ నటుడు దగ్గుబాటి రానా, నటి నమ్రత హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

'సిందూరం' తుడిపేస్తే ఊరుకుంటామా: మోదీ

భోపాల్: పహల్గాంలో దాడికి పాల్పడటం ద్వారా ఉగ్రవాదులు వారి వినాశనాన్ని వారే కొనితెచ్చుకున్నారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్'లో కొంతమంది మహిళా అధికారులు పాల్గొని... ఉగ్రవాదుల ఆచూకీ గల్లంతు చేశారని మోదీ అన్నారు. భారత మహిళల సిందూరం తుడిపేస్తే చూస్తూ ఊరుకునేది లేదని చెప్పుకొచ్చారు. రాణి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి సందర్భంగా భోపాల్‌లో శనివారం నిర్వహించిన 'మహిళా స్వశక్తికరణ్ మహా సమ్మేళన్'లో ప్రధాని మాట్లాడారు.

దేశ సమైక్యతకు పాటుపడదాం

ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: దేశ సమైక్యతకు ప్రతిఒక్కరూ పాటుపడాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సీపీఐ గుంటూరు నగర సమితి సభ్యుల సమావేశం మల్లయ్యలింగం భవన్‌లో నగర కార్యవర్గ సభ్యులు ఆకిటి అరుణ్ కుమార్ అధ్యక్షతన శనివారం జరిగింది. ముప్పాళ్ల మాట్లాడుతూ మతాలు, కులాలను రెచ్చగొట్టి మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం... హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఉగ్రవాదం, మతోన్మాదం దేశానికి ప్రమాదమని ముప్పాళ్ల ఉద్ఘాటించారు. మోదీ, అమిత్ షా బీహార్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కోసం గిమ్మిక్కులు చేస్తున్నారని, అధికారం కోసం సైనికులను పణంగా పెడుతున్నారని విమర్శించారు. గతంలోనూ పుల్వామా ఘటన చోటుచేసుకుందని గుర్తుచేశారు. ఆయా రాష్ట్రాల్లో ఎన్నికలు వచ్చినప్పుడే ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరమని అన్నారు. భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కలుగజేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. స్వతహాగా నిర్ణయం తీసుకొనే హక్కు నరేంద్ర మోదీకి లేదా అని నిలదీశారు. 1971లో జరిగిన యుద్ధంలో నాటి అమెరికా అధ్యక్షుడు రిచర్డు నిక్సన్ కలుగజేసుకోపోతుంటే ఎవరి సూచనలు అవసరం లేదని, తామేంటో నిరూపిస్తామని ధైర్యంగా ఎదురొడ్డి నిలిచిన ప్రధాని ఇందిరా గాంధీ అని కొనియాడారు. మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశ సంపదను తన అనుయాయులు అంబానీ, అదానీ, ఇతర గుజరాత్ పెట్టుబడిదారులకు ధారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. ఆపరేషన్ కగార్ పేరుతో అమాయకులైన గిరిజనులను, ఆదివాసీలను పొట్టనపెట్టుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కగార్ ఆపరేషన్ నిలిపివేసి... మావోయిస్టులతో చర్చలు జరపాలని ఆయన కోరారు. మోదీ ప్రభుత్వం ప్రజా, రైతు, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని, దీన్ని తిప్పికొట్టడానికి ప్రజలు, పార్టీ కార్యకర్తలు కంకణబద్ధులై ముందుకు రావాలని ముప్పాళ్ల పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను అష్టకష్టాల పాలు చేసిందన్నారు. అర్హులైన పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చి... ఇప్పుడు నోరు మెదపడం లేదన్నారు. ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ గుంటూరు నగరంలోని నిరుపేదలందరికీ రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఇచ్చి... నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని ఇప్పటికే అర్జీలు అందజేశామని గుర్తుచేశారు.

మద్యం కేసులో నిందితుల విచారణ పూర్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితులైన నలుగురిని సిట్ అధికారులు రెండో రోజు శనివారం కస్టడీకి తీసుకుని విచారణ జరిపారు. ఐటీ శాఖ మాజీ సలహాదారు రాజ్ కసిరెడ్డి, సీఎంఓ మాజీ కార్యదర్శి, విశ్రాంత ఐఏఎస్ ధనుంజయరెడ్డి, జగన్ ఓఎస్డీ పి.కృష్ణమోహన్‌రెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలను శనివారం ఉదయం విజయవాడ జిల్లా జైలు నుంచి కస్టడీలోకి తీసుకున్న సిట్ అధికారులు తమ కార్యాలయానికి తీసుకువెళ్లి సాయంత్రం ఆరు గంటల వరకూ విచారించారు. విచారణకు ముందు ప్రభుత్వ ఆసుపత్రిలో వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సాయంత్రం వారిని జైలుకు తరలించారు. ఈ నలుగురిని రెండు రోజుల పాటు సిట్ కస్టడీకి ఇస్తూ ఏసీబీ కోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో శుక్ర, శనివారం అధికారులు విచారించారు. కొల్లగొట్టిన సొత్తు ఎక్కడికి చేరింది అనే దానిపై వివిధ రకాలుగా సిట్ అధికారులు ప్రశ్నలను సంధించి వారి నుంచి సమాధానాలు రాబట్టినట్లు తెలుస్తోంది.

పది పరీక్షల నిర్వహణలో చంద్రబాబు, లోకేశ్ వైఫల్యం: జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పదో తరగతి పరీక్షల నిర్వహణలో ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ పూర్తిగా వైఫల్యం చెందారని వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ విమర్శించారు. కూటమి పాలనలో విద్యారంగం భ్రష్టుపట్టిపోయిందని దుయ్యబట్టారు. వారి అవివేక, అనాలోచిత, పరిణితిలేని నిర్ణయాలతో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కష్టాలే ఎదురవుతున్నాయని శనివారం సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. మూల్యాంకనాన్ని కూడా సరిగ్గా నిర్వహించలేని దుస్థితిలో ఉన్న వీరు వ్యవస్థలను ఇంకా ఎంత ఘోరంగా నడుపుతున్నారో అర్థం అవుతోందన్నారు. ప్రతి విద్యార్థి కూడా తన మార్కుల జాబితాపై అనుమానాలు వ్యక్తంచేసే పరిస్థితిని తీసుకువచ్చారన్నారు. వీరి నిర్వాకం కారణంగా ట్రిపుల్ ఐటీ, గురుకుల జూనియర్ కాలేజీలు సహా ఇతరత్రా ప్రవేశాల్లో విద్యార్థులు అన్యాయమైపోయిన ఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయన్నారు. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని చంద్రబాబును నిలదీశారు. అసలు పరీక్షల నిర్వహణ సమయంలోనే ప్రశ్నపత్రాలు లీకేజీ అయ్యాయన్నారు. రాష్ట్రంలో చదివే ప్రతి విద్యార్థి ప్రపంచ స్థాయిలో పోటీని ఎదుర్కొనేలా తీసుకొచ్చిన అనేక సంస్కరణలను వచ్చీరాగానే దెబ్బతీశారని విమర్శించారు. స్కూళ్లలో నాడు-నేడు, గోరుముద్ద, ఇంగ్లీషు మీడియం, సీబీఎస్ఈ నుంచి ఐబీ వరకూ ప్రయాణం, 3వ తరగతి నుంచే టోఫెల్ క్లాసులు, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు, 3వ తరగతి నుంచే సబ్జెక్టుల వారీగా బోధన ఇలా ప్రతి మంచి కార్యక్రమాన్ని కక్షగట్టి నీరుగార్చారని దుయ్యబట్టారు. అమ్మ ఒడిని రద్దుచేశారన్నారు. ఎలాంటి ఫీజు లేకుండా కోరిన ప్రతి విద్యార్థి జవాబు పత్రాలను రీవాల్యుయేషన్ చేయించాలని, తుది ఫలితాలు వచ్చేంత వరకూ పదవ తరగతి మార్కుల ఆధారంగా చేస్తున్న అడ్మిషన్లను కొన్ని రోజుల పాటు నిలిపివేయాలని, తప్పులకు బాధ్యులైన మంత్రి లోకేశ్‌తో మొదలు అందరిపైనా చర్యలు తీసుకోవాలని జగన్ డిమాండ్ చేశారు.

మంగళగిరి కోర్టుకు మాజీ ఎంపీ నందిగం సురేశ్

విశాలాంధ్ర-మంగళగిరి: ఇసుకపల్లి రాజుపై దాడి చేసిన కేసులో పోలీసు కస్టడి ముగిసిన తర్వాత శనివారం మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను మంగళగిరి కోర్టులో తుళ్లూరు పోలీసులు హాజరుపరిచారు. న్యాయమూర్తి లేకపోవడంతో ఇంచార్జి కోర్టులో హాజరుపరిచారు. జూన్ రెండో తేదీ మరలా కోర్టుకు రావాల్సి ఉంటుందని సురేశ్ తరపు న్యాయవాది చిరంజీవి తెలిపారు. సురేశ్‌పై పోలీసులు వ్యవహరించిన తీరుపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తామని తెలిపారు. సామాన్య మనిషి కన్నా హీనంగా పోలీసులు చూశారని అన్నారు. న్యాయవాదిని కూడా కలవనీయకుండా చేశారని చెప్పారు.

గమ్యానికి చేరకముందే ఆహార ట్రక్కులు ఖాళీ

జెరూసలేం: గాజాలో ఆకలి కేకలు మిన్నంతుండటంతో అక్కడి గోదాములపై దాడులు జరుగుతున్నాయి. తాజాగా ఆహార పదార్థాలతో వెళ్తున్న ట్రక్కులను వేలాది మంది అడ్డుకున్నారు. ట్రక్కులు గమ్య స్థానాలకు చేరకముందే అందులోని ఆహార పదార్థాలను తీసుకెళ్లిపోయారు. ఈ మేరకు ఐరాసకు చెందిన ప్రపంచ ఆహార కార్యక్రమం వెల్లడించింది. 77 ట్రక్కులను మార్గమధ్యలోనే అడ్డుకున్నా రని తెలిపింది. 80 రోజుల పాటు సాయం నిలిచిపోవడంతో వేలాది మంది ఆకలితో అలమటిస్తున్నారు. దీంతో ఆ వాహనాలను ముందుకు వెళ్లనివ్వలేదు' అని డబ్ల్యూఎఫ్‌పీ పేర్కొంది. తగినంత ఆహారం అందుబాటులో లేక ఇలాంటి పరిస్థితి ఎదురైనట్లు తెలిపింది. మరింత సాయానికి వేగంగా అనుమతులు ఇవ్వడంతోపాటు కాన్వాయ్‌కు రక్షణ కల్పించాలని కోరింది. గాజాలోని పలస్తీనీయన్లకు మానవతా సాయం తరలింపునకు ఇజ్రాయిల్ పరిమితంగానే అనుమతిస్తోంది. దీంతో ఆహార ఆహార పదార్థాలున్న పెట్టెలను సైతం గాజా ప్రజలు లూటీ చేసే పరిస్థితి నెలకొంది.

వాస్తవాలు మరుగున పెట్టి విమర్శలా...

జగన్‌పై లోకేశ్ ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వాస్తవాలు మరుగున పెట్టి తమపై బురద జల్లడం సిగ్గుచేటని వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి చేసిన విమర్శలపై మంత్రి లోకేశ్ ఎక్స్‌లో దుయ్యబట్టారు. ప్రజా జీవితంలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ విఫలమైన జగన్ ఇప్పటికైనా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. చిన్నప్పుడే టెన్త్ పేపర్లు ఎత్తుకుపోయిన ఆయన నుంచి హుందాతనం ఆశించడం తప్పేనని ఎద్దేవా చేశారు. యూనిఫామ్ దగ్గర నుంచి చిక్కీ వరకూ పార్టీ రంగులు, వారి పేరు పెట్టుకొని ఇప్పుడు విలువలు మాట్లాడటం ఆయనకే చెల్లిందని జగన్‌ను విమర్శించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు రద్దు చేసిన ఆయన మాటటు విడ్డూరంగా ఉన్నాయన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆలోచించే సీబీఎస్ఈ పరీక్షా విధానాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు. ప్రణాళికాబద్ధంగా ఉపాధ్యాయులను, విద్యార్థులను సిద్ధం చేసిన తరువాతే ఈ పరీక్షా విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు లోకేశ్ తెలిపారు. జగన్ హయాంలో ఐబీ నివేదిక కోసం రూ.5 కోట్లు ఖర్చు చేశారు కానీ ఐబీ అమలు చేయలేదన్నారు. ఉన్నత విశ్వవిద్యాలయాలను రాజకీయ కేంద్రాలుగా మార్చి ఆడిన వికృత క్రీడ అందరూ చూశారని విమర్శించారు. పదోతరగతి పరీక్ష పేపర్ల మూల్యాంకనంలో తమకు అన్యాయం జరిగిందని విద్యార్థులు భావించినప్పుడు రీ కౌంటింగ్/రీ వెరిఫికేషన్ కోరడం పాత పద్ధతేనన్నారు. 99.75 శాతం కచ్చితత్వంతో మూల్యాంకనం జరిగిందని లోకేశ్ తెలిపారు. మానవ తప్పిదం 0.25 శాతం మాత్రమేనన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్షల నిర్వహణ, పేపర్లు లీక్‌లపై చేసినవి నిరాధార ఆరోపణలని పేర్కొన్నారు. రీ వెరిఫికేషన్‌లో తేడాలు గుర్తించిన విద్యార్థులకు అర్జేయుకేటీల్లో ప్రవేశాలకు జూన్ 10 వరకు అవకాశం ఇచ్చామని, ఇతర అడ్మిషన్లకూ సమయమిచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని లోకేశ్ వెల్లడించారు.

తొలి రోజే 92.59 శాతం పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా తొలి రోజే ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ 92.59 శాతం పూర్తయింది. శనివారం ఉదయం నుంచి రాత్రి 8.45 గంటల వరకు పింఛన్లు పంపిణీ చేశారు. జూన్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్ల పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. 58,54,779 మంది లబ్ధిదారులకు ఇళ్ల వద్దే పింఛన్లను అందజేశారు. మొత్తం 63 లక్షల మందికి పింఛన్ ఇచ్చేందుకు ప్రభుత్వం రూ.2,717 కోట్లు విడుదల చేసింది. అత్యధికంగా అల్లూరి జిల్లాలో 94.56 శాతం మేర పంపిణీ పూర్తి అయింది. ఉదయం 8.30 గంటలకే 52 శాతం మేర పింఛన్ల పంపిణీ పూర్తి అయినట్లు అధికారులు వెల్లడించారు.

ఉద్యోగుల నమ్మకాన్ని నిలబెడతా

ఏపీ ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడిగా 'ఆలపర్తి' ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): ఏపీ ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆలపర్తి విద్యాసాగర్ ఎన్నికయ్యారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో హోమ్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశం విద్యాసాగర్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా ఆమోదిస్తూ తీర్మానించింది. ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి పదవీకాలం పూర్తి కావడంతో నూతన అధ్యక్షుడి ఎన్నిక అనివార్యమైంది. బందరు రోడ్డులోని శేషసాయి కల్యాణ మండపంలో శనివారం ఉద్యోగుల జయజయ ధ్వానాల మధ్య అధ్యక్షుడిగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం విద్యాసాగర్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే శ్వాసగా వివిధ పదవులు నిర్వహించినట్టు చెప్పారు. ప్రభుత్వంతో సామరస్య పూర్వకంగా చర్చించి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషిచేస్తానన్నారు. మీ నమ్మకాన్ని తప్పకుండా నిలబెట్టుకుంటానన్నారు. కేవీ శివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతో పేరు ప్రతిష్టలు కలిగిన ఏపీ ఎన్జీవో సంఘానికి విద్యాసాగర్ వంటి నాయకుల అవసరం ఉందన్నారు. ప్రభుత్వ విప్, విజయవాడ మధ్య నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ మోహన్ రావు నూతన నాయకత్వానికి అభినందనలు తెలిపారు. ఏపీ ఎన్జీవో పూర్వపు రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి అశోక్ బాబు, జి. పూర్ణచంద్రరావు, రాధాకృష్ణమూర్తి, పూర్ణచంద్రరావు, నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, దస్తగిరి రెడ్డి, రమణ, శ్రీనివాస్, ప్రసాద్, మాధవ్, షరీఫ్, శ్రీనివాసులు, వెంగళరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, ఘంటసాల శ్రీనివాస్, రామ మోహన్, ఈశ్వర రావు, ఆనందబాబు, సాయి, శరత్, పెంచలరావు, చంద్రశేఖర్ రెడ్డి, నరసింహులు, రాజ్యలక్ష్మి, నిర్మలా కుమారి, రాధమ్మ పాల్గొన్నారు.

కేరళ, అసోంలో వర్ష బీభత్సం

- వరద పోటుతో తీవ్ర నష్టం
- జలదిగ్బంధంలో గ్రామాలు, పట్టణాలు
- పునరావాస కేంద్రాలకు వేల మంది
- అసోంలో కొండచరియలు పడి ఐదుగురి మృతి

తిరువనంతపురం: ఈశాన్య, దక్షిణ రాష్ట్రాల్లో వర్షాలు బీభత్సం సృష్టించగా... వరదలతో నష్టం వాటిల్లింది. నదులు పోటెత్తడంతో ఇళ్లు, రోడ్లు కొట్టుకుపోయి జనజీవనం అస్తవ్యస్థమైంది. అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయలోనూ భారీ వర్షాలు కురిశాయి. 24 గంటలుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో అసోంలో కొండ చరియలు విరిగిపడి ఐదుగురు చనిపోయారు. చిరాంగ్, బక్సా, బరాపేట, బోంగైగావ్, బాజాలి, తముల్పూర్, దర్రాంగ్, ఉదల్గురిలో శనివారం రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఆరు జిల్లాలకు వరదకు రాగా 10 వేల మందికిపైగా నిరాశ్రయులయ్యారు. కామరూప్, కామరూప్ మెట్రోపాలిటన్ జిల్లాల్లో శనివారం ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సెలవు ఇచ్చారు. విద్యా సంస్థలన్నింటిని మూసివేశారు. ఈ మేరకు అసోం రాష్ట్ర విపత్తు నివారణ యంత్రాంగం (ఏఎస్‌డీఎంఏ) తెలిపింది. దక్షిణాది రాష్ట్రమైన కేరళను వరదలు ముంచెత్తాయి. చాలా ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. భారీ వర్షాలతో రోడ్లన్నీ చెరువులయ్యాయి. నదుల ఉధృతికి ఆయా ప్రాంతాలలో జనజీవనం స్తంభించింది. కాసర్‌గాడ్‌లో మధువాహిని నది పోటెత్తింది. పరివాహక ప్రాంతాల్లో ఇళ్లు, రోడ్లు కొట్టుకుపోయాయి. కోజికోడ్, కన్నూర్ జిల్లాల్లో తీవ్ర నష్టం జరిగింది. కొట్టాయంలో 46 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. 1,136 మంది అక్కడ ఆశ్రయం పొందుతున్నారు.అలప్పుజా జిల్లా పరిసరాల్లోని 26 కేంద్రాలలో 851 మందికి పునరావాసం కల్పించారు. శుక్రవారం 19 ఇళ్లు దెబ్బతిన్నాయి. తిరువనంతపురం, కొల్లాం, పతానమిట్ట, అలప్పుజా, కొట్టాయం, ఇడుక్కి, ఎర్నాకులం, త్రిస్సూర్, మలప్పురం, కోజికోడ్, కన్నూర్ జిల్లాల్లో గంటకు 50 కిమీల వేగంతో గాలులు వీస్తూ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు ఐఎండీ వెల్లడించింది. అసోంలో 24 గంటల్లో కురిసిన వర్షాల వల్ల కొండ చరియలు విరిగి పడి ఐదుగురు ప్రాణాలు కోల్పోయినట్లు కామరూప్ మెట్రోపాలిటన్ జిల్లా నివేదించింది. పట్టణ వ్యవహారాల మంత్రి జయంత మల్ల బరువా మాట్లాడుతూ గువహటి శివార్లలోని బొండా ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి శుక్రవారం ముగ్గురు మహిళలు చనిపోయారన్నారు. సహాయ, పునరావాస పనులు వేగంగా జరుగుతున్నట్లు తెలిపారు. కామరూప్ మెట్రోపాలిటన్, కామరూప్, కచ్చర్ జిల్లాల్లోని వరదలు సంభవించి, 10,150 మందిని రెండు శిబిరాలకు తరలించినట్లు ఏఎస్‌డీఎంఏ పేర్కొంది. ధీమాంజి, లఖింపూర్, గోలాఘాట్ జిల్లాలు ముంపునకు గురైనట్లు తెలిపింది. పట్టణ ప్రాంతాల్లో వరదలతో రెండు వేల మంది ప్రభావితం కాగా, ముంపు ప్రజలను తరలించడంలో ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ నిమగ్నమైనట్లు ఏఎస్‌డీఎంఏ వెల్లడించింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.